

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం fb.com/vaartha Digital

Published from Srikakulam Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

14-6-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 133 పేజీలు: 16 వెల: 6.50


ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం
మాజీ సిఎం రూపానీకి కలసిరాని లక్కీనంబర్

5లో

## టెన్త్ లోపు విద్యార్థులకు

# బస్‌పాస్‌లు ఉచితం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పాఠశాలల చదివే పిల్లల కోసం విద్యార్థి బస్‌పాస్ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తోంది. 10వ తరగతిలోపు చదివే విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు ఇస్తోంది. దీని కోసం జూన్ 14వ తేదీ నుంచి దగ్గరలోని ఆర్టీసీ బస్టాండులలోని బస్‌పాస్ కౌంటర్లలలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. రెన్యువల్ చేసుకోవాల్సిన విద్యార్థులు పాత పాస్‌లను బస్‌పాస్ కౌంటర్‌లో ఇస్తే కొత్తవి ఇస్తారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు ఒక నెల, మూడు నెలలు, అదే విధంగా ఏడాది పాటు చెల్లుబాటు అయ్యేలా బస్‌పాస్‌లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ ఫోన్ నుంచే బస్‌పాస్‌ను ఆన్‌లైన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏ డిపో పరిధిలోని విద్యార్థులు ఆ డిపోల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు సూచించారు.12 ఏళ్లలోపు ఉన్న బాలురకు, అదే విధంగా 18 ఏళ్లలోపు ఉండి 10వ తరగతి చదివే బాలికలకు ఆర్టీసీ స్టూడెంట్ బస్ పాస్‌లను ఉచితంగా అందిస్తోంది. వీరు 20 కిలో మీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు.

ఆగస్టు చివరి నాటి వరకు ఉచిత బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఐడీ కార్డుకు 50 రూపాయల ఫీజు చెల్లిం చాలన్నారు. అదే విధంగా 12 సంవత్స రాలు కంటే ఎక్కువ వయసు ఉన్న బాలురతో పాటు ఇంటర్మీడియట్ ఆపై చదివే బాలికలకు సైతం తక్కువ ధరకే బస్‌పాస్‌లను ఇస్తున్నారు.



శుక్రవారం అహ్మదాబాద్ విమానాశ్రయంవద్ద ప్రమాదం జరిగిన ప్రదేశాన్నిపరిశీలిస్తున్న ప్రధాని మోడీ

# ఇది ఊహించని పెను విషాదం

## బోయింగ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రధాని మోడీ

## గాయపడిన మెడికోలకు పరామర్శ

**అహ్మదాబాద్, జూన్ 13:** గుజరాత్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాద స్థలాన్ని ప్రధానిమోడీ శుక్రవారం సందర్శించారు. ప్రమాద వివరాలను అధికారులనుంచి అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసు పత్రికి చేరుకున్నారు. ప్రమాదంనుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమానప్రయాణీకుడు రమేష్ విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలతోనూ మోడీ మాట్లాడి వారిలో ధైర్యం

>>2

# దొరికిన బ్లాక్ బాక్స్




**అహ్మదాబాద్, జూన్ 13:** అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కీలకంగా మారిన బ్లాక్ బాక్సు లభ్యమైంది. విమానం కూలిన బిల్డింగ్ పైకప్పుపై బ్లాక్ బాక్సును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన 27 గంటల తర్వాత ఈ బ్లాక్ బాక్సు లభ్యమైంది. దర్యాప్తు బృందం ఈ బ్లాక్ బాక్సు విశ్లేషణను ప్రారంభించింది. ప్రమా దానికి గల కారణాలుఇప్పటి వరకూ తెలియరాలేదు. దీనిపై

>>2

## బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన

2లో

## గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి



శుక్రవారం సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# విశ్వనగరంగా అమరావతి

## ప్రతి ప్రణాళిక వేగంగా అమలు చేయాలి

## 1450 ఎకరాల్లో వసతులకు రూ.1052 కోట్లతో టెండర్లు

## సీడ్ యాక్సెస్ రోడ్డును హైవే16తో కలిపేందుకు టెండర్‌కు ఆహ్వానం

## గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో చర్చలు

## సిఎం చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రాజధాని విశ్వనగరంగా అమరావతిని శరవేగంగా నిర్మించాలని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. నగర నిర్మాణానికి ఉద్దేశించిన ప్రతి ప్రణాళికను అమలు చేయాలన్నారు. దీంతో పాటు ఒక క్రమపద్ధతిలో నగర నిర్మాణం సాగాలన్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని 1450 ఎకరాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1052 కోట్లతో టెండర్ పిలవడానికి సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్‌ను నేషనల్ హైవే 16కు కలిపేందుకు టెండర్‌లు పిలవాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయంలో ఎక్కడివక్కడ నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణానికి మళ్లీ అడుగులు పడ్డాయి. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన రోజునుండి అమరావతి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో రాజధాని పనులను పర్యవేక్షించిన మంత్రి నారాయణకే మళ్లీ అదే బాధ్యతను అప్పగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, పనుల నిర్ధారణ, టెండర్లు పిలవడం వంటి చర్యలతో రాజధాని పనులు పట్టాలెక్కాయన్న అభిప్రాయాన్ని కలిగించారు. అయితే, రాజధాని నిర్మాణానికి కేంద్రం నుండి నిధులనుసాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో అప్పులతో అమరావతిని

>>2

# 80% రాయితీతో రైతులకు డ్రోన్లు



## మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని దేశం లోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80% రాయితీతో రైతులకు డ్రోన్లు అందిస్తోందని వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదదల చేసారు. వాటితో అన్నదాతలు ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. సాగుకు సాంకేతికతను జోడిస్తే ఖర్చులు ఆదా అవుతాయని, సేద్యం లాభసాటిగా మారుతుందని ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాల వారీగా పరిమితంగా రైతు గ్రూపులకు డ్రోన్లు అందించింది. రాష్ట్రానికి 875 యూనిట్లు మంజూరు చేసింది. ఐదుగురు రైతుల గ్రూపులను లబ్దిదారులుగా గుర్తించింది. జిల్లాల వారీగా ఎంపిక పూర్తి చేసి వ్యవసాయ శాఖతో వారికి శిక్షణ ఇప్పించింది. ప్రతి గ్రూపు నుంచి ఒకరి చొప్పున 875 మందికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఇచ్చారు.

ఒక్కో యూనిటత్ ధర రూ.9.80 లక్షలు. ఇందులో రైతుల వాటా రూ.1.96 లక్షలు, మిగిలిన రూ. 8లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. రైతుల వాటాను బ్యాంకుల ద్వారా రుణమిప్పించి డ్రోన్ కంపెనీలకు చెల్లించేలా చర్యలు తీసుకుంది. ఒక ఎకరంలో పురుగుమందు పిచికారీ చేయడానికి డ్రోన్ పెట్టే సమయం ఏడు నిమిషాలే. అదే రైతు భుజానికి ట్యాంకు తగిలించుకొని స్ప్రే చేయాలంటే రెండు గంటలకు పైగా పడుతుంది. 12 లీటర్ల నీళ్లలో డ్రోన్ ఎకరా పంటకు స్ప్రే చేస్తుంది. అదే

>>2

# 16 కల్లా ఉపాధ్యాయుల బదలీ

## ఆంధ్రమోడల్ విద్యావ్యవస్థను అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుపుతాం

## బడుల్లో మెరుగైన విద్య ప్రభుత్వ లక్ష్యం

## 'తల్లికి వందనం'పై ఆరోపణలు నిరాధారం: మంత్రి లోకేష్




**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల బదిలీలు ఈ నెల 16(సోమవారం) కల్లా పూర్తి చేస్తామని విద్యాశాఖా మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అందరి ఆమోదంతో అద్భుతమైన సంస్కరణలు తీసుకువచ్చాం. ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్‌ను దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువుతామన్నారు. ఉండవల్లిలోని తన వ్యక్తిగత కార్యాలయంలో విద్యామంత్రి నారా లోకేష్ శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల దీటుగా ప్రభుత్వ స్కూళ్ళను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు గత విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. పాఠశాల విద్యలో మౌలిక మార్పులు తీసుకుని వచ్చామన్నారు. ప్రజలందరూ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి. తల్లికి వందనం అర్హులు ఎంత మంది ఉంటే అంత మందికీ లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం 42 లక్షల మందికి మాత్రమే అమ్మ ఒడి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేస్తున్నాం. అర్హులు ఇంకా ఉన్నా ఇస్తామని లోకేష్ తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.3,405 కోట్లు అదనంగా తల్లికి వందనం నిధులు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 18.55 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని తెలిపారు. అలానే 9600 పాఠశాలల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు విధానం పెట్టామని గత ప్రభుత్వంలో కేవలం 1200 పాఠశాలల్లో మాత్రమే ఈ విధానం అమలైందని తెలిపారు. సాంకేతిక సమస్యలతో నిధులు జమ కాకపోతే వాట్సాప్ కంప్లెయింట్ ద్వారా వాటిని పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. 2 శాతం మంది తల్లుల అకౌంట్ ఇనాక్టివ్‌గా ఉన్నాయని, వారిని మెసేజ్ ద్వారా అప్రమత్తం చేశామని తెలిపారు. తల్లికి వందనంలో రూ. 13 వేలు ఇచ్చి రూ. 2 వేలు నా ఖాతాలో పడ్డాయన్న వైసీపీ నేతలకు తీవ్ర పరిణామాలు తప్పవు అని తీవ్రస్థాయిలో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్. హెచ్చరించారు. వైకాంగ్రెస్ ప్రచారం చేస్తున్నట్టుగా రూ.2 వేలు నా ఖాతాలో పడినట్లు రుజువు చేయాలి, లేకుంటే క్షమాపణ చెప్పి ప్రకటన ఉపసంహారించుకోవాలి. అలా చేయకుంటే వారిపై చట్ట ప్రకారం ముందుకెళ్తా. అసత్య ఆరోపణలని గతంలో మాదిరి భరించేది లేదు. నిరాధార ఆరోపణలు చేసేవారు మూల్యం చెల్లించుకోక తప్పదని తమపై దుష్ప్రచార చేసేవారిని లోకేష్ హెచ్చరించారు.

**ఇంటర్మీడియట్‌లో సంస్కరణలు:** ఇంటర్మీడియట్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వాటిని సక్రమంగా అమలు చేసేందుకు కొంత సమయంపడుతుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఉన్నత విద్యలో ఇంకా చాలా సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని వాటిపై దృష్టి సారించామన్నారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ కూడా స్ట్రీమ్ లైన్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఒకరిని చదివించి మిగిలిన వారిని పనులకు పంపించే పరిస్థితి ఉండేదని ఇప్పుడు అలా లేదని తెలిపారు. ఉదయంనుంచి ఇద్దరు అంతకంటే ఎక్కువ

>>2

# సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు..

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదలీలకు మార్గదర్శకాలు

## ఒకే చోట ఐదేళ్లు నిండిన వారికి స్థానచలనం

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్త ప్రతినిది:** గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో వారి స్వంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సంబంధించి గురువారం జారీ చేసిన మార్గదర్శకాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2025 మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్ళ సర్వీస్ పూర్తి చేసిన వారికి బదిలీ తప్పనిసరి. స్థానచలనం కల్పించిన ఉద్యోగుల వివరాలు హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో జులై 10లోగా అప్‌డేట్ చేయాలి. బదిలీల తర్వాత సచివాలయాల్లో నిర్థేశించిన దానికంటే అధికంగా ఉన్న ఉద్యోగులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా చోట్లే కొనసాగనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కలెక్టర్లకే పూర్తి అధికారాలు కల్పించింది. ఈ నెల 30లోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. బదిలీల్లో వీరికి ప్రాధాన్యం ఇస్తారు, వారు అంధులు, మానసిక వికలాంగులైన పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ళకు పైగా పనిచేసిన వారు, 40శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నవారు, కేన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి సమస్యలున్నవారు, కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగాలు పొందినవారు, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే వీలైనంతవరకు సమీప ప్రాంతాల్లో వారిని నియమించాలి. వీరందరికీ

>>2



## మర్రిపాడు జాతీయ రహదారి పై భారీగా నగదు పట్టివేత

2లో



# ముగ్గురి ప్రాణం తీసిన కారు

## బంగారుపాళ్యం మండలంలో దుర్ఘటన

**బంగారుపాళ్యం, జూన్ 13 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజిపలిల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, నలురుగు గాయపడ్డారు. మృతుల్లో పలమనేరు పాతపేట ఆర్‌కె వీధికి చెందిన సయ్యద్ దిలీప్(54), బంగారుపాళ్యం మండలం తిమ్మోజిపల్లి గ్రామంకు చెందిన వి.రాజేంద్రనాయుడు(53), తిమ్మోజిపల్లి దళతవాడకు చెందిన సాదరయ్య(32)లు మృతి చెందాడు. అలాగే ఈ ప్రమాదంలో మరో నలురుగు గాయపడగా ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు వెల్లడించిన వివరాల మేరకు పలమనేరు

>>2

# నేతన్నలకు వేతనాలు పెంపు




## ప్రాసెసింగ్ ఛార్జీలు కూడా పెంచుతున్నాం: మంత్రి సవిత

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** వేలాది మంది నేతన్నలకు లబ్దిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లు రాష్ట్ర బి.సి., ఇ.డబ్ల్యు.ఎస్. సంక్షేమం, చేనేత మరియు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సాంప్రదాయ చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపుగా 1,036 చేనేత సహకార సంఘాలున్నాయని, వాటిలో 89 వేల మగ్గం నేత కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ ఆర్థికంగా ఊతం ఇచ్చే విధంగా, వారి జీవనోపాధి మెరుగుపడే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీలను గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. ఆప్కోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలు కింద పనిచేసే నేత కార్మికులకు వేతనాలు, ఛార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. బ్లీచింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.129 నుంచి రూ.148లకు (15 ), డైయింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.362 నుంచి రూ.434లకు (20 ), బెడ్‌షీట్ నేత మజూరి రూ.83 నుంచి రూ.100లకు (20 ) టవల్ నేత మజూరి రూ.31 నుంచి రూ.40లకు (30 ) పెంచడం జరిగిందని ఆమె తెలిపారు. ఫలితంగా ఒక్కో నేతన్నకు నెలకు అదనంగా రూ.3 వేల ఆదాయం రానున్నదన్నారు. ఈ విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీల పెంపుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసా కలగడమే కాకుండా నేతన్నల సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. దేశం, రాష్ట్రంలోను గ్రామీణ ఉపాధిలో

>>2

14-6pg2exHMNWJQE.qxd:14-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:51 AM Page 1







విమాన ప్రమాదంలో మరణించిన మాజీ సిఎం రూపానీ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన ప్రధాని మోడీ.
ఆసుపత్రిలో ఓ క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ప్రధాని మోడీ

# మాజీ సిఎం రూపానీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని మోడీ

**అహ్మదాబాద్,జూన్13:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంపరామర్శించారు. భర్త మరణవార్త తెలుసుకున్న లండన్‌లో ఉన్న విజయ్ రూపానీ భార్య అంజలి రూపానీ శుక్రవారం ఉదయం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ప్రధాని మోదీ.. రూపానీ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లండన్‌లో ఉన్న కూతుర్ని కలిసేందుకు గుజరాత్ మాజీ సిఎం డ్రీమ్‌లైనర్ విమానం ఎక్కారు. గతవారమే ఆయన భార్య అంజలి రూపానీ లండన్ బయల్దేరి వెళ్లారు. అయితే కొన్ని పనుల కారణంగా విజయ్ రూపానీ ఇండియాలోనే ఉండాల్సి వచ్చింది. పనులు ముగించుకొని విజయ్ రూపానీ కూడా గురువారం లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఎక్కారు. విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే అది కూలిపోయింది. ఈ ఘటనలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కుటుంబాన్ని కలిసేందుకు విమానం ఎక్కిన విజయ్‌రూపానీని మృత్యువు ఒక్కసారిగా కబళించడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు గుజరాత్ సీఎంగా రూపానీ బాధ్యతలు నిర్వర్తించారు.

# విశ్వనగరంగా అమరావతి

>> నిర్మించాల్సి వస్తోంది. ప్రపంచబ్యాంకు, ఎఐఐబి నుండి రూ.15 వేల కోట్లు, హడ్కో నుండి 11 వేల కోట్లు, బ్యాంకుల కన్సార్టియం నుండి మరికొంత రుణాన్ని తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం దశలవారిగా రాజధాని పనులను చేపట్టడానికి కసరత్తు చేస్తోంది. తరచు సీఆర్డీఏ సమావేశాన్ని నిర్వహిస్తూ రాజధాని నిర్మాణ పనులుపై సమీక్షిస్తూ కీలక కార్యచరణ చేపడుతున్నారు.ఇప్పటికే అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం తెలిపిన అథారిటీ, ఎల్ వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు ఆమోదముద్ర వేసింది. అసెంబ్లీ బేస్‌మెంట్+ జీ+ 3+ వ్యూయింగ్ ప్లాట్ ఫాంలు + పనోరమిక్ వ్యూ (బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు, ఎత్తు 250 మీటర్లు) అసెంబ్లీ నిర్మాణానికి టెండర్లలో ఎల్ వన్‌గా నిలిచిన సంస్థకు లివీతి ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. హైకోర్టు బేస్‌మెంట్ + జీ + 7 అంతస్తుల్లో నిర్మాణం, బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు ఎత్తు 55 మీటర్లు కాగా, ఎల్ వన్‌గా నిలిచిన సంస్థకు ఎల్‌ఓఏ ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీ నిర్మాణ కాంట్రాక్టును 617 కోట్లతో ఎల్ అండ్ టీ, హైకోర్టును 786 కోట్లతో ఎన్‌సీసీ సంస్థలు దక్కించుకున్నాయి .ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పలు అంశాలను ప్రస్తావించారు.సీఆర్డీఏ సమావేశంలో గత నిర్ణయాలు,వాటి కార్యచరణ ఇతరంశాలపై అధికారులనుంచి సమాచారం తెలుసుకున్నారు.ఈ సందర్భంలో గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో మాట్లాడామని మంత్రి నారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో రివర్ బండ్, సాలిడ్ వేస్ట్ ప్లాంట్‌లు ఎలా ఉన్నాయనేది అధ్యయనం చేశామని అన్నారు. యూపీ అధికారులు ఏపీకి వచ్చి సాలిడ్ వేస్ట్ ప్లాంట్‌లపై అధ్యయనం చేయనున్నారని మంత్రి నారాయణ తెలిపారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో చర్చించినట్లు వివరించారు. ఇంకా యూపీ పర్యటనలో ఘనవ్యర్థాల నిర్వహణపై పలు అంశాలు చూశాము. వారు మన రాష్ట్రానికి వచ్చి ప్లాంట్లు స్టడీ చేస్తామని యూపీ అధికారులు చెప్పారు సీడ్ యాక్సెస్ రోడ్డును హైవే16తో కలిపేందుకు టెండర్ పిలవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.1,450 ఎకరాల్లో వసతులకు రూ.1,052 కోట్లతో టెండర్లకు ఆమోదించారు.ఇక ఇప్పటికే ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమరావతికి చుట్టు పక్కల ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల వినోద, క్రీడలు, తదితర వాటికి హబ్‌లుగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ సన్నద్ధమవుతోంది. ఎక్కువ విస్తీర్ణంలో అటవీ భూములు తీసుకునేందుకు సీఆర్డీఏ ప్రయత్నాలను ప్రారంభించింది. మళ్లింపు (డైవర్షన్) విధానంలో ఈ భూములను తీసుకుని ఇతర ప్రాంతాల్లో ఇంతే విస్తీర్ణంలో బదలాయించేందుకు దృష్టి సారించిందన్న విషయం సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. రాజధాని ప్రాంతంలోని వివిధ అటవీ బ్లాక్‌లలో పలు కార్యకలాపాలు చేపట్టేందుకు సీఆర్డీఏ నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాల్లో సుమారు 10,357 ఎకరాల అటవీ భూమి ఇతర అవసరాల రీత్యా మళ్లించనున్నారు. డీనోటిఫికేషన్ కంటే డైవర్షన్ విధానం మేలన్న నిర్ణయానికి వచ్చారు. దీని కోసం సీఆర్డీఏ అధికారులు ఏలూరు, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అటవీ అధికారుల నుంచి వివరాలను తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని గుడిమెట్ల, కొత్తూరు, చంద్రగూడెం, దాసుళ్లపాలెం, టి.గన్నవరం,తోలుకోడు, వెల్వడం, కొండపల్లి, జంగాలపల్లి. కృష్ణా జిల్లోలోని మెట్లపల్లి, ఏలూరు జిల్లాలోని కాట్రేనిపాడు, వట్టిగుడిపాడు నుంచి 5,090.52 ఎకరాలు తీసుకోనున్నారు. గుంటూరు, పల్నాడులో కర్లపూడి, కొండవీడు, మోతడక, నిడుముక్కల, పెదమద్దూరు, వెంకటాయపాలెం ఎక్స్‌టెన్షన్1, 4, 5, 7, 8 బ్లాక్‌ల్లో 5,267.28 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఈ భూములకు సంబంధించి గతంలో సర్వే చేసిన వివరాలు, పటాలను సీఆర్డీఏ అధికారులు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు..

>> రిక్వస్ట్ ట్రాన్స్‌ఫర్లుగా పరిగణించి భత్యాలు వర్తింపచేయాలి. +ఐటీడీఏల్లో మొదట ఖాళీలు నింపాలి.అంతర్గత వెనుకబడిప ప్రాంతాల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యమివ్వాలి.ఐటీడీఏ ప్రాంతాల నుంచి బదిలీ అయిన వారి స్థానంలోకి వేరొకరు వచ్చి చేరాకే రిలీవ్ చేయాలి.హేతుబద్ధీకరణ,బదిలీలు ఒకేసారి జరుగుతాయి.గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ,బదిలీలను ప్రభుత్వం ఒకేసారి చేపట్టింది. హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలు (నంబర్లు 1,3,4) అనుసరించి బదిలీలు చేయాలని కలెక్టర్లకు సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరిలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు,'బీ'లో ఏడుగురు,'సి'సీలో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరిలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు,'బీ'లో ఏడుగురు,'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని నిర్ణయించింది. వీరికి స్పెసిఫిక్ పర్పస్ (టెక్నికల్),జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను బదిలీల్లో కలెక్టర్లు పాటించనున్నారు. హేతుబద్ధీకరణ,బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక సచివాలయాల్లో మిగులు ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్‌లపై పంపనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల నుండి 15 వేల మంది మిగులు ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరందర్నీ ప్రస్తుతానికి అవే సచివాలయాల్లో కొనసాగిస్తారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో అవసరాల మేరకు వీరిని దశలవారీగా డిప్యుటేషన్లపై పంపాలని నిర్ణయించారు. గత వైకాపా ప్రభుత్వం ఒక్కో సచివాలయంలో 8 నుండి 12 ఉద్యోగులను నియమించింది. హేతుబద్ధీకరణలో ఆ సంఖ్యను 6 నుండి 8కి కూటమి ప్రభుత్వం తగ్గించింది.

# తుని మున్సిపాలిటీలో 26లక్షల నగదు గోల్‌మాల్
# జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జూన్ 13 ప్రభాతవార్త:** తుని మున్సిపాలిటీలో 26 లక్షల నగదు గోల్మాల్ ఘటన వెలుగు చూసింది. ఈ గోల్మాల్ వ్యవహారంలో మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న ఎం. సునీత నిధులను దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణపై మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ భాగాలలో పన్నుల రూపంలో వసులైన నగదుతో పాటు, చిట్టా వసూళ్లను సైతం సునీత బ్యాంకులో పిడిఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, గత ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుండి ఈ ఏడాది ఫిబ్రవరి 6వతేదీ వరకు జమైన సొమ్మును 26లక్షల 20వేల 75 రూపాయల నగదును జమ చేయకుండా తప్పుడు లెక్కలతో బురిడీ కొట్టించినట్లుగా తేలింది. ఎట్టకేలకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి రికార్డులను క్షుణంగా పరిశీలించగా నిధులు గోల్‌మాల్ వ్యవహారం బయటపడినట్లు మున్సిపల్ ఆఫీస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.పురపాలక శాఖ ఆర్డీ నాగ నరసింహారావు ఆదేశాలతో అధికారుల బృందం గోల్ మాల్ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# మర్రిపాడు జాతీయ రహదారి పై భారీగా నగదు పట్టివేత

**మర్రిపాడు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** మండలంలోని జిల్లా సరిహద్దు వద్ద గుర్తుతెలియని కారు కలకలం స్థానికుల సమాచారంతో బాట సింగనపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై MP 09 ZJ 1076 రిజిస్ట్రేషన్ కియా కారును స్వాధీన పరుచుకున్న పోలీసులు కారులో భారీ ఎత్తున నగదు తరలిస్తూకారు వదిలి నగదుతో పరారైన డ్రైవర్,మరో వ్యక్తి గుజరాత్ కు చెందిన ఓ వ్యాపార వేత్త ఇచ్చిన పిర్యాదుతుతో రంగంలోకి దిగిన పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం ఈ ఘటనతో ఒక్క సారిగా యాక్టివ్ అయిన జిల్లా పోలీసు యంత్రాంగం మర్రిపాడు (మం) బాటా సింగనపల్లి సమయపంలో 565 జాతీయ రహదారిపై నిన్న ఉదయం నుండి ఆగి ఉన్న కారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని కారును పరిశీలించి అనుమానాస్పద కారుగా గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రేషన్‌గా గుర్తించిన పోలీసులు కారులో భారీగా నగదు తరలించినట్లు సమాచారం రావడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కారు వదిలేసి పారిపోయిన నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నిందితుల నుండి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు అనుమానం. వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

# కేంద్ర సర్వీసులకు ఇద్దరు సీనియర్ ఐఎఎస్ అధికారులు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి చెందిన ఇద్దరు సీనియర్ ఐఎఎస్ అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న జె. నివాస్‌ను జనగణన కార్యకలాపాల డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అలాగే 2011 బ్యాచ్ కు చెందిన రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ఐజీగా ఉన్న ఎం. హరి నారాయణన్, ఢిల్లీలోని తాగునీరు, పారిశుద్ధ్య శాఖలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వీరు ఇరువురినీ వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. జె. నివాస్ వెళ్లడంతో ఖాళీ అయిన ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నియామకానికి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌గా ఉన్న వీరపాండియన్‌కు రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ విజయానంద్ ఆదేశాలిచ్చారు.

# మరో నాలుగురోజులు భారీ వర్షాలు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర కోస్తాంధ్రను ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిషా మీదుగా సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని నుంచి ఛత్తీస్‌గఢ్, మరాత్వాడ, ఇంటీరియల్ కర్ణాటక వరకూ ద్రోణి విస్తరించి ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. వీటి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. శుక్రవారం ఎన్టీఆర్ ,పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా,గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం.. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడిచింది. పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## 16 కల్లా ఉపాధ్యాయుల బదిలీ

>> మంది పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ వీడియోలు, స్క్రీన్ షాట్ మేసేజ్‌లు పెడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఫీడ్ బ్యాక్ చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. గతంలో పని చేసిన విద్యాశాఖ మంత్రికి కనీసం బేసిక్స్ తెలియవు. యూకేజీలో ఫ్రీప్రైమరీ, ఎల్ కేజీ, యూకేజీ పిల్లలు ఉంటారు. ఈ స్కీమ్ వారికి వర్తించదు. గత ప్రభుత్వం గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో(జీఈఆర్) చూపించేందుకు 18ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న వారిని తీసుకువచ్చి ఏకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్నారని వారిని ఎన్‌రోల్ చేయడం జరిగింది. పక్క రాష్ట్రంలో చదువుతున్న పిల్లలను తీసుకువచ్చి ఆంధ్ర రాష్ట్రంలో చదవు తున్నారని చూపించడం జరిగింది. నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లో పెట్టారు. మొత్తం పరిశీలిస్తే దొంగలెక్కలు ఉన్నాయని తేలింది. ఒక విద్యాశాఖ మంత్రికి ఎంత మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారో తెలుసుకునేందుకు నాకు వంద రోజులు పట్టింది. గతంలో విద్యాశాఖను ఏవిధంగా నడిపించారో నాకు తెలియదు. ఏదో నెంబర్లు ఉన్నా యంటే వారెందుకు అమ్మఒడి ఇవ్వలేదు? అర్హులు ఎంతమంది ఉన్నారో వారందరికీ ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మొత్తం లిస్ట్ జీఎస్ డబ్ల్యూఎస్‌లో పెడతాం.సాయం అందకపోతే ఎందుకు రాలేదో మనమిత్రకు వెళ్లి తెలుసుకో వచ్చు. కరెక్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

## ముగ్గురి ప్రాణం తీసిన కారు

>> పాతపేటకు చెందిన సయ్యద్ దిలీప్‌కు శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అతని అల్లుడు సయ్యద్ అలీ తన కారులో చికిత్స నిమిత్తం చిత్తూరుకు పయనమయ్యాడు. ఆ సమయంలో వీరితో పాటు సయ్యద్ దిలీప్ భార్య ముబినా, కుమార్తె ఫాతిమా, మనుమరాలు సహద్‌లు బయలుదేరారు. చిత్తూరుకు వస్తున్న వీరి కారు అతివేగంగా తిమ్మోజిపల్లి వద్ద సర్వీసు రోడ్డు ప్రక్కన నిల్చొని వున్న రాజేంద్రనాయుడు, సాదరయ్యలను ఢీకొంది. ఆ సమయంలో కారును అదుపు చేయలేకపోవడంతో సమీప మామిడి తోటలోకి కారు దూసుకెళ్ళి పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో రాజేంద్రనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు వెనుక సీటులో సయ్యద్ దిలీప్ సైతం మృత్యువాత పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సాదరయ్య, ముబినా, ఫాతిమా, సహద్, సాహిద్ అలీలను చికిత్స నిమిత్తం 108 వాహనంలో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాదరయ్య మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

# పెను విషాదం

>> నింపారు. ఆయన వెంట గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రహోంమంత్రి హర్షసంఘవి తదితరులు ఉన్నారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థంచేసుకోగలనంటూ విచారం వ్యక్తంచేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం వెంటాడుతుందని, ఆ వేదనను మాటల్లో చెప్పలేమన్నారు. విషాద సమయంలో తన ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలగురించేనన్నారు. ఆ తర్వాత అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో మోదీ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. ఇదేరోజు ఎయిరిండియా ఎండి సిఇఒ. క్యాంప్‌బెల్ విల్సన్‌కూడా ప్రమాదస్థలాన్ని సందర్శించి ప్రమాదం తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా అహ్మదాబాద్‌కు చేరుకుని సమీక్షిస్తారు. మరోవైపు ప్రమాదస్థలంలో జాగిలాల సాయంతో మృతదేహాల గుర్తింపు వెలికితీసేపనిలో సిబ్బంది నిమగ్నం అయ్యారు.

**ఎలా బతికానోకూడా తెలియదు...మోడీకి బాధితుడి వివరణ:** కాగా చికిత్స పొందుతున్న విశ్వాస్‌కుమార్‌తో మోదీ మాట్లాడారు. నమ్మలేకుండా ఉందని, ఎలా బతికానో కూడా తెలియడంలేదని చెప్పారు. విమానంలో 11ఎ సీటులోక ఊర్చున్న రమేష్ ఎమర్జెన్సీ విండోనుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారంటూ తొలుత పోలీసులు చెప్పారు. ఆతని సోదరుడు ధీరేంద్ర సోమ్‌భాయ్‌కూడా అదే స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రమేష్ మాత్రం జరిగింది అదికాదని స్పష్టతఇచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని, తమ విమానం నేలకూలుతుందన్న విషయం తనకు అర్థమయిందని, ఆవెంటనే విమానం కిందకువచ్చి ముక్కలయి పేలిపోయిందని ప్రమాదక్షణాలు గుర్తుచేసుకున్నాడు.38 ఏళ్ల బ్రిటిష్ ఇండియన్ అయిన రమేష్ అద్భుతం జరిగిందని ప్రమాద సమయంలో విమానం రెండుముక్కలయిందని,తనసీటు ఎగిరి కొంచెం దూరంలోపడిపోయిందని ఈక్రమంలోనే తనకు గాయాలయ్యాయని చివరకు ప్రాణాలతో బయటపడ్డానని రమేష్ ప్రధానికి వివరించారు.

## దొరికిన బ్లాక్ బాక్స్

>> అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు బ్లాక్ బాక్స్ లభ్యం కావడంతో ప్రమాదానికి ఖచ్చిత మైన కారణాలు తెలిసే అవకాశం ఉంది. విమాన ప్రమాదాల్లో బ్లాక్ బాక్స్ కీలకం అవు తుంది. ఇది ఆరెంజ్ కలర్‌లో ఉంటుంది. విమానం, హెలికాప్టర్ల ప్రమాదం జరిగేకంటే కనీసం రెండు గంటల ముందు ఏం జరిగిందన్న వివరాలను ఈ బ్లాక్‌బాక్స్ స్టోర్ చేసుకుంటుంది. విమానాలు క్రాష్ అయినా ఇందులోని సమా చారం తొలగిపోదు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు.

## బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భద్రతా సమీక్ష జరిపేంత వరకూ బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానాలను తాత్కాలికంగా నిలిపివేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందు కోసం భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అహ్మదాబాద్ దుర్ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నందున అది పూర్తి కాగానే 7878 విమాన సేవలు కొనసాగించాలా, వద్దా? అనే దానిపై కేంద్రం ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ 7878 విమానం కుప్పకూలిన ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికుల్లో 241 మంది మృతిచెందగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటలకు టేకాఫ్ అయిన వెంటనే అనూహ్యంగా బీజే మెడికల్‌కాలేజీ డాక్టర్ల రెజిడెన్షియల్ క్వార్టర్స్‌లోకి విమానం దూసుకుపోయింది. ఆ తర్వాత మంటల్లో చిక్కుకుంది. ఇంజన్లలో ముందుకు లాగే శక్తి కోల్పోవడం, పక్షి ఢీకొనడం వంటివి విమానం కూలిపోవడానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానం అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థలు కలిగి ఉండి ఇంధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటుందనే పేరుంది. 2011 అక్టోబర్‌లో ఈ డ్రీమ్‌లైనర్ సేవలు మొదలైనప్పటి నుంచి గత 14 ఏళ్లలో 100 కోట్ల మంది ప్రయాణికులను సురక్షితంగా చేరవేసిందని, ఏవియేషన్ చరిత్రలో ఏ డ్రీమ్‌లైనర్ కూడా ఇంత వేగంగా రికార్డు సాధించలేదని బోయింగ్ వెబ్‌సైట్ చెబుతోంది. ఈ మోడల్ ప్రవేశపెట్టినప్పటి నుంచి 2,500 వరకూ 787 ల అమ్మకాలను బోయింగ్ జరుపగా, ఎయిర్ ఇండియా 47 విమానాలను కొనుగోలుచేసింది. కాగా, అహ్మదాబాద్‌లో విమానంకుప్పకూలిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశించినట్లు పౌరవిమానయానమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మందితో పాటు, విమానంకూలిన ప్రదేశంలోని నివాస భవ నాల్లో ఉన్న ఐదుగురు పౌరులుకూడా మరణించారు. ఈ విషాద ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. భారత్‌కు ఈ క్లిష్ట సమయంలో అండగా నిలుస్తామని, అవసరమైన సహాయం అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. విమాన శకలాలు, కాలిపోయిన వస్తువులు ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇప్పటికే జిజె వైద్యకళాశాల హాస్టల్‌భవనంపై పడటంతో సీనియర్‌డాక్టర్లు, రెసిడెంట్ డాక్టర్లు పలువురు మృతిచెందారు. ముందురోజు 20 మందికి పైగా మృతిచెందగా శుక్రవారం తాజాగా మరో ఐదుగురు మృతిచెందారని అధికారులు ధృవీకరించారు.

# నేతన్నలకు వేతనాలు పెంపు

>>వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి పెద్ద పీఠ వేయడం జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు చేదోడుగా ఉండేందుకై ఎగ్జిబిషన్లు, విక్రయదారులు, కొనుగోలు దారుల సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అదే విధంగా ఎన్నికల సమయంలో చేనేతలకు 50 సంవత్సరాలకే ఫించను ఇస్తామని ఇచ్చిన హామీని నిలపెట్టుకోవడం జరిగిందని, ప్రతి నెలా రూ.4 వేల చొప్పున దాదాపు 92,274 మంది నేతన్నలకు ఫించను అందజేయడం జరుగుచున్నదన్నారు. నేతన్న మగ్గాలకు ఉచితంగా విద్యుత్తు అందజేయడం జరుగుచున్నదని, మర మగ్గాలకు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. గృహ నిర్మాణ పథకం క్రింద కూడా నేతన్నలకు రూ.50 వేలు అదనంగా అందజేయడం జరుగుచున్నదన్నారు.


**చేనేత, హస్తకళల నూతన డిజైన్ల పోటీలు:**.రాష్ట్రంలోని నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని మంత్రి తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఆప్కో, లేపాక్షి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 17 నుంచి 30 రోజుల పాటు నూతన డిజైన్లను కళాకారుల నుంచి స్వీకరిస్తున్నామన్నారు. పలు కేటగిరీల్లో ఉత్తమ డిజైన్లను ఎంపిక చేసి విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నామని ఆమె తెలిపారు.

**నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం :** నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం కలిసి పలుసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ,నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రూ.1000కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80% రాయితీతో రైతులకు డ్రోన్లు

>> మనుషులతో అయితే 100 లీటర్ల దాకా పడుతుంది. డ్రోన్ నేరుగా మొక్క మీదకు స్ప్రే చేస్తుంది. దీనివల్ల మందు వృథా కాదు. మనుషులు చల్లితే వృథా ఎక్కువగా ఉంటుంది. డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తే ఎకరాకు రూ.350వసూలు చేస్తారు. అదే మనుషులైతే ఇద్దరు కూలీలు అవసరమవుతారు. రైతులకు ఇచ్చే డ్రోన్ 12లీటర్ల ట్యాంకుతో కలిపి దాని బరువు 29 కేజీలు. ఈ డ్రోన్‌తో రోజుకు 10 ఎకరాల్లో మందు పిచికారీ చేయగలదు.డ్రోన్‌తో మందులు స్ప్రేచేయిస్తే ఆరోగ్య సమస్యరావు.మనుషుల చల్లితే ముక్కు,నోట్లోకి మందువెళ్ళి,దీర్ఘకాలం లోపల వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఊపిరితిత్తులు, శ్వాసకోశ,జీర్ణాశయ వ్యాధులు సోకే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ప్రమాదస్థలంలో చెక్కుచెదరని 'భగవద్గీత' పుస్తకం లభ్యం!



**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లో ఏవియేషన్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా జరిగిన బోయింగ్ ప్రమాదంలో మొత్తం భస్మీపటలం అయినప్పటికీ ఆ ప్రమాద స్థలంలో ఒక భగవద్గీత పుస్తకం మాత్రం చెక్కుచెదరకుండా నిలిచింది. ఈ పవిత్ర గ్రంథం చెక్కు చెదరకుండా ఉండడం, లోపలి పేజీలుకూడా కాలిపోకుండా సురక్షితంగా నిలవడంపై అందరూ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విస్తృతంగా ఈ దృశ్యం వైరల్ అవుతోంది. ప్రమాదస్థలంలో గాలిస్తున్న సిబ్బంది ఒకరు గీత పుస్తకం పేజీలను తిప్పి చూపిస్తున్నారు. ఈసంఘటన గీత సందేశం యొక్క శాశ్వత పవిత్రతను సూచిస్తున్నదని, కష్టసమయాల్లో అర్థంచేసుకునేందుకు కష్టాల్లో ఉన్న వారు గీత పారాయణం చేస్తారని నెటిజన్లు విస్తృతంగా స్పందించారు. హిందూ తత్వశాస్త్రంలో భగవద్గీతకు కేంద్రస్థానం ఉంది. విధి నైతికత జీవితం మరణం యొక్క స్వభావంపై ప్రతిబింబాలను అందిస్తుంది. ప్రమాదం సందర్భంలో కొంతమంది ఈ పుస్తకాన్ని చదువుకుని ఉంటారని తెలుస్తోంది. ఈవిడియో ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌పై షేర్‌చేసిన కొన్నినిమిషాలకే 5.77 లక్షలమంది చూసారు.

## వారం - వర్జ్యం

తేది : 14-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
తదియ మ.3.44
ఉత్తరాషాఢ రా.12.20
వర్జ్యం తె.4.26-7.15
దు.తె.5.35-7.15
శుభసమయం :ఉ.5.15-5.45
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావనవుంటుంది.

**వృషభం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు పొందుతారు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** కళా, రాజకీయ రంగాల వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**కన్య :** దీర్ఘకాలిక కోర్టుకేసుల నుండి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖులతో ముఖ్య విషయాలపై ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. అనుకోని విధంగా డబ్బు చేతికందుతుంది.

**వృశ్చికం:** సోదరుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు నిదానంగా ఫలిస్తాయి.

**ధనుస్సు:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. రుణవత్తిడులు తొలుగుతాయి.

**మకరం:** ఆర్థికపరమైన ఇబ్బందులు తొలుగుతాయి. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశం మీ చెంతకువస్తుంది.

**కుంభం:** అన్ని పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగుతాయి.

**మీనం :** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురై చికాకులు పెడతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాయలసీమ రైల్వే డివిజన్ పర్యటనకు దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాధూర్



**గుంతకల్లు రైల్వే,జూన్ 13,ప్రభాతవార్త** నవ్యాంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాధూర్ తన తొలి అధికారిక పర్యటనను రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్ నుండి శ్రీకారం చుట్టారు. ఈ నెల 15న ఆదివారం తెల్లవారుజామున 3.35గంటలకు విశాఖపట్నం నుంచి తిరుపతికు నెంబర్ 17481బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి తిరుపతికి రాత్రి 10.30గంటలకు చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి విజయవాడకు సోమవారం సాయంత్రం 5.15గంటలకు బెంగళూరు నుంచి కాకినాడ వెళ్లే నెంబర్ 17209శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి విజయవాడ వెళతారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం పర్యటన ఖరారు కావడంతో గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికార యంత్రాంగం తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ పనుల వివరాలతో పాటు గుంతకల్లు రైల్వే డివిజన్ భౌగోళిక స్వరూపం,సరిహద్దులు, డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, మౌలిక సదుపాయాల కల్పన పనులను, సరుకు రవాణాకు సంబంధించిన లోడింగ్ పాయింట్లు, రైళ్ల రాకపోకల వివరాలు డివిజన్‌కు సంబంధించిన సమగ్ర సమాచార నివేదికను జనరల్ మేనేజర్ సందీప్ మాధూర్‌కు అందచేసే నిమిత్తం ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# 20వేల నుండి లక్షదాటిన భక్తులు !



**- వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంతోనే వెలుపల క్యూలైన్ల నియంత్రణ**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** 1990వ సంవత్సరంవరకు రోజుకు 20వేలమంది భక్తులు మాత్రమే తిరుమలకు చేరుకునేవారు. ఇలా వచ్చిన వీరికందరికీ ఆలయంలోపల ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామిని మరీ దగ్గరగా వీక్షించేలా కులశేఖరపడివరకు అనుమతించేవారు. 1992వ సంవత్సరంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజువారీగా 30వేలకు చేరింది. దీంతో అదే సంవత్సరం ఆలయం లోపల రాములవారిమేడవరకు (లఘుదర్శనం) మాత్రమే అనుమతించి దేవుని దర్శనం చేయించేవారు. ఇలా 2000వ సంవత్సరంలో ఈ రద్దీ కాస్త పెరిగి రోజుకు 60వేలమంది వరకు వచ్చేవారు. ఉన్న వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారు. దీన్ని తెలుసుకున్న అప్పటి రాష్ట్రప్రభుత్వం, టిటిడి పాలకమండలి అదనంగా మరో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ అవసరాన్ని గుర్తించింది. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మరింతగా పెరగడంతో 2000 సంవత్సరంలో వైకుంఠమ్ 2 కాంప్లెక్స్ నిర్మించి క్రౌడ్‌మేనేజ్ చేశారు. అక్కడ నుండి ప్రతి ఏటా తిరుమలేశుని దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం శ్రీవారి భక్తులు రోజువారీగా అనూహ్యంగా లక్షమంది దాటడంతో ఔటర్ రింగురోడ్డు శిలాతోరణంవరకు కిలోమీటర్ల క్యూలైన్లలో భక్తులు ఎండకు,వానకు,చలికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. సాధారణ రోజుల్లోనే లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు, విశేషరోజుల్లో 1.50లక్షల మంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. సాధారణరోజుల్లోనే లక్షమందివరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్ల దూరం భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి.గంటకు 4,500మంది భక్తులకు మహాలఘువిధానం (ఆలయంలోపల జయవిజయులవరకే)లో అనుమతిస్తున్నా 90వేలమందికి మాత్రమే దర్శనం చేయించగలుగుతున్నారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్యదైవమ్... ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ,ఏడాదికేడాది భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు సాధారణరోజుల్లోనే నిండిపోతున్నాయి. వైకుంఠమ్ కాంప్లెక్స్‌లు నిండితేనే భక్తులకు కష్టాలు మొదలవుతాయి. ఎండకు,వానకు ,చలికి ఇబ్బందులు పడటం తప్పడంలేదు. ఇప్పటికీ టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెలుపల క్యూలన్లలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. దీంతో భక్తులు కొంతవరకు సంతోషంగా నిరీక్షిస్తున్నారు. అయితే తిరుమలేశుని దర్శనార్థం దేశవిదేశాల నుంచి కొండకు వస్తున్న భక్తుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. నెలవారీగా 23లక్షలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండటం జరుగుతుంది. లక్షమంది భక్తులకు మరింత సులభంగా దేవుని దర్శనం చేయించడం గగనంగా మారింది.వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమ్ కల్పించే మాట ఎలా ఉన్నా ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తులు సంతోషంగా తిరిగి వెళ్ళాలని తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు ఆకాంక్షించడం పరిపాటి. అంతేగాక మహాలఘు దర్శనం కూడా లఘుదర్శనం చేయించే భాగ్యం కలుగుతుందనే సూచనలు వినిపిస్తున్నాయి. సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌కు అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు,జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజులు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడుకొండలపై 50వేలమంది భక్తులు సంఖ్య పెరిగితేనే క్యూలైన్లు తిరుమల వెలుపల కిలోమీటర్లదూరం విస్తరిస్తున్నాయి.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు ఇద్దరు దాతల విరాళాలు



**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా పేదవారికి ఉచితంగా అవసరమైన శస్త్రచికిత్సలు, గుండె ఆపరేషన్లు ఇతరత్రా మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా టిటిడి అమలుచేస్తున్న ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు, బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి ఇద్దరు దాతలు శుక్రవారం 20.50లక్షలు రూపాయలు డిడిలను అందించారు. విజయవాడలోని ఫార్చ్యూయన్‌ఫైన్ జ్యువెలర్స్ కోమటి సునీల్ ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు 10.50లక్షలు రూపాయలు డిడిలు, తాడేపల్లిగూడెంకు చెందిన మాతురు పంచాక్షరి బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 10,00,116రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. దాతలను ఆయన అభినందించారు.

## 'లడ్డూ'ప్రసాదంపై ఆరోపణలు నమ్మొద్దు

**- నాణ్యతతో రుచి, శుచిగా లడ్డూలు తయారీ**



**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతటి పవిత్రమైన లడ్డూ ప్రసాదం ఎంతో భక్తితో రుచిగా,శుచిగా తయారుచేసి విక్రయిస్తున్నట్లు టిటిడి స్పష్టం చేసింది. అయితే తెలంగాణా రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తి తిరుమల లడ్డూప్రసాదంపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నాడని తీవ్రంగా పేర్కొంది. జూన్ 8వతేదీ స్వామివారిలడ్డూప్రసాదం తినే సమయంలో నోటిలో గాయమైందని ఆరోపణలు చేశాడు. వెంటనే స్పందించిన టిటిడి అధికారులు అతనిని అంబులెన్స్‌లో తిరుమలలో అశ్వనీఆస్పత్రికి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు చేశారు.ఆ తరువాత తిరుపతి స్విమ్స్‌ఆస్పత్రిలో కూడా వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపింది. ప్రసాదం తినేసమయంలో నాలుకను తానే కొరుక్కోవడంతో నాలుకక్రింద భాగంలో చిన్నపాటి గాయమైనట్లు రిపోర్టు వెలువడింది. దీనిపై టిటిడి నుండి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశ్యంతో లడ్డూప్రసాదంపై సామాజిక మాధ్యమంలో అసత్యఆరోపణలు చేస్తున్నట్లు టిటిడి గుర్తించింది. దీన్ని తీవ్రంగా ఖండించి, భక్తులు గందరగోళానికి గురిచేయడం జరుగుతుందని టిటిడి తెలిపింది. భక్తులు లడ్డూప్రసాదంపై ఆరోపణలు, అపోహాలు నమ్మవద్దని, ఎంతో శుచిగా రుచిగా తయారుచేస్తున్నారని వెల్లడించింది. ప్రస్తుతం అత్యాధునిక యంత్రాలతో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతలో ,శుచిలో రాజీఉండదని టిటిడి వివరించింది. లడ్డూల నాణ్యత, దిట్టంలో భాగంగా నెయ్యి, జీడిపప్పు, ఎండుద్రాక్ష,యాలకులు,పచ్చకర్పూరంమిశ్రమం కూడా శుచిగానే వాడకం వుంటుంది. లడ్డూల నాణ్యతపై ప్రస్తుత పాలకమండలి, టిటిడి ఉన్నతాదికారులు తరచూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణా భక్తుడి ఆరోపణలు దురుద్దేశ్యంతోనని టిటిడి స్పష్టం చేసింది.

# భౌగోళిక వారసత్వ జాబితాలో బెలూం గుహాలకు గుర్తింపు : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** భౌగోళిక వారసత్వ జాబితాలో ప్రఖ్యాత బెలూం గుహలకు గుర్తింపు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని బెలూం గుహలకు జీఎస్ఐ ప్రత్యేక గుర్తింపునివ్వడం సంతోషకరమన్నారు. పురాతన సంస్కృతీ నిలయాలు ఈ బెలూం గుహలని వెల్లడించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటనతో పర్యాటకంగా మరింత ప్రాచుర్యం లభిస్తుందని తెలిపారు. ప్రపంచంలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలూం గుహలకు గుర్తింపు వచ్చింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో కొలువుదీరిన వీటిని భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. సుమారు 23 ఎకరాల భూమి లోపల ఏర్పడిన వీటిని క్రీ.పూ.450 ఏళ్ల కిందట నివాస స్థలాలుగా వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. హెచ్‌బీ పూటే అనే ఆంగ్లేయుడు 1884లో వీటిని కనుగొన్నారు. తర్వాత 198284 మధ్యలో హెచ్‌డీ గేబర్ అనే జర్మనీ దేశస్థుడు తన సహచరులతో కలిసి 3 వేల 225 మీటర్ల వరకు శోధించి పటాన్ని తయారు చేశారు. 1988లో ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖ రక్షిత స్థలంగా ప్రకటించింది. 1999లో పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేస్తోంది.బెలూం గుహలో 40 మెట్లు దిగిన తర్వాత 10 మీటర్ల లోతులో మొదలై 30 మీటర్ల లోతు వరకు సొరంగాలు ఉన్నాయి. ఇక్కడ కొన్నిచోట్ల ఇరుకుగా, మరికొన్ని చోట్ల విశాలంగా గదుల మాదిరిగా ఉంటుంది. కొన్నిచోట్ల స్టాట్రిక్ లైట్లు, స్మాల్ గేట్లు అని పిలిచే స్పటికాకృతులు ఏర్పడి ఉన్నాయి.కృత్రిమ శిలల ఆకృతులను బట్టి కొన్ని ప్రదేశాలకు వెయ్యి పడగలు, కోటి లింగాలు, ఐరావతం, ఊడలమర్రి, మాయామందిరం వంటి పేర్లు పెట్టారు. గాన ధ్యాన మందిరం, మండపం ఉన్నాయి. ఈ బెలూం గుహల చివరి వరకూ వెళ్తే పాతాళగంగ అనే నీటి మడుగుతోపాటు అక్కడే రాతిలో ఉన్న శివలింగం దర్శనమిస్తాయి ఏడాది పొడవునా 33 డిగ్రీల ఉష్ణోగ్రత : గుహల లోపల ఏడాది పొడవునా 33 డిగ్రీల స్థిరమైన ఉష్ణోగ్రత ఉండటమే కాకుండా గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ గుహలోని నీటికి సమీప గ్రామంలోని ఓ శివాలయం పక్కనే ఉన్న రాతి బావిలోని నీటికి సంబంధం ఉంది. 30 కిలో మీటర్ల దూరంలో తాడిపత్రి వద్దనున్న పెన్నా నది నీటిమట్టం కూడా దీనిపై ప్రభావం చూపుతోంది. జీఎస్ఐ జాబితాలో చోటు దక్కడం వల్ల బెలూం గుహలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయన్నారు. ప్రపంచలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు ప్రసిద్ధి చెందాయని వ్యాఖ్యానించారు. దేశ పర్యాటక ప్రదేశాల్లో రాష్ట్రంలోని బెలూం గుహలకు స్థానం దక్కుతుందని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా మరింత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పర్యాటక రంగం అభివృద్ధి తెందుతోందని వెల్లడించారు.బెలూం గుహలకు భౌగోళిక వారసత్వ ప్రాంతంగా గుర్తింపు లభించిన నేపథ్యంలో గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

## 'హంస' ఆఫీస్ బేరర్ల ధ్రువపత్రాలు గుర్తించొద్దు

**- వైద్య ఆరోగ్య శాఖ ఆదేశం**

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణ బదిలీల్లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్(హంస) నుంచి ఆఫీస్ బేరర్లుగా పేర్కొంటూ అందచేసిన ధృవపత్రాలను పరిగణనలోకి తీసుకోవద్దని వైద్య ఆరోగ్య శాఖ ఆదేశించింది. ప్రజారోగ్య శాఖ పరిధిలో ఉన్న ఈ సంఘం సభ్యత్వ నమోదు జాబితాలో ఉద్యోగ విరమణ చేసిన వారు,పొరుగు సేవల సిబ్బంది,చనిపోయిన వారి పేర్లు ఉన్నాయి. సంస్థాగత ఎన్నికలు,ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో 'హంస' సంఘం గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేసి,లోతుగా విచారణ చేసేందుకు మరో కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మరోవైపు...ఈ సంఘం తరపున ఆఫీస్ బేరర్లుగా ఉన్నామంటూ ప్రజారోగ్య శాఖ ప్రధాన కార్యాలయం,26 జిల్లాల్లో కలిపి 249 మంది బదిలీల్లో భాగంగా అధికారులకు ధృవపత్రాలు సమర్పించారు. ఈ బదిలీల వరకు గుర్తించొద్దని జిల్లాలకు ఆదేశాలు పంపినట్లు ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నెం. 02/2025-26, తేది: 03.06.2025
కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ (పి.ఆర్.ఐ) డివిజన్, టెక్కలి పరిధిలో 2 పనుల నిమిత్తం రూ.26.50 లక్షల అంచనా విలువతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు తేది: 13.06.2025 తదుపరి ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.apeprocurement.gov.in నందు లభ్యమగును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ (పి.ఆర్.ఐ) డివిజన్, టెక్కలి.
DIPR.NO.16693/CL/ADVT/1/1/2022-23 తేది: 13.06.2025

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(స్పాన్సర్డ్ బై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)
న్యూకాలనీ బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా.

సంక్షిప్త డిమాండ్ నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: ది M/s. 999 స్టోర్, C/o. శ్రీ కొండక తిరుపతిరావు, తండ్రి: మొఖలింగం, డోరు నెం. 6-1-86, తెప్పల వీధి, గాంధీ పార్కు దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం-532001. మరియొక చిరునామా: డోరు నెం.05-1-83, కృష్ణా పార్కు దగ్గర, 5-పుణ్యపు వీధి, పాలకొండ రోడ్డు, మహిళామండలి వీధి, పుణ్యపు వీధి జంక్షన్, శ్రీకాకుళం-532001. మరియు ది M/s. 999 స్టోర్, C/o. శ్రీమతి కొండక మల్లేశ్వరి, భర్త: తిరుపతిరావు (సహ ఋణగ్రహీత), డోరు నెం. 6-1-86, తెప్పల వీధి, గాంధీ పార్కు దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం-532001.మరియొక చిరునామా: డోరు నెం.05-1-83, కృష్ణా పార్కు దగ్గర, 5-పుణ్యపు వీధి, పాలకొండ రోడ్డు, మహిళామండలి వీధి, పుణ్యపు వీధి జంక్షన్, శ్రీకాకుళం-532001.
II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం : ఎస్.ఎం.ఇ.73199284265
III) చెల్లించవలసిన బాకీ మొత్తము: తేది.19-05-2025 నాటికి రూ.7,31,077/- (అక్షరాల ఏడు లక్షల ముప్పై ఒక వేల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే)+తేది: 20-05-2025 నుండి భవిష్య వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతరఖర్చులు, మొదలైనవి.
IV) డిమాండ్ నోటీసు తేది : 19-05-2025.
V) హైపోతికేషన్ స్టాక్స్ తేది: 20-12-2022 నాటికి :

| Sl.No. | ITEMS | Rate | Quantity | Amount Rs. |
|---|---|---|---|---|
| 1 | T SHIRTS | 399 | 355 | 1,41,645 |
| 2 | TRACKS | 449 | 38 | 17,062 |
| 3 | SHIRTS | 499 | 262 | 1,30,738 |
| 4 | COTTON PANTS | 599 | 93 | 55,707 |
| 5 | COTTON PANTS | 699 | 16 | 11,184 |
| 6 | JEANS | 699 | 65 | 45,435 |
| 7 | SHIRTS | 699 | 456 | 3,18,744 |
| 8 | JEANS | 799 | 26 | 20,774 |
| 9 | SHIRTS | 799 | 64 | 51,136 |
| 10 | HOODIES | 899 | 3 | 2,697 |
| 11 | SHIRTS | 899 | 91 | 81,809 |
| 12 | HOODIES | 999 | 8 | 7,992 |
| 13 | SHIRTS | 999 | 10 | 9,990 |
| 14 | SHIRTS | 999 | 89 | 88,911 |
| 15 | TROASERS | 999 | 88 | 87,912 |
| 16 | SHIRTS | 1049 | 253 | 2,65,397 |
| 17 | JEANS | 1199 | 178 | 2,13,422 |
| 18 | SHIRTS | 1199 | 108 | 1,29,492 |
| 19 | SHIRTS | 1299 | 7 | 9,093 |
| 20 | SHIRTS | 1599 | 43 | 68,757 |
| 21 | JEANS | 1999 | 67 | 1,33,933 |
|  | TOTAL |  |  | 18,91,830 |

పైన చెప్పబడిన ఋణ గ్రహీత ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, (మునుపటి Apgvb) న్యూ కాలనీ బ్రాంచ్ వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి ఋణము సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము నిరర్థక (NPA) ఖాతాగా పరిగణింపబడినది. బ్యాంకు వారు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసుకు సంబంధించిన తిరుగు రశీదులు లేనందున ఈ పత్రికా మూలముగా మీకు ఈ నోటీసు జారీ చేయడమగుచున్నది. కావున సదరు ఋణగ్రహీత పైన పేర్కొన్న బకాయి మొత్తములను నోటీసు తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.
తేది : 19-05-2025 అధీకృత అధికారి
ప్రదేశం : శ్రీకాకుళం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

## చర్లపల్లి-తిరుపతి మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు జూలై వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,జూన్ 13,ప్రభాతవార్త** సీమాంధ్ర మీదుగా చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య రెండు వేర్వేరు మార్గాలలో తిరుగుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణీకుల సౌకర్యార్థం జూలై ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07251ఎక్స్‌ప్రెస్‌ను జూలై 2నుంచి 30వరకు పొడిగించగా, తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07252ఎక్స్‌ప్రెస్‌ను జూలై 3నుంచి 31వరకు పొడిగించారు. ఈ రైళ్లు ఖాజీపేట,విజయవాడ,గూడూరు, రేణిగుంట మీదుగా తిరుగుతాయి. అలాగే ప్రతి శుక్ర,ఆదివారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07017ఎక్స్‌ప్రెస్ జూలై 4నుంచి 27వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి సోమ,శనివారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07018ఎక్స్‌ప్రెస్‌ను జూలై 5నుంచి 28వరకు వరకు పొడిగించారు. ఈ సర్వీసులు కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు,డోన్,గుత్తి,కడప,రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

## దశాబ్దకాలం క్రిందటి విధానం పునరుద్ధరణ!

# తిరుమలలో కాటేజీల వద్దకు ఆర్టీసి ఉచిత బస్సు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వచ్చేభక్తుల సౌలభ్యంకోసం కొండపైన సిఆర్ఓ, ఆర్టీసి బస్టాండు,ఆలయం ముందుభాగం, ఎంబిసి, పద్మావతివిచారణ కార్యాలయం ప్రాంతాల నుండి భక్తులు గదులకు చేరుకోవడానికి ఉచితంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే విధానం టిటిడి పునరుద్దరించేందుకు సిద్దమైంది. అన్ని ప్రాంతాలనుండి కాటేజీల వద్దకుగానీ, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లవరకు, వెలుపల క్యూలైన్లవరకు భక్తులను సులభంగా చేరవేసేందుకు వీలు కల్పిస్తూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మంచి నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం గతంలోనే 2019కి ముందు కరోన వైరస్ వ్యాప్తిచేందేవరకు అమలులో ఉండేది. 2014లో తిరుమలలో టిటిడి ఇఒగా డాక్టర్ దోండపాటి సాంబశివరావు, తిరుమల జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజు పాలనలో భక్తులను చేరవేసుందుకు ఆర్టీసి బస్సులను తిరుమల బాలాజీ బస్టాండ్ నుండి కాటేజీల ప్రాంతాల్లో



తిరుగుతూ గమ్యస్థానంలో దించేవారు. దీనివల్ల యాత్రికులు, భక్తులు తాము వెళ్ళాల్సిన కాటేజీలకు, విచారణ కార్యాలయాలకు నేరుగా చేరుకునేవారు. ట్యాక్సీల దోపిడీనుండి విముక్తికలిగింది. తిరుపతి నుండి తిరుమలకు చేరుకునే తిరుమల,పుత్తూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు 1,2,కుప్పం, మదనపల్లి, పలమనేరు, నెల్లూరు, గూడూరు, వెంటకగిరి, సత్యవేడు ఆర్టీసి డిపోల బస్సులు తిరుమలలో కాటేజీల చుట్టూ తిరిగి భక్తులను దించడం ,తిరిగి అక్కడ నుండే ఎక్కించుకోవడం జరిగేది. దీనివల్ల భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బందులు, తలనొప్పులు ఉండేదికాదు. అయితే 2019లో కరోన వైరస్ వ్యాప్తితో ఇవన్నీ రద్దయ్యాయి. ఆ తరువాత ఇప్పటివరకు తిరుమలలో ఉచిత ఆర్టీసి బస్సులు భక్తుల కోసం ఏర్పాటుకాలేదు. ప్రస్తుతం తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద నుండి ఆలయం వరకు పలుకాటేజీల చుట్టూ తిరుగుతూ టిటిడి ధర్మరథాలు (ఉచితబస్సులు) నడుస్తున్నాయి. ఈ బస్సులు పూర్తిగా ఎలక్ట్రిక్(విద్యుత్)తో నడిచేవి ఉన్నాయి. ఇవన్నీ కూడా భక్తుల రద్దీకి సరిపోవడంలేదు. తక్కువ సంఖ్యలో ధర్మరథాలతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమయంలో తప్పనిసరిగా యాత్రికులు కాటేజీల వద్దకు చేరుకోవాలన్నా, కల్యాణకట్ట, సిఆర్ఓ, పద్మావతి,ఎంబిసి విచారణ కార్యాలయల వద్దకు ప్రైవేటు ట్యాక్సీలపై ఆధారపడక తప్పడంలేదు. ట్యాక్సీడ్రైవర్లు భక్తులను దోచేస్తున్నారనేది టిటిడికి అందుతున్న ఫిర్యాదులు. రోజువారీగా తెలుగురాష్ట్రాల నుండేగాక తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుండి 80వేలమంది భక్తులు తిరుమలకు చేరుకుంటుంటే వీరిలో 20వేలమంది వరకు యాత్రికుల తమ సొంత వాహనాల్లో వస్తున్నారు.

# కొమ్మినేని విడుదలకు 'సుప్రీం' ఆదేశం

## మరోసారి అలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహించవద్దని హెచ్చరిక

విజయవాడ. జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి మహిళలపై ఓ ఛానల్‌లో అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కొమ్మినేని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని స్పష్టం చేసింది. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, వాటిని ప్రోత్సహించేలా ప్రవర్తించవద్దని, భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం కొమ్మినేనిని హెచ్చరించారు అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు జూన్ 24 వరకు మంగళగిరి కోర్టు రిమాండ్ విధించింది.అసభ్య వ్యాఖ్యలపై మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదుతో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ1గా కృష్ణంరాజు, ఏ2గా కొమ్మినేని శ్రీనివాసరావు, ఏ3గా టీవీ యాజమాన్యాన్ని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొమ్మినేనిని అరెస్టు చేసి గుంటూరు నల్లపాడు తరలించారు. మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఛానల్‌లో జరిగిన చర్చకు సంబంధించిన వీడియోలను న్యాయమూర్తి ఎదుట ప్రదర్శించారు. రిమాండ్ విధించాలని పోలీసులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే కొమ్మినేనిపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం సెక్షన్లను న్యాయమూర్తి తొలగించారు.

## ఇంధన, ఎఐ రంగాలపై అమరావతిలో డబ్ల్యూఇఎఫ్ కేంద్రం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఆర్థిక వేదిక 'డబ్ల్యూఈఎఫ్)కి చెందిన నాలుగో పారి శ్రామిక విప్లవ కేంద్రం నెట్ వర్క్ (సీ4ఐఆర్)తో కలిసి రాజధాని అమరావతిలో 'ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియెన్స్' పేరుతో ప్రత్యేక కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. భారతదేశంలో ఏర్పాటయ్యే మొదటి థిమాటిక్ సీ4ఐఆర్) సెంటర్ ఇదే అవుతుంది. డబ్ల్యూఈఎఫ్‌కి చెందిన సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్‌తో కలిసి ఆధునిక ఇంధన రంగం,హారిత పరిశ్రమలపై కృషి చేయడం,డబ్ల్యూఈఎఫ్‌కి చెందిన సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీతో కలిసి...ఏఐ ఆధారిత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్,సైబర్ సెక్యూరిటీపై పనిచేయడం. ఈ కేంద్రం ఏర్పాటు వెనుక ముఖ్యోద్దేశం. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు,గ్రీన్ ఎనర్జీ,ఏఐ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడులు ఆకర్షించేందుకు,అంతర్జాతీయ విధాన నిర్ణాయక,నవకల్పనల వేదికలపై ఆంధ్రప్రదేశ్‌కు స్థానం లభించేలా చూడటం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యాలు. రాష్ట్ర ఐటీ,మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి దీనికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. డబ్ల్యూఈఎఫ్ తరపున సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోఛైర్‌గా వ్యవహరిస్తారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెంబర్ సెక్రటరీగా ఉంటారు.

ప్రకృతి అంతా త్యాగంతో, ప్రేమతో మనల్ని సేవిస్తుండగా, మనం ప్రకృతి పట్ల, సాటి ప్రాణుల పట్ల, ఎలా ఉంటున్నామో ఆలోచించాలి.

-ఎమ్. షాగిన్యాన్

# మాటలకందని విషాదం

విమానయాన చరిత్రలోనే అత్యంత విషాద కరమైన దుర్ఘటనను తలచుకుంటేనే మనసును కలచివేస్తుంది. ఇంతటి విషాదాన్ని మును పెన్నడూ మన దేశం ఎరుగదు. విమాన ప్రమాదానికి కారణాలేవైనా, కారణాలెన్నున్నా, దర్యాప్తుకు వీలైన అన్ని కోణాలు సాంకేతిక లోపమేనని ధృవీకరిస్తోంది. ఎన్నో విమానాలు నడిపి దాదాపు 8200కిలోమీటర్లు ప్రయాణించిన పైలెట్ సైతం ప్రమాదాన్ని తప్పించలేని పరిస్థితిలో అశువులు బాసాడు. విధి లిఖితం కాకపోతే మరేమిటి!? విమానంలో ఎంతో ఉత్సాహంతో విదేశంలో పని ముగించుకుని తమ గమ్యస్థానాలకు చేరుకుంటామని ఎదురు చూసే విదేశీ ప్రయాణికులకు మృత్యువు ఎదురొచ్చింది. స్వదేశం నుంచి విదేశాల్లో ఉన్న కుమార్తెను చూసి రావాలనుకున్న గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ రూపానీ వంటి వారిని అకాల మృత్యువు కబళించింది. విమానంలో ఉన్న వారంతా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. సిబ్బంది, పైలెట్లు ప్రయాణికులు పరిసర జనావాసాల్లో వెరసి 269 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మసిబారిన మృతదేహాలను వారి అస్థికలను గుర్తించాలన్నా డిఎన్ఏ పరీక్షల వల్లనే సాధ్యం. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం ఎఐ 171 అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాంట్విక్ విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.38 నిమిషాలకు విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అదుపు తప్పి అహ్మదాబాద్‌లోని మేఘానీ నగర్‌లోని బిజె వైద్య హాస్టల్ భవనాల్లోకి చొచ్చుకునిపోయింది. అహ్మదాబాద్ విమానాశ్రయ చరిత్రలో ఇది రెండో పెద్ద ప్రమాదం. 1988 అక్టోబర్ 19 న ఇండియా ఎయిర్లైన్స్ విమానం విమానాశ్రయంలో లాండింగ్ అవుతుండగా కుప్పకూలి అందులోని 13 మంది ప్రయాణికులు బలయ్యారు. తాజా ప్రమాదంలో బ్రిటన్ పౌరుడు విశ్వాస్ కుమార్ రమేష్ మృత్యుంజయునిగా బతికి బయట పడ్డారు. 11నెం. సీట్లో ఎమర్జెన్సీ డోర్ వద్దకూర్చోవడమే అతని అదృష్టం కావచ్చు. ఇంతటి విషాదంలో ఇదొక అద్భుతం. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థల నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్త విమాన ప్రమాదాల్లో 35శాతం టేకాఫ్ సమయంలో కానీ, ఆ వెంటనే కానీ జరుగుతుంటాయి. మిగిలిన సందర్భాల్లో ప్రమాదాలు బహు తక్కువే. చనిపోయిన వారిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 గురు పోర్చుగీసు వాసులు, ఒక కెనడియన్ ఉన్నారు. విమానం ఢీకొట్టిన బి జె వైద్యకళాశాల హాస్టల్ విద్యార్థులు సిబ్బంది 150మందికిపైగా ఉన్నారు. విమానం టేకాఫ్ అయిన 59 సెకన్లలోనే కుప్పకూలింది. విమానం అక్కడి నుంచే ప్రయాణం ప్రారంభించడంతో, సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన 1.25 లక్షల లీటర్ల ఇంధనం ట్యాంక్ నిండా ఉంది. అదేఇంత పెద్ద ప్రమాద విస్ఫోటానికి కారణమైంది. అసలు కారణంతెలియాలంటే బ్లాక్ బాక్స్ విశ్లేషణ జరగాల్సిందే. ప్రమాద సమయంలో వైద్య కళాశాల హాస్టల్ మెస్‌లో భోజనానికి ఉపక్రమించిన తరుణంలో 'రేపటి డాక్టర్ల' కల చెదిరిపోయింది. వారి కుటుంబాలన్నీ విషాదంలో మునిగిపోయాయి. వారిని ఓదార్చడం ఎవరివల్ల కావడం లేదు. అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో ఎంతో సురక్షితంగా భావించే బోయింగ్ క్రాఫ్ట్ కుప్పకూలడం ఆశ్చర్యమే మరి. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఇచ్చిన 'మేడే కాల్'కు స్పందించేలోగానే విమానం భస్మీపటలమయ్యింది. డ్రీమ్ లైనర్ అనగానే 290 మంది ప్రయాణికుల సామర్థ్యం కలది. ఏకబిగిన 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలదు. ఖండాంతర ప్రయాణానికి ఎంతో పటిష్టమైనదన్న అభిప్రాయం పైలెట్లందరిలోనూ వ్యక్తమౌతోంది. రెండు ఇంజన్లు పని చేయక పోవడమే ఈ దుర్ఘటనకు కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. నిర్దిష్ట పదజాలాన్ని ఉపయోగిం చి మాట్లాడే రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా ఈ ప్రమాదాల నుంచి కాపాడలేకపోవడం చెప్పుకోవాలి. టేకాఫ్ సజావుగానే జరిగింది. కానీ గేర్లను పైకి తీసుకునేలోపల రెండు ఇంజిన్లు క్రియా శీలకతను కోల్పోయి ఉండొచ్చునని మాజీ సీనియర్ పైలట్ కెప్టెన్ సౌరభ్ భట్నాగార్ ఈప్రమాదాన్ని విశ్లేషిస్తున్నారు. డివిఆర్ రికార్డర్, బ్లాక్ బాక్స్‌లే అసలు కారణాలను నిర్ధారించాలి. ప్రధాని నరేంద్రమోడీ విగత జీవుల మధ్య ఈ ప్రమాదస్థలిని చూసి చలించిపోయారు. దిగ్భ్రాంతి చెందిరు. ఊహించని ప్రమాదం జరగడంతో ప్రపంచవ్యాప్త నిపుణులు ప్రమాద కారణాలపై విశ్లేషణలు చేపట్టారు. కెప్టెన్ కూడా సుదీర్ఘదూరం విమానం నడిపిన అనుభవం ఉన్నవాడే. ప్రమాదాన్ని పసికట్టగలిగిన వాడే. వీటన్నిటినీ క్రోడీకరించు కుంటే ఈ ప్రమాదం సాంకేతిక వైఫల్యమనే నమ్మాలి. ఇదే విమానంలో 6నెలల నాడు సాంకేతిక లోపాలు తలెత్తాయని, వాటిని సజావుగాపూర్తి చేసినట్లు యాజమాన్యం చెబుతోంది. 13 ఏళ్లుగాఈ విమానం ఎన్నో ప్రయాణాలు చేసింది. ఎందరినో గమ్యస్థానాలకు చేర్చింది. మానవ మేధ, కృత్రిమ మేధ కలగలిపితే సాధించలేనిదేదీ లేదని రుజువవుతున్న తరుణంలో ఇలాంటి ప్రమాదాలు విస్మయమే. విమాన ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అవసరం. ఈ ప్రమాదం బోయింగ్ విమానాల భవితవ్యంపై నీలి నీడలు ఏర్పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. బోయింగ్ నిర్మాణంలో నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి ప్రక్రియల విషయమై మరోసారి ఆలోచించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. తమ విమానాలు బయలుదేరేముందే వాటి సమర్థతను నిర్ధారించే అంశాలన్నిటిలోనూ ఆధునిక మేళకువలు పాటించాలి.

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.



సిసిరో

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక,దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

# ప్రజావాక్కు



### ఎపి సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజనానంతరం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సేవలు తెలంగాణాకుమాత్రమేపరిమితమైపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోనిఆ విశ్వవిద్యాలయ స్టడీసెంటర్లు కొనసాగటం లేదు. ఎంతో ముందుచూపుతో ఆనాటి ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి 1982లో వయోజనులు, అనేక కారణాలతో మధ్యలోనే చదువు ఆపేసినవారు దూరవిద్య ద్వారా డిగ్రీ స్థాయిలో చదువుకునే విధంగా "అందరికీ చదువు" నినాదంతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ఏర్పాటుచేశారు.ఆతరువాత ఆ విశ్వవిద్యాలయం పేరును డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. ఒకే పేరుతో రెండు రాష్ట్రాల్లో సార్వత్రిక విశ్వవిద్యాలయం కొనసాగలేదు కనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ప్రారంభించాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ఫీజులపై నియంత్రణ అవసరం

ఇటీవలప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులపెరుగుదల సామాన్య ప్రజలకు తీవ్రఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అనూహ్యంగా వేలల్లో ఫీజులు పెంచుతున్న స్కూళ్లు, కాలేజీలు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఒకవిద్యార్థికి ఒక్క సంవత్సరానికి వచ్చేమొత్తం ఖర్చులక్షలరూపాయలను దాటి పోతోంది. ఇంతటితో ఆగకుండా, కంప్యూటర్ కోర్సులు, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు కూడా తమ వద్దే కొనాలని బలవంతం చేస్తున్నారు. తక్షణమే ఫీజుల నియంత్రణ కోసం కఠినమైన నిబంధనలను రూపొందించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యోగాకు విస్తృత ప్రచారం

జూన్21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించే నిమిత్తం ఎపి ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసం ప్రకటించింది. నేడు యోగ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తిస్తున్నారు.ఆధునిక జీవనంలో ఒత్తిడినుంచి స్వాంతన చేకోరడానికి యోగ ఉత్తమ సాధనం. యోగాతో ఆరోగ్యం మానసిక ప్రశాంతత కూడా చేకూరుతాయి.

-సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

### జన భార(త) మ్

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. అది నలభై ఏళ్లలో 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది.అలా తక్కువగా కొనసాగడం ప్రపంచ వ్యాప్తంగాఉన్నసమస్య.కాబట్టి దాన్నిఅధిగమించాలా,లేదా ప్రపంచంతోనే నడుస్తూ,భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కర లేదా అన్నది ఒక కోణం. ఇప్పుడు దృష్టి పెట్టాల్సినవి రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి.ఒకటి జనాభాలో 68శాతం పని చేయగల వయస్సు వారు. అరవై నాలుగుసంవత్సరాల లోపు వారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికలు,అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గాల్లో ప్రాణాలు

ఎయిర్ ఇండియా ప్లైన్ క్రేష్ విషాధాతంలో అశువులు బాసిన వారికి కండోలెసెన్స్ తెలియ జేస్తూ ముఖ్యంగా గమనించ విషయాలు ఏమిటంటే ముందుగా ఫిట్నెస్ అఫ్ ప్లైట్ ఏమిటి, దాని మైంటెనెన్స్ ఎలా ఉంది క్షుణ్ణంగా పరిశీలించి గాలిలోకి వెళ్ళాలి. చాలా సందర్భాలలో మనము విన్న మాట కొంచెం ఎయిర్ ఇండియా ఫ్లైట్స్ గురించి అసంతృప్తి మాటలే. ఫ్లైట్ కనీసపు ఎత్తుఎగరకుండా క్రేష్ అయ్యిందంటే ఇంజన్ టెక్నికల్‌గా ఫాల్ట్ ఉందా అనేది తెలియవలిసిన విషయం. విషయాలు తరువాత తెలియవలిసినవి ఎన్నిఉన్నా అవి ఆక్సిడెంట్ అయిన తరువాత. మరి ముందుగా చేయవలసిన పనుల నిర్లక్ష్యం వల్లే కదా జరిగిందని అందరూ అనేమాట. ఎన్ని జరిగినా ఇదే పరిస్థితి పోస్ట్ మారటం హడావుడిలే..

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### పెరుగుతున్న కరోనా కేసులు

కరోనాతో మరణిస్తున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఇటీవల మొదలైన కరోనా పట్ల అంత భయం లేకున్నా ఇప్పటికీ స్వీయ రక్షణ చర్యలు అవసరం అని ఈ మరణాలు చాటుతున్నాయి. అయితే దీనికి ప్రధాన కారణం ప్రజలలో కరోనా పట్ల పెరిగిన అవగాహన.ఏది ఏమైనా కరోనా పట్ల తగు జాగ్రత్త అవసరం అని చాటుతున్న సందర్భం ఇది.

-భారత అవినాష్, జనగామ

**మన విఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేవుళ్ల భూములకు శఠగోపం!

**ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మ కర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

భారతీయ సంస్కృతిలో మారుపేరుగా భక్తివిశ్వాసాలకు నిలయాలుగా ప్రజాదరణ పొంది ఒకనాడు దేదీప్యమానంగా వెలుగొందిన దేవాలయాలు రానురాను నేడు దీనావస్థకు చేరుకుంటున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు వేలాదికోట్ల రూపాయల ఆస్తిపాస్తులున్నా నిత్య పూజలకు కూడా నోచుకోలేక కనీసం దీపం పెట్టే దిక్కులేక కళావిహీనంగా ఎన్నో ఆలయాలు జీర్ణావస్థకు చేరుకుంటున్నాయి. రాజకీయ అవసరాల కోసం దేవుడిని, దేవాలయాలను, దైవభక్తిని దుర్వినియోగం చేసే దుష్టసంప్రదాయం ఆరంభమైనప్పటి నుంచి దేవాలయాల వ్యవస్థ పతనం ప్రారంభమైందనే చెప్పొచ్చు.పవిత్రమైన హిందూ దేవాలయ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరిగిపోతున్న కొద్దీ, దేవుళ్లకు, భక్తులకు కష్టాలు పెరిగిపోతున్నాయి. ఎన్నోసార్లు ఈ విషయంలో హిందూధర్మాచార్యుల సభ ఆందోళన వ్యక్తం చేసింది. దేవాలయాలపై వచ్చే ఆదాయం దైవప్రచారానికి, ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని కొందరు పీఠాధిపతులు, మఠాధిపతులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. అంతేకాక దేవాలయ ఆస్తులను కాపాడేందుకు ఒక ఉద్యమం చేపట్టే అవసరం వస్తుందని కూడా పెద్దలు వక్కాణించారు. కానీ ఎవరు ఎంత అరిచి గీ పెట్టినా,ఎన్ని హెచ్చరికలు చేసినా దేవుళ్ల ఆస్తులను దుర్వినియోగాన్ని నివారించలేకపోతున్నారు. ఒర్లి,ఒర్లి వారుపోతారు. వందుకతిని వీరు పోతారన్నట్లుగా ఉంది పరిస్థితి. గతంలో ఎన్నోవిదేశీ దాడులను ఎదుర్కొని, మరెన్నో ఆటుపోట్లను తట్టుకున్న దేవుళ్లు ఇప్పుడు స్వజనుల దోపిడీని, దుర్మార్గాలను నిర్మూలించలేక పోతున్నారేమోననిపిస్తున్నది. జీతభత్యాలపై ఉన్న శ్రద్ధ దేవుళ్ల ఆస్తులపై ఉండడంలేదు. రెవెన్యూ చట్టాల్లో తరుచుగా వస్తున్న మార్పులు,చేర్పులు ఈ దేవాలయ భూములను ఆక్రమించేవారికి కల్పతరువుగా మారుతున్నాయి. అసలు దేవాలయాల భూములకు, భవనాలు ఎన్ని ఉన్నాయి? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటిపై రావాల్సిన ఆదాయం ఎంత? ఎంత వస్తున్నది? సబ్‌లీజ్‌ల పేరుతో మధ్యవర్తులు ఎంత భోంచేస్తున్నారు? తదితర వివరాలు దేవాదాయ శాఖ వద్ద స్పష్టంగా లేవనే చెప్పొచ్చు. కొన్ని తెలిసినా, రకరకాల కారణాలతో నోరు విప్పరు. అంతెందుకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర పరిధిలో దేవుళ్లకు ఉన్న ఆస్తులు ఎన్ని? వాటిపై వస్తున్న ఆదాయం గురించి తెలుసుకుంటే విస్తుపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం తెలుగురాష్ట్రాల్లో దాదాపు మూడులక్షల డెబ్బైవేల ఎకరాలకు పైగా దేవాలయ భూములున్నట్లు అనధికార అంచనా.ఇందులో తెలంగాణ రాష్ట్రంలో ఎనభైవేల ఎకరాలకుపైగా భూములున్నాయి. గతంలో ఈ భూములకు రికార్డులు ఎంతో పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం, ఖర్చులు తదితర వివరాలు అన్నీ నమోదు చేయడమేకాక జమాబంది రూపంలో తనిఖీలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ రికార్డులు ఏమయ్యాయో? ఏ మేరకు రాస్తున్నారో? ప్రశ్నార్థకమే.దేవాలయ భూములకు సంబంధించి నిజాంకాలం నుండే కాదుఅంతకు ముందు నుంచి కూడా ఒక నిర్దిష్టపద్ధతిలో నమోదయ్యేవి. 1349 ఫసలీ నుంచి తెలంగాణలో మొత్తం దేవాలయ భూములు వాటిపై వస్తున్న ఆదాయం తదితర అంశాలు నమోదు చేసేవారు. ఆదాయం, ఖర్చులకు సంబంధించి ఆర్డీఓ స్థాయి అధికారితో జమాబందిలో లోతుగా పరిశీలించేవారు. దేవుని సొమ్ము ఏమాత్రం భోంచేసినట్లు తేలినా, భూములు ఆక్రమించినట్లు బయటపడినా తీవ్రంగా శిక్షలు ఉండేవి. అప్పటివరకు అమలులో ఉన్న మద్రాసు యాక్టును ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా కొంతకాలంకొనసాగించారు. పి.వి నర్సింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమ

ఒక్క మాట

యంలో తెలంగాణ,ఆంధ్ర దేవాలయ శాఖలనుకలిపివేశారు. అప్పటివరకు అంతో ఇంతో రెండురాష్ట్రాల్లో విరివిగా రికార్డులుండేవి. రానురాను భూములు అన్యాక్రాంతం కావడం, దీనికి సంక్షేమం పేరుతో వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇష్టానుసారంగా దేవుళ్ల భూములను కేటాయించడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీర్ఘకాలపు లీజుల పేరుతో కొన్ని, మరికొన్ని సాగు పేరుతో ఇలా రకరకాల దేవుని భూములు అన్యాక్రాంతమయ్యాయి.అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకుని కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గట్టిగానే చెబుతున్నారు. కాని క్రియాశూన్యం. గతంలోనూ ఆ శాఖమంత్రులు, ఇలాగే చెప్పారు. కానీ ఒక్క అడుగు ముందుకు కదిలిన పాపాన పోలేదు. ఎక్కడైనా దేవాలయ భూముల గతి ఇంతే. పర్యవేక్షించేవారు పరాకుగా ఉంటే, దేవుని మాన్యాలను భోంచేసేవారు హుషారుగానే ఉంటారన్నది విదితమే. ఇక్కడా, అక్కడా అనికాదు. తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాలకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు చెబుతున్నారు. ఇకపోతే భక్తులు సమర్పించుకునే కానుకలు కొన్ని చోట్ల పక్కదారిపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దేవుల హుండీలకు కూడా కన్నాలు పడుతున్నాయి. ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తిరుమల తిరుపతి వెంకన్న కూడా ఈ అవినీతిపరుల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఆ దేవదేవునికి సమర్పించుకుంటున్న ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూల్లో వాడే నెయ్యిలో కల్తీ జరిగినట్టు సాక్షాత్తు అధికారులే ప్రకటించడంతో భక్తులు విస్తుపోతున్నారు. భారీ ఎత్తున జరిగే ఈ కుంభకోణంలో దేశఅత్యుతన్న న్యాయస్థానం జోక్యంతో ఉన్నతస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నది. నిన్నమొన్నటివరకు టిటిడీలో కీలకపాత్ర వహించిన అధికారగణంపై విమర్శలు చుట్టుముట్టుతున్నాయి. మరికొందరు ధర్మకర్తలపైకూడా ఈఆరోపణల పరంపర కొనసాగుతున్నది. వాస్తవంగా ధర్మనిష్టాపరులు,నీతికి,నిజాయితీకి నిలువుటద్దంలా ఉండేవారు పాలనామండలిలో ధర్మకర్తలుగాఉంటే ఇంత భారీ ఎత్తున అవకతవకలకు అవకాశం ఉండకపోవచ్చుననే అభిప్రాయాలను తోసిపుచ్చలేం. అధికారులతో ఇలాంటి ప్రమాదం ఉంటుందనే దేవుళ్ల ఆస్తులను కాపాడేందుకు భక్తులు సమర్పించుకునే ప్రతిపైసాను సద్వినియోగం చేసేందుకు ఎంతో ముందు చూపుతో మనపెద్దలు ధర్మకర్తల వ్యవస్థను ఏనాడో ఏర్పాటు చేశారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా లాభాపేక్షకు తావులేకుండా దేవుని సేవలో తరించిపోవాలనే ఆశయాలున్నవారిని భూ విరాళాలు సమర్పించుకున్నవారిని ధర్మకర్తలుగా నియమించేవారు. నీతి,నియమనిష్టలతో, భక్తి విశ్వాసాలతో, సత్ప్రవర్తనలతో ప్రజలకు ఎంతో ఆదర్శంగా, అనుకరణీయంగా ఉండేవారు. కానీ పంచాయతీరాజ్ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామ రాజకీయాలు చోటు చేసుకోవడంతో ఆ ప్రభావం దేవాదాయ వ్యవస్థపై పడింది. ధర్మకర్తల మండళ్లు, రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోతున్నాయి. వ్యక్తిగతగుణాలు, దైవచింతన వంటి ఉత్తమ గుణాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ అనుయాయులను, పార్టీ కార్యకర్తలను, ఎన్నికల్లో నిలబడలేని వారిని, నిలబడినా ప్రజలతో తిరస్కరించబడినవారిని పునరావాసంగా ధర్మకర్తల మండలిలో నింపడం ప్రారంభమైనప్పటి నుంచి దేవుళ్లకు కష్టాలు ప్రారంభమయ్యాయని చెప్పొచ్చు. ఈ పదవులను ఉపయోగించుకొని దేవుళ్ల సొమ్మును స్వాహా చేసిన పెద్దలు ఎందరోఉన్నారు. దేవుళ్లను ఉపయోగించుకొని తమ వ్యాపారాలను విస్తరించుకున్నవారు కూడా లేకపోలేదు.ఒక్క మాటలో చెప్పాలంటే వీరి సహకారం,అధికారుల తోడ్పాటు లేకుండా దేవుడి సొమ్మును అక్రమమార్గాలవైపు మళ్లించడం అంత సులభం కాదు. ఏయే కార్యక్రమాల్లో పాల్గొనాలో దేవుడి సొమ్ము ఎంతెంత భోంచేశారో ఆయా ప్రాంతాల భక్తులకు కూడా తెలియందికాదు. ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మకర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ●

# ఆదాయ అసమానతలు తగ్గితేనే ఆర్థిక వృద్ధి సాధ్యం!


డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

జిడిపి పరంగా 4.187 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచ దేశాలలో నాలుగవ స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత మన దేశం ఉన్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ మన దేశపు నీతి అయోగ్ తెలియజేయడం ఎంతో సంతోషం. ఐఎంఎఫ్ ప్రకారం మనదేశంలో తలసరి ఆదాయం 2013-14 లో 1438 యూఎస్ డాలర్లు ఉండగా 2025 నాటికి 2880 డాలర్లుగారెట్టింపు అయిందని తెలుస్తున్నది. ఇప్పుడు ఏ విధంగా మన ఆర్థిక వ్యవస్థ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్తున్నారు. బిలియనీర్ల సంఖ్య పెరిగితే దేశం ఆర్థిక అభివృద్ధి జరిగినట్లేనా?1990లలోఇద్దరే ఇద్దరు బిలియనీర్లు మనదేశంలో ఉండగా నేడు 332మంది ఉన్నారు. వీరి సంపద విలువ మన దేశస్థూల జాతీయోత్పత్తిలో సుమారు ఒకటి బై మూడు వంతు ఉన్నది. భారత్ లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుదైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో, వస్తు ఉత్పత్తులతో గణనీయంగా పెరిగిమానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగా వెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించినారు. అయితే ఈ విధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థిక విధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించలేకపోయారు. ప్రభుత్వం రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదని, నష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశంలో నిరుద్యోగిత, మానవ వనరుల విధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారులవశం చేయడానికి దేశంలోవృద్ధి ప్రక్రియ అంతా పెట్టుబడిదారుల కనసన్నల్లోకి పోయింది.మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యా, వైద్య జీవన ప్రమాణాలు రీత్యాఉన్నది.193 దేశాలలో ఆయుష్ ప్రమాణం రీత్యా మనదేశం స్థానం134గా ఉన్నది.ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125 దేశాలలో111వ దేశం మనది.ఎల్పిజి ఫలితాల వలన ఏర్పడిన దుష్పరిణామం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అభివృద్ధి చెందుతున్నదనే పాలకులు ఎలా చెబుతున్నారో అర్థం కావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలినియర్లు ఉన్న దేశంలో నేడు 332 బిలినియర్లు పెరిగినందున దేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతున్నదా? ప్రజలఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణలోకి తీసుకొనే అవసరం లేదా? అపారమైన వ్యవసాయ సంపద ఉన్న మన దేశంలో తీవ్రమైన పోషక ఆహార లోపం ఉన్నది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 127 దేశాలలో మన దేశంస్థానం 105వది. మనదేశంలో 35.5శాతం పిల్లలు పోషక ఆహార లోపంతో, 45శాతం పిల్లలు ఈ లోపంతోనే మరణాలకు గురవుతున్నారని పేర్కొంది.మానవ వనరుల అభివృద్ధిరీత్యా 130వది.ఆదాయ అసమానతల రీత్యా113వది. సామాజిక న్యాయం లేని ఆర్థికాభివృద్ధివలన ఎంత పెద్ద ఆర్థికవ్యవస్థ అయితే ఏమి ఎవరికి లాభం? నేడు మన దేశ జనాభా142 కోట్ల మందితో ప్రపంచంలో మొదటి స్థానంలోఉన్నాం.మన దేశ జనాభా ఎక్కువ శ్రామిక శక్తి కలిగి ఉన్నందువలన వారికి ఉపాధి అవకాశాలు కల్పించగలిగితే నిరుద్యోగిత, పేదరికం, ఆదాయ అసమానతలు ఉండవు. ●

# రక్తదానంపై అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగనభట్ల


అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టుమిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఎ,ఒ,బి,బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న 'ప్రపంచ రక్తదాతల దినోత్సవము' ను ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపు కుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం ఆవశ్యకతను తెలియ జేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచుకునేందుకు 2005 లో ఈ కార్యక్రమం ప్రారంభమయింది. ఈ సందర్భంగా రక్తదానం ఎలా చేయాలి,ఎవరు రక్తదానానికి అర్హులు, రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం. రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడుతుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు.కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్‌గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించాలనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండు గడ్డిరంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని 'ప్లాస్మా' అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలాఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమేకాదు, ప్రతిఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని 'గ్రహీత' అని, ఇచ్చేవ్యక్తిని 'దాత' అని అంటారు. 'ఒ' గ్రూప్ రక్తం కలిగిన వారిని 'విశ్వదాత' అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగపడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చంటే...



ఎబి గ్రూప్ వారు ఎబి గ్రూప్ కి, ఎ గ్రూప్‌వారు, ఎబి గ్రూపుల వారికి, బి గ్రూప్ వారు బి, ఎబి గ్రూపుల వారికి, 'ఒ' గ్రూప్ వారు ఎ,బి, ఎబి, ఒ గ్రూప్‌ల వారందరికిదానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే ఎబి గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. బి గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఎ గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఒ గ్రూప్ వారు ఒ గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 34 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈమూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి.దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం.శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హానిచేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. దేశంలో ఏటాకొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్‌బాధి తులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూవారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రి య పావుగంటలో పూర్తవుతుంది.మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, ఒక యూనిట్ రక్తాన్నిదానం చేయవచ్చు. ●

# ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం

## దౌత్యమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించిన భారత్



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 13:** ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈ ఉద్రిక్తతలపై భారత్ స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేసింది. దౌత్యమార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఇరు దేశాలకు సూచించింది. భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేసింది. అణు కర్మాగారాలే లక్ష్యంగా జరిపిన దాడులతో సహా అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా చూసుకోవాలని ఇరు దేశాలను కోరింది. దౌత్యపరమైన మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఇరాన్-ఇజ్రాయెల్‌తో తమకు సన్నిహితమైన సంబంధాలు ఉన్నాయని, సమస్యను పరిష్కరించుకునేందుకు తాము మద్దతిస్తామని ఈ సందర్భంగా న్యూఢిల్లీ పేర్కొంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా దేశాల్లోని భారత కమ్యూనిటీలతో అక్కడి భారత రాయబార కార్యాలయాలు సంప్రదింపులు జరుపుతున్నాయని వెల్లడించింది. అక్కడి భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు చెప్పే భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరింది.

**దాడులను ఖండించిన సౌదీ:** కాగా.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడాన్ని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. 'ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇవి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను బలహీనపరుస్తాయి. టెల్‌అవీవ్ దాడులకు దిగి అంతర్జాతీయ చట్టాలు, నిబంధలను ఉల్లంఘించింది' అని సౌదీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి కూడా మరణించారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.

**ఇరాన్‌పై దాడుల గురించి ముందే తెలుసు: ట్రంప్**

ఇరాన్‌పై ఇజ్రా యెల్ చేస్తున్న దాడుల గురించి తమకు ముందే తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ దాడుల్లో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు.



ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీనిపై మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆ దేశం చర్చలకు తిరిగి రావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక, ఇరాన్ ఏదైనా ప్రతీకార దాడులకు పాల్పడితే దాన్ని ఎదుర్కొనేందుకు తమ సెంట్రల్ కమాండ్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. దాని నుంచి అమెరికా తనను తాను రక్షించుకోవడంతోపాటు సిద్ధంగా ఉందన్నారు.

**ఇరాన్ గొప్ప దేశం కావొచ్చు కానీ..** ఇజ్రాయెల్ దాడులకు ముందు ట్రంప్ చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఇరాన్ అణు సమస్యను దౌత్యపరమైన మార్గాలతో పరిష్క రించుకునేందుకు మేం కట్టుబడి ఉన్నాం. దీనిపై చర్చలు జరపాలని నా అధికారులను ఆదేశించాను. అది గొప్ప దేశమే కావొచ్చు. కానీ, వారు ముందుగా అణ్వాయుధాలను కలిగి ఉండాలనే ఆశను వదులుకోవాలి' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ పూర్తిగా అప్రమత్తంగా ఉందని మిలిటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్ తెలిపారు. పదివేల మంది సైనికులను సరిహద్దు వద్ద సిద్ధంగాఉంచా మన్నారు. తమపై దాడులు చేయడానికి ప్రయత్నించేవారు ఎవరైనా భారీ మూల్యం చెల్లించు కుంటారని ఆయన ఈసందర్భంగా హెచ్చరించారు.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెల కొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమా సియా మళ్లీ రణరంగంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులుచేసింది. ఈ దాడు ల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్‌మహమ్మద్ బాఘేరి కూడా మరణిం చారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామనిఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఆ దేశ అణు కార్యక్రమానికి గుండె లాంటి ప్రదేశాన్ని ధ్వంసం చేశామన్నారు.

## ఇరాన్ గగనతలం మూసివేత: ఎయిరిండియా సర్వీసుల దారిమళ్లింపు

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఇరాన్ తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమానయాన మార్గాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమానాలు తమ ప్రయాణాలను అర్ధాంతరంగా ముగించుకోవాల్సి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున ముంబయి నుంచి లండన్ హీత్రూకు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ129, గాలిలో సుమారు మూడు గంటల పాటు ప్రయాణించిన అనంతరం తిరిగి ముంబయి చేరుకుంది. ఫ్లైట్‌రాడార్24 వివరాల ప్రకారం ఏఐ129 విమానం ఉదయం 5:39 గంటలకు ముంబయి నుంచి టేకాఫ్ అయింది. అయితే, ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో ప్రయాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి విమానాన్ని వెనక్కి మళ్లించక తప్పలేదని తెలిసింది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌లో నెలకొన్న



పరిస్థితులు, అక్కడి గగనతలం మూసివేత కారణంగా మా పలు విమానాలు దారి మళ్లించబడుతున్నాయి లేదా బయలుదేరిన చోటుకే తిరిగి వస్తున్నాయని ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రయాణికులు మరియు సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని సంస్థ పేర్కొంది. ముంబయి-లండన్ సర్వీసుతో పాటు ఇతర అంతర్జాతీయ ఎయిర్ ఇండియా విమానాలపైనా ఈ ప్రభావం పడింది. లండన్ హీత్రూ నుంచి ముంబయి వస్తున్న ఏఐ130 విమానాన్ని వియన్నాకు, న్యూయార్క్ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ102 విమానాన్ని షార్జాకు, న్యూయార్క్ నుంచి ముంబై వస్తున్న ఏఐ116 విమానాన్ని జెడ్డాకు, లండన్ హీత్రూ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ2018 విమానాన్ని ముంబయికి దారి మళ్లించారు. ముంబయి నుంచి న్యూయార్క్‌కు వెళ్తున్న ఏఐ119, ఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్తున్న ఏఐ103 విమానాలు కూడా తాము బయలుదేరిన విమానాశ్రయాలకే వెనుదిరిగాయి. ఈ అంతరాయం వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాన్ని తగ్గించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎయిర్ ఇండియా హామీ ఇచ్చింది. ప్రయాణికులకు వసతి, టికెట్ డబ్బు వాపసు (రీఫండ్) లేదా ఎటువంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీ మార్పు (రీషెడ్యూలింగ్) వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు వీలైనంత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వివరించింది.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో విమానసర్వీసులకు బ్రేక్

### 3 గంటలు ప్రయాణించి వెనక్కు వచ్చేసిన ఎయిరిండియా విమానం

**ముంబయి,జూన్ 13:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన దాడి కారణంగా ఇరాన్ తమ గగనతలాన్ని శుక్రవారం మూసివేసింది. ఈ పరిణామంతో ముంబై నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ131ను అత్యవసరంగా దారి మళ్లించాల్సి వచ్చింది. అలాగే, మొత్తం 16 విమానాలను ఎయిరిండియా దారి మళ్లించడమో, వెనక్కి పిలిపించడమో చేసినట్టు సమాచారం. షెడ్యూల్ ప్రకారం నేడు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం సాధారణంగా ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణిస్తుంది. అయితే, ఇజ్రాయెల్ జరిపిన సైనిక చర్య నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా తమ దేశ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

## పుకెట్ ఢిల్లీ ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్!

**పుకెట్(థాయిలాండ్),జూన్ 13:** థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో శుక్రవారం ఉదయం తీవ్ర కలకలం రేగింది. విమానంలో బాంబు ఉందన్న బెదిరింపు రావడంతో అప్రమత్తమైన పైలట్, విమానాన్ని వెనక్కి మళ్లించి పుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 156 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏరోనాటికల్ రేడియో ఆఫ్ థాయ్‌లాండ్ అధికారుల వివరాల ప్రకారం ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 379 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్‌కు బాంబు బెదిరింపు గురించి సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే పుకెట్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతి కోరారు. పుకెట్ విమానాశ్రయ అధికారులు తక్షణమే స్పందించి, ఎయిర్‌పోర్ట్ కంటింజెన్సీ ప్లాన్‌ను అమలులోకి తెచ్చారు. బాంబు బెదిరింపుల సమయంలో అనుసరించాల్సిన నిర్దేశిత అత్యవసర నిబంధనల ప్రకారం ప్రయాణికులందరినీ విమానం నుంచి దించివేసి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం అధికారులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక సోదాల్లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని తాజా సమాచారం ద్వారా తెలిసింది. అయితే, విమానంలో ఒక బాంబు బెదిరింపు నోటు దొరికిందని అధికారులు ధ్రువీకరించారు. ఆ నోటును ఎవరు రాశారు, దానిని ఎవరు గుర్తించారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ నోటును కనుగొన్న ప్రయాణికుడిని అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా భారతీయ విమానయాన సంస్థలు, విమానాశ్రయాలకు నకిలీ బాంబు బెదిరింపులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. గతేడాది తొలి పది నెలల్లోనే దాదాపు 1,000 వరకు ఇలాంటి తప్పుడు కాల్స్, సందేశాలు అందాయి.

## ఇండో-చైనాలమధ్య నిలిచిన విమానసర్వీసుల పునర్ధురణ



**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత్, చైనాల మధ్య నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులు త్వరలో తిరిగి ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన ఈ సేవలను పునరుద్ధరించడం ద్వారా ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను నెలకొల్పడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను తిరిగి గాడిలో పెట్టే దిశగా ఇది ఒక కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. ఇరు దేశాల విమానయాన, దౌత్య అధికారులు గత కొన్ని నెలలుగా చర్చలను ముమ్మరం చేశారు. ప్రత్యక్ష విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన కార్యాచరణ, నియంత్రణాపరమైన అంశాలపై సాంకేతిక బృందాలు కృషి చేస్తున్నాయి. 2020 ప్రారంభంలో కొవిడ్19 మహమ్మారి వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో తలెత్తిన సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, చైనాల మధ్య ప్రత్యక్ష విమాన సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అంతకుముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్‌మింగ్ వంటి చైనా నగరాల నుంచి న్యూఢిల్లీ, ముంబయి, కోల్‌కతా వంటి భారతీయ నగరాలకు పలు విమానయాన సంస్థలు వారానికి అనేక డజన్ల కొద్దీ విమానాలను నడిపేవి. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు ప్రధానంగా విమానాశ్రయాలలో స్లాట్ కేటాయింపులు, గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు, నవీకరించిన నియంత్రణ ప్రక్రియలు వంటి కీలక కార్యాచరణ అంశాలపై దృష్టి సారించాయి. భారత్‌లో చైనా రాయబారి జూ ఫీహాంగ్ ఇటీవల మాట్లాడుతూ, ప్రత్యక్ష విమానాల పునరుద్ధరణపై ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్‌లో నేను కలిసిన ప్రతి ఒక్కరూ ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాలను ఆశిస్తున్నారు. త్వరలోనే విమానాల పునరుద్ధరణ జరుగుతుందని నేను ఆశిస్తున్నాను" అని ఆయన తెలిపారు. విమాన కార్యకలాపాలను సూత్రప్రాయంగా తిరిగి ప్రారంభించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), దాని చైనా విభాగం సాంకేతిక ఏర్పాట్లను ఖరారు చేస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. విమానాల పునరుద్ధరణకు కచ్చితమైన కాలపరిమితిని ఇంకా ప్రకటించనప్పటికీ, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేశాయి. 2025 మొదటి నాలుగు నెలల్లోనే చైనా భారతీయ పౌరులకు 85,000 వీసాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో విమానాల పునరుద్ధరణ వాణిజ్యం, పర్యాటకం, విద్యా సంబంధాలను ప్రోత్సహిస్తుందని అంచనా వేస్తున్నారు. పౌర విమానయాన కార్యదర్శి ఉమ్లున్‌మాంగ్ ఉల్నామ్ మాట్లాడుతూ, చర్చలు ఇంకా ప్రాథ మిక దశలోనే ఉన్నాయని, అయితే కనెక్టివిటీని పునరుద్ధరించడంలో పరస్పర ఆసక్తి ఉందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఎదురైన అంతరాయాలను అధిగమించి, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడంలో విమాన సర్వీసుల పునరుద్ధరణ ఒక సానుకూల పరిణామంగా పరిగణించబడుతోంది. ఇది ఇరు దేశాలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందిస్తుందని భావిస్తున్నారు.

# విమానం నేలను తాకగానే

## 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు



**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కుప్పకూలి ప్రమాదం జరిగిన తీరు, అనంతర పరిణామాలపై మరిన్నివివరాలు వెలుగులోకి వస్తున్నాయి. విమానం కూలిపోయిన ప్రదేశంలో దాదాపు 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు ఎగిసిపడ్డాయని, సహాయక చర్యలు చేపట్టడం అత్యంత క్లిష్టతరంగా మారిందని అధికారులు తెలిపారు. ఈ విమానంలో సుమారు 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, అది పేలి మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ఎవరినీ రక్షించే అవకాశం లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే వెల్లడించారు. ఘటనపై ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రమాద సమాచారం అందిన వెంటనే మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల సమయంలో మా బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అప్పటికే స్థానికులు కొందరు హాస్టల్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడారు. అయితే, మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పరిస్థితి అదుపు తప్పింది" అని వివరించారు. మరో అధికారి ప్రమాద స్థలంలోని భయానక వాతావరణాన్ని వివరిస్తూ, "మేము గతంలో అనేక సహాయక చర్యల్లో పాల్గొన్నాం, కానీ ఇంతటి విపత్తును ఎప్పుడూ చూడలేదు. విమాన ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో పెద్ద అగ్నిగోళంలా మారింది. క్షణాల్లోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో ఎవరూ బయటపడే మార్గం లేకుండా పోయింది. మేము పీపీఈ కిట్లు ధరించి ఘటనా స్థలానికి వెళ్లినా, వేడి తీవ్రత అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆ ప్రాంతంలోని పక్షులు, కుక్కలు కూడా తప్పించుకోలేనంత వేగంగా ఉష్ణోగ్రత పెరిగింది. ప్రమాద స్థలంలో అనేక పక్షులు, శునకాలు కాలి బూడిదయ్యాయి. ఎటు చూసినా శిథిలాలే కనిపించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికుల మృతదేహాలను గుర్తించడం సవాలుగా మారిందని ఆవేదన్యక్తం చేశారు.

## బోయింగ్ ప్రమాదంలో ఇద్దరు ఫ్లైట్ అటెండెంట్ల దుర్మరణం

**ఇంఫాల్, జూన్ 13:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం మణిపూర్‌లో తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన యువతులు, ఎయిర్ ఇండియాలో ఫ్లైట్ అటెండెంట్లుగా పనిచేస్తున్న నంగ్థోయ్ శర్మ కొంగ్‌బ్రైలత్‌పమ్ (21), లామ్నుంథెమ్ సింగ్‌సన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. ఇంఫాల్‌లోని డీఎం కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో నంగ్థోయ్ శర్మ ఎంపికయ్యారు. ముగ్గురు ఆడపిల్లల్లో రెండోదైన నంగ్థోయ్, టీనేజ్‌లోనే ఎయిర్ ఇండియాలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆమె తండ్రి నందేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ 12న ఉదయం 11:30 గంటలకు నంగ్థోయ్ తన సోదరికి చివరిసారిగా ఫోన్ చేసింది. తాను లండన్ వెళ్తున్నానని, కొన్ని రోజులు మాట్లాడలేనని చెప్పింది. జూన్ 15న తిరిగి రావాల్సి ఉంది. అదే మాకు ఆమె చివరి మాటలవుతాయని ఊహించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె కాల్ చేసిన మూడు గంటల తర్వాత విమాన ప్రమాదం గురించి ఓ బంధువు ఫోన్‌లో చెప్పడంతో నంగ్థోయ్ సోదరి తీవ్ర ఆందోళనకు గురైంది. గత వారం అరమ్‌బాయ్ టెంగ్‌గోల్ సభ్యుడి అరెస్టుకు నిరసనగా కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో వారికి ఆన్‌లైన్ వార్తలు అందుబాటులో లేవు. నంగ్థోయ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన వెంటనే స్నేహితులతో కలిసి ఎయిర్ హోస్టెస్ ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం సాధించిందని,



ముంబైలో మణిపూర్‌కు చెందిన ఇతర ఎయిర్ ఇండియా ఉద్యోగినులతో కలిసి ఉండేదని ఆమె తండ్రి గుర్తుచేసుకున్నారు. ఎప్పటికైనా మణిపూర్‌లో స్థిరమైన ఉద్యోగం చేస్తుందని ఆశించామని తెలిపారు.

మరో మృతురాలు లామ్నుంథెమ్ సింగ్‌సన్ కుటుంబం 2023లో జరిగిన జాతి ఘర్షణల కారణంగా ఇంఫాల్‌లోని ఓల్డ్ లంబులేన్‌లో ఉన్న తమ సర్వస్వాన్నీ వదిలేసి వచ్చింది. ప్రస్తుతం వారు కాంగ్‌పోక్పి జిల్లాలో అంతర్గతంగా నిరాశ్రయులైన వ్యక్తులుగా (ఐడీపీలు) ఓ చిన్న అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. లామ్నుంథెమ్ తండ్రి కొన్నేళ్ల క్రితం మరణించగా, ఆమె తల్లి నెమ్నెయిల్‌హింగ్ సింగ్‌సన్ ముగ్గురు పిల్లలను ఒంటరిగా పెంచారు. లామ్నుంథెమ్ ఆమెకు ఏకైక కుమార్తె. ప్రమాద వార్త తెలిసినప్పటి నుంచి స్థానికులు వారి ఇంటికి చేరుకుని ధైర్యం చెబుతున్నారు. తన కుమార్తె క్షేమంగా ఉందని ఏదైనా అధికారిక సమాచారం వస్తుందేమోనని తల్లి నెమ్నెయిల్‌హింగ్ ఇంకా ఆశతో ఎదురు చూస్తున్నారు. చివరిసారిగా తన తల్లికి ఫోన్ చేసినప్పుడు, తాను డ్యూటీ మీద అహ్మదాబాద్ వెళ్తున్నట్టు లామ్నుంథెమ్ చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## బోయింగ్ ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తి సహకారం

### అమెరికా రక్షణశాఖ, ఫెడరల్ ఏవియేషన్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 13:** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర ప్రమాదానికి గురై 265 మందికి పైగా మరణించినప్పటికీ, ప్రస్తుతానికి బోయింగ్ 787 విమానాల రాకపోకలను నిలిపివేయడానికి తక్షణ కారణాలు ఏవీ లేవని అమెరికా అధికారులు స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని వారు తెలిపారు. అమెరికా రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ) తాత్కాలిక నిర్వాహకుడు క్రిస్ రోచెల్యూ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదా నికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్‌లను చూశామని, అయితే బోయింగ్ 787 విమాన నమూనాలో భద్రతా లోపాలు ఉన్నాయని చెప్పడానికి ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని వారు పేర్కొన్నారు. నిపుణులు ప్రమాద స్థలానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. కేవలం వీడియోలను చూసి అంచనాలకు రావడం తొందరపాటు అవుతుంది. అది సరైన పద్ధతి కాదని డఫీ అన్నారు. భారతీయ అధికారులతో పాటు విమాన తయారీ సంస్థ బోయింగ్, ఇంజన్ల తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్‌తో కలిసి ఎఫ్‌ఏఏ, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్టీఎస్బీ) బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని డఫీ తెలిపారు. దర్యాప్తునకు సహకరించేందుకు ఇప్పటికే ఒక అమెరికన్ బృందం భారత్‌కు బయల్దేరిందని, అవసరమైతే మరిన్ని వనరులను పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. దర్యాప్తులో భాగంగా విమాన ప్రయాణానికి సంబంధించి ఏదైనా ప్రమాద సంకేతం మా దృష్టికి వస్తే, దాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని రోచెల్యూ స్పష్టం చేశారు. భద్రతే మాకు అత్యంత ముఖ్యం. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తాం. దర్యాప్తులో వెల్లడయ్యే భద్రతా సిఫార్సులను అమలు చేయడానికి వెనుకాడబోమని డఫీ దృఢంగా చెప్పారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో భారత్‌కు అన్ని విధాలా సాయం అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని ప్రకటించారు. భారత్ ఒక పెద్ద, బల మైన దేశం వారు ఈ పరిస్థితిని అధిగమిం చగలరు. మా వైపు నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా తక్షణమే అందిస్తామని వారికి తెలియజేశానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి బోయింగ్ 787 విమాన సర్వీసులు యథావిధిగా కొనసాగుతాయని, దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను వెలికి తీయడంలో భారత్‌కు పూర్తిగా సహకరిస్తామని అమెరికా అధికారులు పునరుద్ఘాటించారు.

# మాజీ సిఎంకు కలిసిరాని లక్కీనంబర్..

**అహ్మదాబాద్,జూన్ 13:** అహ్మదాబాద్ నుంచి లండన్ బయలు దేరిన ఏఐ 171 బోయింగ్ విమానం ప్రమాదానికి గురైంది. గాల్లోకి లేచిన 30 సెకన్లకే కుప్పకూలిపోయిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోగా, చనిపోయిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఇక్కడ విషాదకరమైన విషయం ఏంటంటే విజయ్ రూపానీ జీవితంలో లక్కీ నెంబర్.. అన్ లక్కీ నెంబర్‌గా మారింది. లక్కీ నెంబర్ రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. అది కూడా దారుణమైన స్థితిలో మరణించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీకి 1206 నెంబర్ అంటే పిచ్చి. ఆ నెంబర్‌ను తన లక్కీ నెంబర్‌గా భావించేవారు. ఆ నెంబర్‌తో సంబంధం ఉన్న రోజే ముఖ్యమైన కార్యక్రమాలు మొదలుపెట్టేవారు. కార్లకు, బైకులకూ అదే నెంబర్ తీసుకున్నారు. అయితే, ఊహించని విధంగా 1206(12వ తేదీ, 6 నెల) రోజే విమాన ప్రమాదంలో చనిపోయారు. ఆయన లండన్‌లోని తన కుటుంబాన్ని కలుసుకోవడానికి విమానం ఎక్కారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన




విషయం ఏంటంటే రూపానీ విమానంలో కూర్చున్న సీటు నెంబర్ కూడా 12. విమానం ఎక్కిన సమయమూ 12.10. పాపం లక్కీ నెంబర్ ఆయన్ని ప్రమాదం నుంచి కాపాడలేకపోయింది. ఆయన విమానంలో కూర్చుని ఉండగా దిగిన చివరి ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ప్రమాదం జరిగిన ప్రదేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లారు. అక్కడ పర్యటించారు. అనంతరం ప్రమాదంలో గాయపడ్డ వారి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

## బోయింగ్‌ప్రమాదంపై పాక్ అగ్రనేతల సంతాపం

**కరాచి,జూన్ 13:** దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాల్లో ఒకటైనా అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కూలిన ఘటనపై ప్రపంచ దేశాలు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాయి. మన పొరుగున ఉన్న పాకిస్తాన్ కూడా ఈ విషాదకరమైన ఘటనపై స్పందించింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్, పీపీపీ పార్టీ అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపట్ల తాను ఎంతో బాధపడినట్లు వెల్లడించారు. ఈ ఘటనలో తమ వారిని కోల్పోయి దుఃఖిస్తున్న బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ హృదయ విదారక విషాదం వల్ల ప్రభావితం అయిన వారందరి కోసం పాకిస్తాన్ ప్రార్థనలు చేస్తోందని షెహబాజ్ షరీఫ్ తనపోస్టులో వెల్లడించారు. షెహబాజ్ షరీఫ్ సోదరుడు, పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా ఇదే రకమైన సందేశం ఇచ్చారు. ఈ ఘటన మానవత్వానికి అతీతమైనదని అని ట్వీట్ చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన హృదయ విదారక ఎయిరిండియా విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ వినాశకరమైన నష్టం సరిహద్దులను దాటి భారత్, పాకిస్తాన్ ఉమ్మడి మానవత్వాన్ని గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు, మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో జర్దారీ కూడా సానుభూతిని తెలియజేశారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఎయిరిండియా విమానం కూలిపోయిన విషాదకరమైన సంఘటన గురించి వినడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై అంతర్జాతీయంగా ప్రపంచ నాయకులు ప్రాణ నష్టంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటన దృశ్యాలు తమ హృదయాలు కలిచివేసాయని ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## ఎయిర్‌లైన్స్ ఉద్యోగినని నమ్మించి 120సార్లు ఉచిత ప్రయాణం

### చివరకు పోలీసులకు చిక్కిన ఎయిర్‌వేస్ చీటర్

**ఫ్లోరిడా, జూన్ 13:** ఫ్లోరిడాకు చెందిన ఒక వ్యక్తి విమానయాన సంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆరేళ్ల వ్యవధిలో 120సార్లకుపైగా విమాన ప్రయాణాలను ఉచితంగా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిరాన్ అలెగ్జాండర్ అనే ఈ వ్యక్తి, పైలట్ లేదా ఫ్లైట్ అటెండెంట్‌గా నమ్మించి వివిధ ఎయిర్‌లైన్స్‌ను మోసం చేసినట్టు అధికారులు గుర్తించారు. అలెగ్జాండర్ ఏకంగా ఏడు వేర్వేరు విమానయాన సంస్థలలో తాను ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకుని 'నాన్‌రెవ్' అంటే ఉద్యోగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం పద్ధతిలో ప్రయాణించాడు. ఇందుకోసం ఒక ఎయిర్‌లైన్‌కు చెందిన అంతర్గత టికెట్ పోర్టల్‌ను ఉపయోగించి ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకున్నాడు. ఈ మోసపూరిత చర్యలకు పాల్పడేందుకు అలెగ్జాండర్ అసలైన విమానయాన సంస్థల ఉద్యోగుల గుర్తింపు వివరాలను సంపాదించాడు. వారి బ్యాడ్జ్ నంబర్లను కూడా దొంగిలించి తాను ఆయా సంస్థల ఉద్యోగినని నిరూపించుకునే ప్రయత్నం చేశాడు. మొత్తం మీద ఉచిత ప్రయాణాల కోసం అతడు 30వేర్వేరు సెట్ల గుర్తింపు కోడ్స్‌ను ఉపయోగించినట్టు తేలింది. ఈ మోసపూరిత బుకింగ్‌లను అలెగ్జాండర్ ప్రధానంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల ట్రావెల్ పోర్టల్ ద్వారా చేసినట్టు అధికారులు గుర్తించారు. చాలా విమానయాన సంస్థలకు ఇతర సంస్థలతో పరస్పర ఒప్పందాలు ఉంటాయి. దీనివల్ల ఒక సంస్థ ఉద్యోగులు తమ అంతర్గత ట్రావెల్ బుకింగ్ సైట్ ద్వారా ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వారు ఉద్యోగంలో చేరిన తేదీ, బ్యాడ్జ్ నంబర్, వారు పనిచేస్తున్న సంస్థ పేరు వంటి వివరాలను నమోదు చేసి ఉచిత విమాన ప్రయాణాలను పొందాడు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వివరాల ప్రకారం అలెగ్జాండర్ 2018 నుంచి 2024 వరకు ఈ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డాడు. ఇతర క్యారియర్‌ల ఉద్యోగిగా నటిస్తూ అతను స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌లో 34 ట్రిప్పులు చేశాడు. అలెగ్జాండర్ ఫ్లైట్ అటెండెంట్‌గా అబద్ధం చెప్పి 120 కంటే ఎక్కువ ఉచిత విమాన ప్రయాణాలు బుక్ చేసుకున్నాడని కోర్టు పత్రాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు రుజువైతే అలెగ్జాండర్‌కు 20 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు భారీగా జరిమానా విధించే అవకాశం ఉంది.

## వచ్చే యేడాదికల్లా ఎన్‌డిబి రోడ్ల విస్తరణ పూర్తి కావాలి

### :మంత్రి బిసి జనార్ధనరెడ్డి

**విజయవాడ జూన్ 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఎన్‌డీబీ రుణంతో చేపట్టిన రహదారులు విస్తరణ వచ్చే ఏడాది చివరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరగాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌డీబీ పనులు జరుగుతున్న తీరుపై అధ్యయనానికి ఆ బ్యాంక్ ప్రతినిధులు బృందం నాలుగు రోజులు పర్యటనకు వచ్చింది. వీరితోను,ఆర్అండ్‌బీ ఇంజినీర్లతో మంత్రి జనార్ధనరెడ్డి గురువారం ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ క్రింద ఇప్పటికి రూ.637.76 కోట్ల మేర పనులు పూర్తి కాగా రూ.488.30 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు.బ్యాంకు తొలుత ఇచ్చిన రుణ అడ్వాన్స్ రూ.233 కోట్లు సద్వినియోగం చేసుకుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.100 కోట్లు వెచ్చించాల్సి ఉండగా రూ.225 కోట్ల మేర గుత్తేదార్లకు ప్రభుత్వం చెల్లింపులు చేసిందని వెల్లడించారు. ఎన్‌డీబీ ప్రతినిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనుల్లో పురోగతి వచ్చిందని వెల్లడించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అటకెక్కిన రక్తనిల్వ కేంద్రం

### - పట్టించుకోని వైద్యశాఖ ఉన్నతాధికారులు




ప్రభుత్వ ఆసుపత్రిలో నేమ్‌బోర్డుకు పరిమితమైన రక్తనిల్వ కేంద్రం

**జగ్గయ్యపేట, జూన్ 13, ప్రభాతవార్త :** ప్రాణాపాయస్థితిలోవున్న వారిని తక్షణమే ఆదుకునే వీలు కల్పిస్తూ ఏర్పాటుచేసిన రక్తనిల్వ కేంద్రం అటకెక్కింది. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం (ప్రభుత్వవైద్యశాల)లోని సిబ్బందిపై ఆరోపణలు రావటంతో ఉన్నతాధికారులు వారిని రెండు వారాల క్రితం విధుల నుండి తొలగించారు. దీంతో రోగులకు అత్యవసర వైద్యసహాయం అందించే విషయంలో ప్రభుత్వ వైద్యులు నిస్సహాలవుతున్నారు. ఈసమస్యపై సిపిఐ పట్టణ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి ఫిర్యాదుచేసినట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు. యుద్ధప్రాతిపదికన రక్తనిల్వ కేంద్రాన్ని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఇంతకు ముందు ప్రైవేట్ మార్గంలో రక్త దందాకు పాల్పడిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఆరోపణలు రాగా జిల్లా అధికారులు వారిని విధుల నుండి తొలగించారని, తిరిగి ఈ యూనిట్ కొనసాగేందుకు సిబ్బందిని ఏర్పాటుచేయటంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. కాగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హారీష్‌ను వివరణ కోరగా తొలగించిన ఇరువురి స్థానాలను భర్తీ చేయాల్సివుందని ప్రభుత్వానికి తాము ప్రతిపాదన పంపామని, త్వరలో ఏర్పాటుచేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. నియోజకవర్గ మూల కేంద్రమైన పట్టణంలోని ప్రభుత్వవైద్యశాలకు నిత్యం వందలాది మంది వచ్చి వైద్యం పొందుతుంటారు. అందువల్ల ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి రక్తనిల్వ కేంద్రం పనిచేసేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావుతోపాటు పట్టణవాసులు కోరుతున్నారు.



సతీష్‌చంద్ర దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఒ

## ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధమవ్వండి

### : అధికారులకు ఇఒ ఆదేశం

### - మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉచిత ప్రసాదం పంపిణీ

**ఇంద్రకీలాద్రి, జూన్ 13, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తుల సౌకర్యాలను రాబోయే ప్రత్యేక ఉత్సవాల్లో సక్రమంగా నిర్వహించే చర్యలు చేపట్టాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ వికె శీనా నాయక్ ఆదేశాలిచ్చారు. శుక్రవారం ఇఒ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ జూన్ 24 నుండి జూలై 26 వరకు ఆషాడ మాసం సారె సమర్పణ, జూన్ 26 నుండి జూలై 4 వరకు వారాహి నవరాత్రులు (గుప్తనవరాత్రులు), జూలై 8 నుండి జూలై 10 వరకు శాకంబరి ఉత్సవాలు జరుగుతాయని ఆ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటినుండే క్రమబద్ధమైన ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఆధ్యాత్మికంగా, ధార్మికంగా మరింత ఉన్నతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీ న ం కో వా ల న్నా ర ం. కార్యక్రమంలో ఇఇ కోటేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ , వైదిక కమిటీ సభ్యులు వి శ్యావశ్య మహర్షి, సి హెచ్ ఆంజనేయ ఘనాపాఠి, ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, ఎఇఒలు ఎన్ రమేష్‌బాబు, బి వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నెలవైయున్న శ్రీ మల్లేశ్వర స్వామివార్లను దర్శించుకునే భక్తులకు ఇకపై ఉచిత ప్రసాదం అందించేలా ఇఒ చర్యలు తీసుకున్నారు. ఉచిత ప్రసాదాన్ని భక్తులకు శుక్రవారం ఇఒ అందించి ప్రారంభించారు. ఈ ఉచిత ప్రసాదాన్ని అందించడానికి విరాళాలు అందించే భక్తులు వీలైన మొత్తం దేవస్థానంలో చెల్లించాలన్నారు. దుర్గమ్మను శుక్రవారం మాజీ ఐఎఎస్ అధికారి సతీష్‌చంద్ర సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఒ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

శుక్రవారం దుర్గమ్మవారి ఆలయంలో కళావేదికపై చెన్నైకు చెందిన శ్రీ భరతకళ ఆర్ట్స్ అకాడమి ఆచార్యులు రోజా రాణి నేతృత్వంలో 25 మంది కళాకారులు కూచిపూడి నృత్యార్చనను దుర్గమ్మవారికి అర్పించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదాలు



నృత్యనీరాజనమందిస్తున్న కళాకారులు

అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న గోపురానికి స్వర్ణతాపడం చేయడానికి గాను శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మెరుగు గోపాల్ రు.1లక్షను ఆలయ ఇఇ కోటేశ్వరరావుకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## యేడాదిలో రక్తహీనత తగ్గించాలన్నదే లక్ష్యం

### - ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి




రక్తహీనత నియంత్రణపై శిక్షణా శిబిరంలో ప్రసంగిస్తున్న ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:**ఏడాదిలో రక్తహీనతను(ఎనీమియా) తగ్గించాలన్న లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి అన్నారు సంబంధిత శాఖల అధికారులతో కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలపై రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా హాయ్ ల్యాండ్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలకు చెందిన అధికారులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు, డిపిహెచ్ ఎన్వోలు, ఆర్బీయస్కే పీఓలు దాదాపు 150 మంది హాజరయ్యారు. వీరినుద్దేశించి ఆమె మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు వారివారి జిల్లాల్లో కింది స్థాయి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారు నేర్చుకున్న విషయాలన్నీ కింది స్థాయి వారికి వివరంగా చెప్పి అవగాహన కలిగించాలన్నారు. ఎనీమియా గుర్తించడానికి క్షేత్రస్థాయిలో స్ర్కీనింగ్‌ను పూర్తి చేసి సత్వరం చికిత్స అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖకు సహకరించాలని ఆమె కోరారు. రక్త హీనత ఉన్న 59 ఏళ్ల మధ్య వయసున్న వారు రోజూ ఒక మాత్ర చొప్పున రెండు నెలలపాటు, అలాగే కౌమార దశలో (1019 ఏళ్ల మధ్య వయసున్న వారు) వారు రోజుకొక మాత్ర చొప్పున మూడు నెలల పాటు కచ్చితంగా వాడాలన్నారు. రక్తహీనత లేని 59 మరియు, 1019 వయసు వారు వారానికొక మాత్ర తప్పనిసరిగా ఐరన్ మాత్ర వేసుకోవాలి. సంబంధిత ఎఎన్ఎం హిమోగ్లోబిన్ స్థాయిని పరీక్షించాలన్నారు. స్కూళ్లలో ఐరన్ మాత్రలు ప్రతి నెలా 50 శాతం పంపిణీ జరిగిన వెంటనే ఇండెంట్ పెడితే మిగతా 50 శాతం పంపిణీ చేయడానికి ముందే పంపించే ప్రయత్నం చేస్తామన్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత బాధితులకు చికిత్స అందించే విషయంలో ఏమాత్రం అలసత్వం జరక్కుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకపోయినా గర్భిణిలు రోజుకో ఐరన్ మాత్రను 180 రోజులు తప్పకుండా వాడాలని, రక్తహీనత ఉన్నవారు రోజుకు రెండు మాత్రలు వేసుకోవాలని, హిమోగ్లోబిన్ పరీక్షను ప్రతి నెలా ఎఎన్ ఎం చేస్తారన్నారు. మధ్యస్త, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇస్తారనీ, అవసరాన్ని బట్టి బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కూడా చేస్తారని, ఈ కార్యక్రమాలన్నీ అమలయ్యేలా డిఐఒలు, డిపిహెచ్ఎన్ ఓలు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. రక్త హీనత లేని 20 నుండి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళలందరూ తప్పని సరిగా వారానికొక ఐరన్ మాత్ర వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టెస్ట్, ట్రీట్మెంట్, టాక్(టి3) పై పెద్ద ఎత్తున ప్రచారంచేసి అవగాహన కల్పించాలన్నారు.

## హైకోర్టు భవన ప్రాంగణంలో వీధి దీపాలు, హైమాస్ట్ లైట్ల మరమ్మతులకు టెండర్లు

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** నేలపాడులోని ఏపీ హైకోర్టు భవనం ప్రాంగణంలో ఉన్న వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లకు కొన్ని విద్యుత్ మరమ్మతులు అందించేందుకు రూ.16,60,000 అంచనాతో టెండర్లు. ఈ నెల 21 వ తేదీ వరకు దాఖ లు చేసుకునే అవకాశం. జియో డేటా తయారీ కోసం టెండర్ పిలిచిన ప్రభుత్వంవరల్డ్ క్లాస్ అమరావతి నిర్మాణంలో భాగంగా జియో డేటా తయారీ కోసం టెండర్ పిలిచిన ప్రభుత్వం. అమరావతి నగర పరిధిలో ప్రతి ఆస్తికి, భూమికి ఇంటికి నంబర్లు ఇవ్వనుంది. యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్, యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నంబర్, డిజిటల్ డోర్ నంబర్ ఇవ్వనుంది. డిజాస్టర్ రెస్క్యూ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు అమరావతి రాజధాని నగరంలో వరదలు, విపత్తులు నివారణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 100 ఏళ్ల రికార్డ్ ఆధారంగా ముంపు, ఇతర ప్రకృతి విపత్తుల నివారణ కోసం డిజాస్టర్ రెస్క్యూ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం కాలువలు, రిజర్వాయర్లు వెంట ముందస్తు నివారణ కోసం సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం సి ఆర్ డి ఏ ఆసక్తి వ్యక్తికరణ టెండర్లు ఆహ్వానించింది.

## కృష్ణా జలాల బకాయిలు రూ.153 కోట్లు చెల్లించండి

### - తమినాడును కోరిన ఎపి

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జలాల సరఫరాకు సంబంధించిన తమిళనాడు ప్రభుత్వం ఏపీకి బారీగా బకాయిపడింది..చెన్నై మంచి నీటి అవసరాలు తీర్చేలా అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు నేతృత్వంతో 1983లో ఒప్పందం కుదిరింది.ఈ మేరకు తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా ఏటా రెండు విడతలుగా 12 టీఎంసీల కృష్ణా జలాలను ఏపీ తమిళనాడుకు అందిస్తోంది. ఆ ప్రకారం తమిళనాడు 2023 మార్చి వరకు రూ.1385 కోట్లు చెల్లించాలని, అందులో రూ.1232 కోట్లు ఇదివరకే ఇచ్చిందని, ఇంకా రూ.153 కోట్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం చెబుతున్నట్లు సమాచారం. అయితే బకాయి అంత ఉండదని తమిళనాడు అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా నీటి లెక్కలను ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఈ బకాయిలు రూ.153 కోట్లు ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ నేపథ్యంలో కృష్ణా నీటి లెక్కలను తమిళనాడు ఆర్థిక శాఖ పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## ఎయిరిండియా బోయింగ్‌ల తనిఖీలు పెంచాలి: డిజిసిఎ

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787/8/9 డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతా తనిఖీని పెంచాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఆదేశించింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా నిర్వ హించే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లోని పలు వ్యవస్థలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, టేకాఫ్ నిబంధనలను సమీక్షించాలని సూచిం చింది. క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, అనుబంధ వ్యవస్థల తనిఖీ, ఎలక్ట్రానిక్ ఇంజిన్ కంట్రోల్ సిస్టమ్ టెస్ట్, ఇంజిన్ ఇంధనంతో నడిచే యాక్చుయేటర్ ,ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్ త ని ఖీ ల న ు చేపట్టాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది. ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల స్నింటినీ పరిశీలించాలని సూచించింది. కాగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రమాదంలో అందులోని ప్రయాణికులు, సిబ్బం దితో సహా 241 మంది మరణించారు. ఈ నేపథ్యంలో బోయింగ్ డ్రీమ్ లైనర్ 787 8 విమానాల గ్రౌండింగ్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలి స్తున్నది. పాత కాలం నాటి బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878/9 విమా నాలను నిలిపివేసే విషయంలో భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య చర్చలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. అయితే ఎయిర్ ఇండియా విమానాల నిర్వహణ, ఆపరేటింగ్ విధానాలను కూడా లోతుగా పరిశీలించిన తర్వాతే బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878 విమానాల గ్రౌండింగ్‌పై తుది నిర్ణయం తీసు కునే అవకాశమున్నట్లు వివరించాయి.

## రఘువంశీ హత్యకు మూడుసార్లు విఫలయత్నం!

**షిల్లాంగ్, జూన్ 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హనీమూన్ హత్య కేసులో రోజుకో షాకింగ్ విషయం వెలుగుచూస్తోంది. తాజాగా, నిందితురాలు సోనమ్, ఆమె నియమించుకున్న హంతకులు భర్త రాజా రఘువంశీని అంత మొందించేందుకు మూడుసార్లు విఫలయత్నం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎస్పీ వివేక్ సియామ్ ఈ వివరాలను స్వయంగా తెలిపారు. నాలు గో ప్రయత్నంలో హంతకులు తమ ప్లాన్‌ను విజయవంతంగా అమలుచేసి రాజా రఘువంశీని దారుణంగా హత్య చేశారని ఆయన తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హంతకులు రాజా రఘువంశీని హత్య చేయడానికి అనేక ప్రణాళికలు రచిం చారు. తొలిసారిగా గువా హాటిలో హత్యచేసి, మృత దేహాన్ని ఎక్కడైనా పడేయాలని పథకం వేశారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ప్లాన్ వాయిదా పడింది. ఆ తర్వాత మేఘాలయలోని సోహ్రా ప్రాంతంలో రెండుసార్లు హత్యకు ప్రయత్నించినా అవి కూడా విఫలమయ్యాయి. మొదట నంగ్రిట్ వద్ద హత్య చేసి, మృతదేహాన్ని పార వేసేందుకు అనువైన ప్రదేశం దొరకకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విర మించుకున్నారు. అనంతరం మవ్లాఖియట్, వెయిసావ్‌డోంగ్ వద్ద కూడా ప్రయత్నించారు.

రఘువంశీ వాష్ రూమ్‌కు వెళ్లినప్పుడు హత్య చేయా లనుకున్నా అది కూడా సాధ్యపడలేదు. చివరకు, వెయిసావ్‌డోంగ్ జలపాతం వద్ద రఘువంశీపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశారని ఎస్పీ వివరించారు. సోనమ్, రఘువంశీల వివాహం మే 11న జరిగింది. వివాహం అనంతరం ఈ జంట గువాహటిలోని కామాఖ్య అమ్మవారి ఆలయంలో పూజలు చేసేం దుకు వెళ్లారు. అయితే, హంతకులు మే 19వ తేదీనే గువాహటి చేరుకుని సిద్ధంగా ఉన్నారు. అక్కడి నుంచి సోనమ్ షిల్లాంగ్, సోహ్రా వెళ్లాలని నిర్ణ యించుకోవడంతో, హంతకులు గువహటిలో తమ ప్రణాళికను రద్దు చేసు కుని, ఆమెను అనుసరించినట్లు ఎస్పీ తెలిపారు.

## వెంకటాచలంలో ఆటో బోల్తా ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు

### - బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

**వెంకటా చలం (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త** : వెంకటాచలం మండల పరిధిలోని సర్వేపల్లి సమీపంలోని మల్లుగుంట సంఘం వద్ద ఆటో బోల్తా పడి ఒక్కరు మృతి చెందగా ఏడు మందికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇడిమేపల్లి పంచాయతీలోని పలుకూరువారి పాళెం గ్రామానికి చెందిన మహిళలు ఆటోలు వ్యవసాయ పనులు నిమిత్తం పొట్టెంపాడు గ్రామానికి వెల్తుండగా మల్లుగుంట సంఘం రాగానే ఎదురుగా బైకు రావడంతో బైకుని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో లో సుమారు పది మంది ఉండగా మల్లి లక్ష్మీదేవమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది మిగిలిన ఏడు మందికి గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశయం తెలుసుకున్న వెంకటాచలం ఎస్సై ఆంజినేయులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి గాయాలుతో ఉన్న మహిళలను వైద్య పరీక్షలు నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడిన విశయం తెలుసుకున్న సర్వేపల్లి శాసన




సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అటాహుటిన నెల్లూరు ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మృతి చెందిన మల్లి లక్ష్మీదేవమ్మ మృతు దేహం వద్దకు వెళ్లి నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని పార్టీ పూర్తిగా అండగా ఉంటుమాని తెలిపారు. ఈ కార్యక్రమాలు ఇడిమేపల్లి నీటి సంఘ అధ్యక్షులు ఏలూరు కృష్ణ రెడ్డి మాజీ సర్పంచ్ మాజీ సీనయ్య ఏడుకొండలు పెద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మానసికంగా ఆనాడే చచ్చిపోయా

### - మాజీ మంత్రి పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు



**'విజయవాడ, జూన్13, ప్రభాత వార్తప్రతి నిధి:**రేషన్ బియ్యం' కేసులో తన అక్రమంగా ఇరికించిన రోజే మానసికంగా చనిపోయానని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ కేసులో తన భార్యను తీసుకుని 15 రోజులు రోజుకొక చోట దాక్కుంటూ తిరిగాను, ఆ రోజే నేను మానసికంగా చచ్చిపోయాను. అదృష్టవశాత్తూ బెయిలు వచ్చింది. అయినా వదలకుండా నా భార్యను విచారించారు' అని పేర్ని నాని ఆవేదన వ్యక్తం చేసారు,.పోలీసుల తీరుపై ఆయన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అక్రమ రేషన్ బియ్యం కేసులో కొన్ని నెలల కిందట పేర్ని నాని భార్యను పోలీసులు విచారించారు. నకిలీ పట్టాల వివాదంలో పేర్ని నానిని అరెస్ట్ చేస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆయన ముందస్తుగా ఏపీ ఉన్నత న్యాయస్దానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో తానేమీ భయపడలేదన్నారు. అయితే ప్రభుత్వంలో కొందరు మంత్రులు తప్పుడు కేసుల పెట్టమని ఆదేశించడం, పోలీసులు అత్యుత్సాహం చూపించడం రివాజుగా మారినందునే న్యాయస్దానాన్ని ఆశ్రయించానన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తనను అరెస్ట్ ఎలా చేస్తారన్నారు. ఎవో ప్రచారాలు చేస్తున్నారు. చేయనివ్వండి, న్యాయస్దానం ఉంది, చట్టం ఉందన్నారు.

## అర్హత కలిగి తల్లికి వందనం పథకం అందకపోతే వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయండి: ప్రభుత్వం

**విజయవాడ, జూన్13, ప్రభాతవార్తప్రతినిధి:** అర్హత కలిగి తల్లికి వందనం పథకం అందకపోతే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 15 వేల మేర లబ్ధి చేకూరుస్తూ తల్లికి వందనం పథకం ఉత్తర్వులు జారీ చేసింది. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఎంతమంది ఉంటే అంతమందికి పథకం వర్తిస్తుందని వెల్లడించింది. తల్లికి వందనం పథకం మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ విడివిడిగా జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరే విద్యార్థులకు జులై 5వ తేదీన తల్లికి వందనం నిధులు జమ చేయనున్నారు. ప్రవేశాల వివరాలు వచ్చేందుకు కొంత సమయం పడుతున్నందున వీరికి తర్వాత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2025 - 26 విద్యా సంవత్సరం ప్రామాణికంగా పథకాన్ని వర్తింపజేస్తుంది. అర్హుల నిబంధనలకు సంబంధించి గత ప్రభుత్వం అమలు చేసిన వాటినే కూటమి ప్రభుత్వం కొనసాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం నెలకు 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో 12 వేలు మించకూడదు. రేషన్ కార్డు ఉండాలి. కుటుంబానికి మగాణి 3 ఎకరాల్లోపు, మెట్ట 10 ఎకరాల్లోపు లేదా రెండూ కలిపి పది ఎకరాల్లోపు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా నాలుగు చక్రాల వాహనం ఉంటే పథకం వర్తించదు. ట్యాక్సీలు, ట్రాక్టర్లు, ఆటోలకు మినహాయింపు ఉంటుంది. విద్యార్థి డేటాబేస్‌లో ఉండి, తల్లి లేకపోతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మ్యాపింగ్ చేస్తారు. విద్యార్థులు ఒకటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు గుర్తింపు పొందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇది వర్తించదు. విద్యార్థి కనీసం 75 శాతం హాజరు కలిగి ఉండాలి. అర్హత ధ్రువీకరణ పూర్తయిన అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల విభాగం, సంక్షేమ, ఆర్థిక శాఖలు కలిసి సమన్వయంతో నిధుల బదిలీ ప్రక్రియ అమలు చేస్తాయి. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మేరకు సమగ్ర శిక్షా అభియాన్ నోడల్ ఖాతా ద్వారా ఆయా పాఠశాలకు నేరుగా చెల్లిస్తారు.

ఫీజు చెల్లింపు మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఆ మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని తల్లికి వందనం కింద చెల్లిస్తారు. సామాజిక ఆడిట్ కోసం లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయంలో ప్రదర్శిస్తారు. అర్హత ఉండి ఎవరినైనా అనర్హులుగా తిరస్కరిస్తే గ్రామ, వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ సమగ్రాభివృద్ధి కోసం 2 వేల రూపాయలు మినహాయించి మిగతా 13 వేలు జమ చేయనుంది.

## కృష్ణయ్య! బిసి సంఘాల నాయకుడివా? బిజెపి లీడర్‌వా?

### బిజెపి ఆఫీస్ ముందు ధర్నా చేపట్టాలి : ఈరవత్రి అనిల్

**హైదరాబాద్,జూన్ 13, ప్రభాతవార్త:** గాంధీ భవన్ ముందు ధర్నా చేయడం కాదు,బీజేపీ ఆఫీస్ ముందు ధర్నా చేయాలని ఆర్ కృష్ణయ్య బిసి సంఘాల నాయకు డుగా మాట్లాడుతుండా లేక బీజేపీ నాయకుడిగా మాట్లాడుతున్నడో చెప్పాలని మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ 74 యేళ్ల నుండి ఇప్పటి వరకు దేశంలో కులగణన చేయలేదని రాహుల్‌గాంధీ ఒత్తిడి తోనే కులగణన జరుగుతోందని ఆయన అన్నారు. బిసిలకోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని విమర్శించడం కృష్ణయ్యకు తగదని అన్నారు. రేవంత్ రెడ్డి 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పించినందుకు కృషిచేస్తుంటే కృష్ణయ్యకు కంటగింపుగా ఉందని ఆవేదన చెందారు. ట్రిపుల్ టెస్ట్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసి కులగణన పై సర్వే చేసిందని అన్నారు.ఆర్ కృష్ణయ్య కు రాజ్యసభ సీటు వస్తే సరిపోద్దా?బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు.

## దమ్ముంటే లై డిటెక్టర్ టెస్టుకు రా: సిఎంకు కెటిఆర్ సవాల్

### ప్రభుత్వం నడపలేక ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ఫార్ములాఈ కేసులో తనకు ఏసీబీ నుంచి నోటీసులు అందాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దమ్ముంటే ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షకు హాజరవుదామని సవాల్ విసిరారు. ప్రభుత్వం నడపడం చేతకాక, ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ సర్కస్‌లు చేస్తోందని ఆయన ఆరోపించారు.

ఫార్ములాఈ కేసులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనను ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో రూ. 44 కోట్లు బ్యాంకు నుంచి బ్యాంకుకు బదిలీ అయ్యాయని, ఆ మొత్తం ఫార్ములాఈ సంస్థ ఖాతాలోనే భద్రంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

చట్టాన్ని గౌరవించే పౌరుడిగా తాను సోమవారం ఏసీబీ అధికారుల ముందు హాజరై, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల క్రితం నల్ల సంచి నిండా డబ్బులతో దొరికిపోయిన వ్యక్తి ఎవరో ఎవరైనా గుర్తు చేయగలరా?" అంటూ పరోక్షంగా ఓటుకు నోటు కేసును ప్రస్తావించారు. "మిస్టర్ రేవంత్ రెడ్డి, మనమిద్దరం ఏసీబీ దర్యాప్తును ఎదుర్కొంటున్నాం కదా. అలాంటప్పుడు ఒక న్యాయమూర్తి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష తీసుకుందాం. దానిని టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేద్దాం. తెలంగాణ ప్రజలే ఎవరు దోషో నిర్ణయిస్తారు.

నాతో పాటు ఈ పరీక్షకు వచ్చే ధైర్యం మీకుందా?" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రతిరోజూ చెబుతున్న మీరు, పదేపదే విచారణలు, ప్రచారాలతో ప్రజాధనాన్ని ఎందుకు వృధా చేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ప్రభుత్వం నడపడం చేతకాకపోతే, ప్రజలను సర్కస్‌లు, ఇతర పరధ్యానాలతో బిజీగా ఉంచుతారు! కాంగ్రెస్, వారి ముఖ్యమంత్రి చేసే విన్యాసాలు మమ్మల్ని నిరోధించలేవు" అని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ఫార్ములాఈ కారు రేస్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా హైదరాబాద్ కీర్తిని పెంచే ప్రయత్నం చేస్తే, దానిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిధులన్నీ పక్కాగా ఖాతాలోనే ఉన్నప్పుడు, ఈ విచారణల పేరిట రాద్ధాంతం ఎందుకని ఆయన నిలదీశారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

వివరాలు 8లో..





విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు

వార్త

శనివారం 14 జూన్ 2025




## ఈనెల 16న నగరానికి రానున్న సీఎం



విశాఖపట్నం , జూన్ 13 ప్రభాతవార్త

యోగాంధ్ర నిర్వహణపై సమీక్ష జరిపేందుకు ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నగరానికి రానున్నారు. జూన్ 21న ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా నగరంలో సుమారు నాలుగు లక్షల మందితో గిన్నిస్ బుక్ రికార్డు లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని మోడీ కూడా హాజరుకానున్నారు . ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

# ప్రమాదం మాటున.. విశాఖ విమానాలు..!!



“చిన్నపాటి నిర్లక్ష్యం అంతులేని అనర్థాన్ని తెచ్చిపెడుతోంది... కలల ప్రయాణంగా పేరుగాంచిన విమానయానం అనంత లోకాలకు చేరువ చేస్తోంది... తరచూ చోటు చేసుకుంటున్నా విమాన ప్రమాదాలను తరచి చూస్తే మానవ తప్పిదంతో పాటు పరిస్థితుల ప్రభావం కూడా కారణంగా తెలుస్తోంది... వందల సంఖ్యలో విగత జీవులుగా మారడానికి కొన్ని సందర్భాలలో “పక్షులు”కారణభూతమవుతున్నాయి... విశాఖ విమానాశ్రయ పరిసరాలు ఇదే తరహా దుర్ఘటనలకు దారి తీసే విధంగా వ్యర్థాలకు నిలయాలుగా మారుతుండడంపై “ప్రభాతవార్త”అందిస్తున్న ప్రత్యేక కథనం...”

## వ్యర్థాలతో పొంచి ఉన్న అనర్థం - పెరిగిపోతున్న పక్షుల విహంగం

గోపాలపట్నం, జూన్ 13, ప్రభాతవార్త:

సాధారణంగా విమానాశ్రయ పరిసర ప్రాంతాలలో కొన్ని నిషేధాజ్ఞలు అమలవుతూ ఉంటాయి. హైరైజ్డ్ బిల్డింగ్ నిర్మాణం, వ్యర్థ పదార్థాల డంపింగ్ వంటి చర్యలపై ఖచ్చితమైన నిబంధనలను అమలు చేస్తూ ఉంటారు. విమానాల టేక్ ఆఫ్, ల్యాండింగ్ సమయాలలో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా ఈ విధమైన చర్యలు చేపడుతుంటారు. అయితే విశాఖ విమానాశ్రయం పరిసరాలలో ఇందుకు

తరువాయి 8లో..





## దామంజోడి-కిరండూల్ విభాగాన్ని తనిఖీ చేసిన జనరల్ మేనేజర్



విశాఖపట్నం, జూన్ 13 ప్రభాతవార్త

తూర్పు తీర రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డబ్లింగ్ పనులు కార్యాచరణ సామర్థ్యంపై దమంజోడి-కిరండూల్ విభాగాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు డివిజనల్ రైల్వే మేనేజర్ (రాయగడ) అమితాబ్ సింఘాల్, ఏడిఆర్ఎం (ఇన్ఫ్రాస్ట్రక్చర్, వాల్తేరు) ఇ. శాంతారాం, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్

తరువాయి 8లో..



వార్త 8లో..

## సంద్రంలో వేటకు సిద్ధం

## తల్లికి వందనం రాలేదా...

### వార్డు సెక్రటేరియట్‌లలో ఎస్సీ ఎస్టీల కోసం నేడు ప్రత్యేక శిబిరాలు

విశాఖపట్నం, జూన్ 13, ప్రభాతవార్త

విశాఖ జిల్లాలో గల 9, 10 వ తరగతి మరియు ఇంటర్మీడియట్ చదువు చున్న షెడ్యూల్డ్ కులముల విద్యార్థి, విద్యార్థిని లకు తెలియజేయునది ఏమినగా, తల్లికి వందనము పథకములో స్కాలర్ షిప్ మంజూరు అగుటకు గాను బ్యాంకు ఖాతా లేదా పోస్టల్ ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానము చేసుకోవలసియున్నది. 1 నుండి 8 వ తరగతి చదువుచున్న విద్యార్థి, విద్యార్థిని లకు తల్లి అకౌంట్ కు జమ చేస్తారు. ఏ కారణం చేతన్కెనా తల్లికి వందనం డబ్బులు పడకపోతే సమీపంలో ఉన్న మీ గ్రామ వార్డ్ సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డ్ ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని, బ్యాంకు వారిని లేదా పోస్ట్ ఆఫీస్ వారిని సంప్రదించి ఎన్‌సీపీఐ అనుసంధానము చేసుకోవలసిందిగా సూచించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు వారి ఆదేశములు మేరకు మీ గ్రామా మరియు వార్డ్ సచివాలయము నందు పోస్టల్ డిపార్టుమెంటు వారి ద్వారా జూన్ 14న స్పెషల్ క్యాంప్స్ నిర్వహించబడునని తెలియజేశారు. మీ దగ్గరలో ఉన్న పోస్ట్ ఆఫీస్ వారిని కూడా సంప్రదించగలరని విశాఖ సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే. రామారావు ఓ ప్రకటనలో కోరారు.

# రెడ్డికంచరపాలెంలో విషాదం




### భార్యను డంబుల్ తో హత్య చేసి, ఉరి వేసుకున్న భర్త

### అనాథలైన ఇద్దరు పిల్లలు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త):

విశాఖ నగరంలోని రెడ్డి కంచరపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున విషాదం చోటుచేసుకుంది. అనుమానంతో భార్యను డంబుల్ తో భర్త హత్య చేసి, తర్వాత తాను కూడా ఉరి వేసుకొని తనువు చాలించాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారిపోయారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డి కంచరపాలెంలోని వివేకానంద కాలనీలో నివాసముంటున్న నందిగామ గోపీనాథ్(42) పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నాడు. గోపీనాథ్ కు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు జస్వంత్ రీతు(14), కుమార్తె లక్ష్మి ప్రియ(10) ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్త మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం భర్త వేధింపులు భరించలేక వెంకటలక్ష్మి కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పట్లో భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మరల భర్తకు

తరువాయి 8లో..



# గీతం లో అడ్మిషన్‌కు అవకాశాలు




వివరాలు 8లో..

# ప్రమాదం మాటున విశాఖ విమానాలు!!!

(7వ పేజీ నుంచి తరువాయి)



విరుద్ధంగా ఆహార వ్యర్థ పదార్థాలను యదేచ్ఛగా డంపింగ్ చేసేస్తున్నారు.

**వ్యర్థాల మాటున ప్రమాదాలు:**

పరిసర ప్రాంతాల్లోని కొన్ని హొటల్లు, క్యాటరింగ్ నిర్వాహకులు చెత్త తో పాటు మిగిలిపోయి పాడైపోయిన ఆహార వ్యర్థాలను విమానాశ్రయ ప్రహరీ గోడను ఆనుకొని ఉన్న గెడ్డ పొడవునా డంపింగ్ చేసేస్తున్నారు. దాదాపుగా అనేక ప్రదేశాల్లో ఇలా చెత్త డంపింగ్ చేస్తున్న దృశ్యాలు కానవస్తున్నాయి. ఈ కారణంగా వీటిని భక్షించేందుకు వచ్చే పక్షుల సంఖ్య పెరిగిపోతుంది. కాకులు, గెద్దలు, రాబందులు తోపాటు సైబీరియన్ జాతి పక్షులు కూడా ఆయా ఆహార వ్యర్థాల కోసం విమానాశ్రయ ప్రాంతంలో కలియ తిరుగుతూనే ఉంటున్నాయి. ఈ కారణంగా రాకపోకలు సమయాలలో విమానాల ముందు భాగంలో ఉండే ప్రొఫెల్లర్లలో పక్షులు పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఏదైనా పక్షి ప్రొఫెల్లర్లో పడిందంటే తద్వారా ఇంజన్లు దెబ్బతిని విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. దీంతో తీవ్ర ఆస్తి నష్టం తో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉంది. గతంలో ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా కోకొల్లలు. గురువారం అహ్మదాబాద్ టు లండన్ ఎయిర్ ఇండియా విమానం కూలిపోవడం వెనుక పక్షులు ఢీకొట్టడం కూడా కారణం కావచ్చు అన్న నిపుణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటే పరిస్థితి ఎంత తీవ్రతరం అన్నది అర్థమవుతుంది.

**నివారణ మార్గాలు:** కేవలం చిన్నపాటి జాగ్రత్తలతో వ్యర్థాల డంపింగ్ నిరోధించేందుకు వీలున్నా అధికారులు ఆ కోవలో చర్యలు చేపట్టకపోవడం విచారకరం. అక్రమంగా చెత్త డంపింగ్ చేస్తున్న వారిని గుర్తించి అదుపులోనికి తీసుకుని కఠినంగా శిక్షించడంతో పాటు సదరు విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తే డంపింగ్ చేసేందుకు ఎవరు సాహసించరన్న వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. విమానాశ్రయ అధికారులు కూడా ఆహార వ్యర్థాల వ్యవహారంపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా జీవీఎంసీ అధికారులకు సూచించాల్సి ఉంది. విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను డంపింగ్ చేస్తే శిక్షార్హులు అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. లేదంటే భవిష్యత్తులో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.

# గీతంలో అడ్మిషన్‌కు అవకాశాలు

**విశాఖపట్నం, జూన్ 13 ప్రభాతవార్త**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్‌మెంట్ (ఎంబిఏ, బిబిఏ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బీఎస్సీ, ఎమ్‌సిఏ, బిసిఏ), లా కోర్సులు, హ్యూమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరపీ మరియు పారామెడికల్ కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను జాతీయ స్థాయిలో ఈ నెల 22వ తేదీన ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలను (గ్యాట్-2025) నిర్వహించనున్నది.

**ఇంటర్ విద్యార్థులకు సైన్స్ డిగ్రీ కోర్సులు :**

ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సులతో పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎన్విరాన్‌మెంటల్ సైన్సెలలో 4 సంవత్సరాల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు అడ్మిషన్ల డైరక్టర్ తెలిపారు. అలాగే 3సంవత్సరాల బిసిఏ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెలలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఏ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**పారా మెడికల్ కోర్సులు :**

వైద్య ఆరోగ్య రంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రాంగణంలో బిఎస్సీ మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

**కామర్స్ మరియు మేనేజ్‌మెంట్ కోర్సులు:**

మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఆసక్తి గల విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఏ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఏ (ఫైనాన్షియల్ మార్కెట్స్), జనరల్ బిబిఏ కోర్సులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిజి స్థాయిలో ఎంబిఏ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మరియు అకాడమి ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడిరచారు. ఈ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025) ను దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. దీనికి సంబంధించి గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోదలచిన వారు పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను పరిశీలించవచ్చునన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి జూన్ 19వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

**విశాఖపట్నం, జూన్ 13 ప్రభాతవార్త**

జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (%×ణ్%) వేడుకలకు విశాఖపట్నం జాతీయ ఆతిథ్య నగరంగా ఎంపిక కావడంతో, నగరంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ అధికారులతో కలిసి సమగ్ర క్షేత్ర పరిశీలన, సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య డా. రాజేష్ కోటెచా, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు నేతృత్వంలో అధికారులు రుషికొండ బీచ్, ఆర్‌కే బీచ్, ఆంధ్ర యూనివర్సిటీ, గీతం విశ్వవిద్యాలయం వంటి ప్రధాన వేదికలను సందర్శించారు. ఆయుష్ జాయింట్ సెక్రటరీ మోనాలిసా దాష్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఆరోగ్య, పట్టణ ప్రణాళిక, వీఎంఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యోగా ప్రదర్శనలతోపాటు సాంస్కృతిక, విద్యా, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో అంతర్‌శాఖల సమన్వయం, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతుల సిద్ధత, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "చివరి మైలు వ్యక్తికి యోగాను తీసుకెళ్లాలి" అనే పిలుపు మేరకు దేశవ్యాప్తంగా యోగా ఉద్యమం ఊపందుకుంటోంది. ఇందుకు అనుగుణంగా "యోగాంధ్ర" అనే వినూత్న రాష్ట్ర ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందికి పైగా పౌరులకు యోగా సాధనను చేరవేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

**యోగాంధ్ర కార్యక్రమ ముఖ్యాంశాలు:**

లక్ష ప్రదేశాల్లో యోగా శిబిరాలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, 20 లక్షల యోగా అభ్యాసకుల శిక్షణ, విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో వేడుకలు ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించింది. భారతీయ సంప్రదాయంలో పాతుకుపోయిన యోగాను గ్లోబల్ వెల్‌నెస్ ఉద్యమంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొంది. "యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్" నినాదంతో భారతదేశం సమగ్ర ఆరోగ్య దిశగా ముందుకెళ్తున్న సందర్భంలో, విశాఖపట్నం ప్రపంచవ్యాప్తంగా ఈ ఉద్యమానికి వేదికగా మారడానికి సిద్ధమవుతోంది. జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో రాష్ట్ర నోడల్ అధికారి ఎం.టి. కృష్ణబాబు ఏయూ కన్వెన్షన్ హాలు సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమన్వయం వహించి యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమీక్షకు ముందు జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సందర్శన చేశారు.

# సంద్రంలో వేటకు సిద్ధం



**విశాఖపట్నం, జూన్ 13 ప్రభాతవార్త**

సంద్రంలో చేపలను వేటాడేందుకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుండి బోట్లు బయలుదేరుతున్నాయి. వీటి నిమిత్తం మత్స్యకారులు శుక్రవారం మధ్యాహ్నం వరకు బోట్లకు కావలసిన సామాగ్రి వలలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుండి నేటి వరకు ప్రభుత్వం వేట నిషేధం ప్రకటించింది. సుమారు రెండు నెలపాటు మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. ఈ అర్ధరాత్రి నుండి చాపల వేటాడి ఆదివారం వినియోదారులకు అందించేందుకు ఉత్సాహంగా ఉన్నారు. చేపలు ఎక్కువగా వలలు చిక్కుతాయని మత్స్యకారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## రెడ్డికంచరపాలెంలో విషాదం

(7వ పేజీ నుంచి తరువాయి)

వద్దకు కుమార్తెతో ఆమె చేరుకొని ఉంటుంది. అయితే కొద్దిరోజులుగా అనుమానంతో భర్త వేధిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతుంది గాని పోలీసులు పట్టించుకోలేదని బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ తరుణంలో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని భర్త గోపీనాథ్ భార్యను వేధిస్తున్నాడు. ఇదిలా ఉండగా శుక్రవారం తెల్లవారుజామున భార్యాభర్త మధ్య గొడవ జరిగింది. తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని గోపీనాథ్ ఒత్తిడి చేయడంతో ఆమె తిరస్కరించింది. దీంతో ఆవేశంతో ఊగిపోతూ ఇంట్లో ఉన్న దంబుల్ తో భార్య తల మీద దంబుల్ తో పలుమార్లు కొట్టి చంపేసి, తర్వాత మధ్య గదిలోకి వెళ్లి గడియ పెట్టుకొని ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని గోపీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన జరిగినప్పుడు పిల్లలు ఇద్దరు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, అమ్మతో పడలేకపోతున్నానని ఆమెను చంపేసి, తాను చనిపోతున్నానని, మీరిద్దరూ శుభ్రంగా ఉండండి అని గోపీనాథ్ చెప్పినట్టు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీ మార్చురీకి తరలించారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

**కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ**

**ఆరిలోవ , జూన్ 13 , ప్రభాతవార్త**



11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం విజయవంతం చేయాలని 13వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆరిలోవ లో కార్పొరేటర్ కెల్లా సునీత, వార్డ్ అధ్యక్షులు పాత్రకండ ధర్మారావు గారి ఆధ్వర్యంలో యోగా ర్యాలీని నిర్వహించారు .ఈ నెల 21 న జరగబోయే యోగా దినోత్సవం వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి వై . సురేష్, క్లస్టర్ ఇంచార్జ్ తురకపూడి బాలస్వామి, ఒశెట్టి పైడిరాజు, జనసేన నాయకులు నీలి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## దామంజోడి-కిరండూల్ విభాగాన్ని

# తనిఖీ చేసిన జనరల్ మేనేజర్

(7వ పేజీ నుంచి తరువాయి)

బి.ఎస్. రాజ్ కుమార్, చీఫ్ ట్రాక్ ఇంజనీర్ కె. దనుంజయ రావు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. తనిఖీ సమయంలో, ట్రాఫిక్ నిర్గమాంశ ప్రయాణీకుల సౌకర్యాలను పెంచే లక్ష్యంతో జనరల్ మేనేజర్ అనేక నిర్మాణ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ తనిఖీలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ట్రాఫిక్ సౌకర్యాల పనులు విభాగం అంతటా కార్యాచరణ మెరుగుదల వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. జనరల్ మేనేజర్ దమంజోడి, జగదల్‌పూర్ కిరండూల్ స్టేషన్లతో పాటు కిరండూల్ మరియు జగదల్‌పూర్‌లోని రైల్వే కాలనీలను సందర్శించారు. ప్రయాణీకుల సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం సిబ్బంది సౌకర్యాలను మెరుగుపరచడంపై ఆయన తనిఖీ దృష్టి సారించింది. విలువైన అభిప్రాయాన్ని సేకరించడానికి ఆయన రైల్వే సిబ్బందితో కూడా సంభాషించారు. డబ్లింగ్ పనుల పురోగతిని, అలాగే వంపులు, వంతెనలు, సొరంగాల స్థితిని మార్గంలో వివిధ భద్రతా చర్యలను నిశితంగా పరిశీలించడం ద్వారా వివరణాత్మక విండో ట్రెయిలింగ్ తనిఖీని కూడా నిర్వహించారు

## గుడివాడ అమర్ నాథ్ ను కలిసిన 87వ వార్డు సీనియర్ నాయకులు

**గాజువాక,జూన్ 13,ప్రభాతవార్త:**



వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ను ఆ పార్టీ 87వ వార్డు నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మెమోటో అందజేశారు. ఈ గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని,కూటమి అవినీతి,అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సుసూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రగఢ వేణుబాబు, ఇల్లపు రాము, మారుపు గోవింద్, పీ.కే రెడ్డి, పలిశెట్టి సత్యనారాయణ, గుంట్ల శ్రీను, జెర్రీ పోతులు ఆదినారాయణ, కర్రి నాగేశ్వరావు, మేస్త్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఆరోగ్యం.. ఆనందం

**ప్రపంచ రక్త దాన దినోత్సవం లో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే.రాంబాబు**



**ఆరిలోవ, జూన్ 13, ప్రభాతవార్త**

ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వలన ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నాం అనే మనసు సంతృప్తితో పాటు ఆరోగ్యవంతులుగా ఉండవచ్చు అని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం విమ్స్ లో ప్రపంచ రక్త దాన దినోత్సవ సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీ ను ఆయన ప్రారంభించారు. రెండు కిలోమీటర్ల మేర జరిగిన ఈ ర్యాలీలో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సరైన సమయంలో రక్తం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఈ రక్తం కొరత లేకుండా ఉండాలంటే ప్రజలు ముఖ్యంగా యువత రక్త దానం చేయటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక్క యూనిట్ రక్తం ద్వారా ఆపదలో ఉన్న ముగ్గురిని రక్షించే అవకాశం ఉంటుందన్నారు. విమ్స్ ఆస్పత్రి నందు గత ఆరు నెలలుగా బ్లడ్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది రక్తదాన శిబిరాలను నిర్వహించగా 542 యూనిట్ల రక్తాన్ని సేకరించటం జరిగిందన్నారు. త్వరలో రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా రోగులు కోసం ప్రత్యేక వార్డును విమ్స్ ఆస్పత్రిలో ప్రారంభించునున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహనతో కూడిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తోటగరువు ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లు పంపిణీ

**ఆరిలోవ , జూన్ 13, ప్రభాతవార్త**



పదో వార్డు తూర్పు నియోజకవర్గం తోటగరువు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ హాజరై వారి చేతుల మీదగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, యూనిఫార్మ్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు , విద్యామిత్ర సామాగ్రి అందజేయడం హర్షనీయమని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, తెదేపా నాయకులు ఒమ్మి సన్యాసిరావు, గాడు అప్పలనాయుడు, మద్దిల రాజేష్, గాడి సత్యం, సిహెచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పీవీ వ్యాక్సిన్ తోనే సంబంధిత క్యాన్సర్ల నుంచి రక్షణ

**కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి**




**విశాఖపట్నం. జూన్ 13 ప్రభాతవార్త**

సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని దేశవ్యాప్త ప్రజారోగ్య చొరవలో భాగంగా "కాంకర్ హెచ్ పీవీ & క్యాన్సర్ కాన్‌క్లేవ్ 2025" ను విశాఖలోని హొటల్ నోవోటల్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఇసుకపల్లి మాట్లాడుతూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. విదేశాల్లో ఈ వ్యాక్సిన్ పట్ల అవగాహన బాగా ప్రాచుర్యం పొందిందని, మనదేశంలో ఇంకా అంత ఆదరణ లభించలేదన్నారు. హెచ్ పీవీ వ్యాక్సిన్ యొక్క అవసరాన్ని కౌమారదశలో ఉన్నవారి తల్లిదండ్రులు గుర్తు ఎరగాలన్నారు. ముఖ్యంగా తొమ్మిదేళ్లు నిండిన బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని, తొమ్మిదేళ్ళ నుంచి పాతిక సంవత్సరాలు వరకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ మంచి ప్రభావంతో పనిచేస్తుందన్నారు. బాలికల్లో తొమ్మిదేళ్ల తర్వాత నుంచి ఎంత తొందరగా వ్యాక్సిన్ వేయిస్తే అంత ఫలితం ఉంటుందన్నారు. హెచ్ పీవీ కేవలం గర్భాశయ క్యాన్సర్‌కు మాత్రమే పరిమితం కాదని, వల్వా, యోని, పాయువు, పురుషాంగం, ఒరోఫారింక్స్ క్యాన్సర్‌లతో కూడా సంబంధం కలిగి ఉంటుందన్నారు. ఇది పురుషులు మహిళలు ఇద్దరినీ ప్రభావితం చేస్తుందన్నారు. 15 నుండి 25 సంవత్సరాల మధ్య హెచ్ పీవీ ఇన్ఫెక్షన్ గరిష్టంగా ఉన్నందున, ముందస్తు అవగాహన సకాలంలో నివారణ చర్యలు చాలా అవసరం అన్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న సరసమైన హెచ్ పీవీ వ్యాక్సిన్‌తో, హెచ్ పీవీ సంబంధిత క్యాన్సర్‌ల నుండి ప్రతి వ్యక్తిని రక్షించుకోగలమని చెప్పారు. వైద్య నిపుణులు నికిత హాస్పిటల్ డైరెక్టర్ & చీఫ్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ సునంద రాణి గుత్తా, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ హాస్పిటల్ ప్రసూతి & గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్ల విద్యా రామ, మెడికోవర్ హాస్పిటల్ చీఫ్ నియోనాటాలజిస్ట్, విజయనగరం మెన్స్ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ మానెమ్, నియోనాటాలజీలో ఫెలోషిప్, మదర్లీ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో నియోనాటాలజిస్ట్ పీడియాట్రిషియన్. డాక్టర్ బుద్ధ మురళి సంతోష్ ప్రసంగించారు. వారు మాట్లాడుతూ భారతదేశం హెచ్ పీవీ సంబంధిత వ్యాధులతో, ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్‌తో గణనీయమైన భారాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఇది దేశంలోని మహిళల్లో రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా మిగిలిపోయిందన్నారు. ఐసీఓ /ఐఏఆర్ సీ ఇన్ఫర్మేషన్ సెంటర్ డేటా ప్రకారం భారతదేశం ఏటా 1.23 లక్షలకు పైగా కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులను మరియు 77,000 కంటే ఎక్కువ సంబంధిత మరణాలను నివేదిస్తోందన్నారు. ఇది కాకుండా 90 శాతం వరకు ఆసన క్యాన్సర్‌లు & 63 శాతం పురుషాంగ క్యాన్సర్‌లు హెచ్ పీవీ తో సంబంధం కలిగి ఉన్నాయన్నారు. ఈ సదస్సులో నగరానికి చెందిన వైద్య నిపుణుల బృందం, పలు ఆసుపత్రి నుంచి వైద్యులు, సంబంధిత రంగాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

## అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్

**విశాఖపట్నం. జూన్ 13 ప్రభాతవార్త**



టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) సంయుక్తంగా నగరంలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (హెచ్ బీసీ హెచ్‌ఆర్ సీ)లో కొత్త భవంతి నిర్మాణ పనులను ఐసీఐసీఐ బ్యాంక్ ప్రారంభించింది. ఈ మేరకు గురువారం ఆ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా, టాటా మెమోరియల్ సెంటర్ (ముంబై) డైరెక్టర్ డాక్టర్ సుదీప్ గుప్తా సమక్షంలో ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా కొత్త భవనం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇతర ప్రముఖుల సమక్షంలో ఎన్.కె . రావు ఆడిటోరియంను కూడా సిన్హా ప్రారంభించారు. కొత్త ఆడిటోరియంనకు మౌలిక సదుపాయాలు, ఎక్విప్‌మెంట్‌పరంగా టీఎంసీ కి ఐసీఐసీఐ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించింది. ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా మాట్లాడుతూసుమారు 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో ఏర్పాటయ్యే ఈ అధునాతన కేంద్రం నిర్మాణానికి రూ. 550 కోట్ల పైగా మొత్తానికి కమిట్‌మెంట్‌తో ఐసీఐసీఐ బ్యాంకు నిధులను సమకూరుస్తోందన్నారు. ఎనిమిది అంతస్తుల ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్ క్యాన్సర్ కొత్త బిల్డింగ్ అందుబాటులోకి వచ్చాక ఏటా 3,000 మంది పేషంట్లకు సేవలందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. "సీఎస్ఆర్ కార్యకలాపాలకు సంబంధించి ఆరోగ్య సంరక్షణపై ఐసీఐసీఐ బ్యాంక్ ప్రత్యేక దృష్టి పెడుతుందని, విశాఖపట్నం, నవీ ముంబై, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు టిఎంసి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రూ. 1,200 కోట్లు హామీనివ్వడం ద్వారా భారత్‌లో క్యాన్సర్ కేర్‌కి సంబంధించి విశిష్ట సేవలు అందిస్తున్న టీఎంసీతో కలిసి పనిచేస్తున్నట్టు ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా తెలిపారు.

## సింహగిరిపై సేవా సంఘాల వారితో సమావేశం



**విశాఖపట్నం, జూన్ 13 ప్రభాతవార్త**

ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ సింహాద్రి నాధుని దర్శనం నకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంఘాలుతో నేడు సింహగిరిపై కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆదేశాల మేరకు సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ ప్రొటోకాల్ పర్యవేక్షణ అధికారి పద్మనాభ రాజు పి ఆర్ ఓ నాయుడువారి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా సంఘాల అధినేతలతో సమన్వయ సమావేశం జరిగింది. సదరు సమన్వయ సమావేశంలో సేవా సంఘాల ద్వారా భక్తులకు కల్పించే సేవలు అందించే వివిధ సేవలు సేవా కార్యక్రమాలు వివరాలు సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ తెలిపారు ఈ సమావేశంలో నారాయణ సేవా సంఘం ,వెంకట అన్నమాచార్య సేవా సంఘం, కామాక్షి సేవా సంఘాలు ఇతర సేవా సంఘాల సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రేమ జంటలే టార్గెట్..!

**కేసులు పెడతామంటూ బెదిరించి డబ్బులు వసూలు**

**గూగుల్ పే ,ఫోన్ పే ద్వారా ఖాతాల్లోకి డబ్బులు వేయించుకున్న వైనం**

**బాధితుల ఫిర్యాదులతో రంగంలోకి పెందుర్తి పోలీసులు**

**ఇద్దరు నకిలీ పోలీసులు అరెస్టు**

**పోలీస్ యూనిఫామ్, రూ.2 వేలు, సెల్ ఫోన్లు, స్కూటీ స్వాధీనం**

**( విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)**




విశాఖ నగరంలోని ప్రేమికులను టార్గెట్ గా చేసుకొని డబ్బులు వసూలు చేసే నకిలీ ఖాకీలు పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు.. శుక్రవారం సాయంత్రం పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పెందుర్తి సీఐ సతీష్ కుమార్ వివరాలను తెలియజేశారు.. ఇద్దరు నకిలీ పోలీసులు అడవివరం - సొట్యం రోడ్డులో ప్రయాణిస్తున్న ప్రేమజంటలను టార్గెట్ చేసుకొని "మీపై కేసులు పెడతాం" అంటూ బెదిరించి గూగుల్ పే ,ఫోన్ పే ద్వారా తమ ఖాతాల్లో డబ్బులు వేయించుకున్నట్టు బాధితులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో వెస్టు సబ్ డివిజన్ ఏసిపి ఏబి పృధ్వి తేజ ఆదేశాల మేరకు సీఐ సతీష్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై సిహెచ్ స్వామినాయుడు తమ బృందంతో రంగంలోకి దిగి ఆయా ప్రాంతాల్లో నిఘా వేశారు..ఈ మేరకు విజయనగరం జిల్లాకు చెందిన ఈతలపాక శివప్రసాద్ (45), కదరపు గోపి (38)లు నిందితులుగా గుర్తించారు.. గురువారం రాత్రి 8.30 సమయంలో సరిపల్లి చెక్ పోస్ట్ వద్ద ఇద్దరు నకిలీ పోలీసులను అదుపులోనికి తీసుకున్నారు.. అనంతరం నిందితులను ప్రచారించగా గత కొన్ని రోజులుగా తాము పోలీసులమని చెప్పి ప్రేమజంటలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు . నేరస్థులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.నిందితులు పోలీసు యూనిఫాం ధరించి, టీవీఎస్ స్కూటీ పై తిరుగుతూ,అడవివరం%-%సొట్యం రోడ్డులో ప్రయాణిస్తున్న ప్రేమజంటల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది.. నిందితులనుండి పోలీసు యూనిఫాం, రూ.2 వేలు నగదు, మొబైల్ ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన శివప్రసాద్ పై 15 కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.. గతంలో శివప్రసాద్ ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. కానీ అనుచిత ప్రవర్తన వల్ల అతనిని 2019లో ఉద్యోగం నుంచి తొలగించారు.అతనిపై పలు పోలీస్ స్టేషన్లలో ఇదే తరహాలో చేసిన కేసులు సుమారు 9 నమోదయ్యాయి. అలాగే రెండవ నేరస్థుడు కదరపు గోపి పై ఇప్పటివరకు నేర చరిత్ర లేని వ్యక్తి అయినప్పటికీ, ప్రస్తుతం శివప్రసాద్‌తో కలిసి నేరానికి పాల్పడినట్లు నిరూపితం అయింది.. ఈ సందర్భంగా పెందుర్తి సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ పోలీసులమని మోసం చేసి డబ్బులు వసూలు చేసిన ఎవరైనా బాధితులు ఉంటే, వారు భయపడకుండా ముందుకు వచ్చి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.. వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.. అలాగే ఎవరైనా ఆపి తాము పోలీసులమని చెప్పి డబ్బులు అడిగితే నమ్మొద్దని వెంటనే అప్రమత్తంగా వ్యవహరించి ఐడి కార్డు అడగడం ద్వారా అసలు విషయం బయట పడుతుందని సూచించారు.. నిజమైన పోలీసులు ఎప్పుడూ ప్రజల నుండి డబ్బులు వసూలు చేయరని అలా వసూలు చేస్తున్నారంటే నకిలీ పోలీసులకు అర్థం చేసుకోవాలని సూచించారు..



నకిలీ పోలీసులు శివప్రసాద్, గోపి

## జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ గా పల్లంరాజు బాధ్యతలు స్వీకరణ



**విశాఖపట్నం జూన్ 13 ప్రభాతవార్త**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన ఇంజనీరుగా జి.వి. పల్లంరాజు శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. మే 31వ తేదీన జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ గా ఉన్న పి. శివప్రసాద రాజు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న జి.వి.పల్లంరాజు ను పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్.ఎ.సి) జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ బాబు ఉత్తర్వులను జారీ చేశారు.

## ఇసుకలపాలెం ప్రాధమిక పాఠశాలను పద్మనాభంలో విలీనం చేయవద్దు.

## ఎంఈఓ ఆఫీసు వద్ద ధర్నా చేసిన తల్లిదండ్రులు.

**పద్మనాభం,జూన్ 13, ప్రభాతవార్త :**





మండలంలో ఇసుకలపాలెం గ్రామ ప్రాధమిక పాఠశాలను పద్మనాభం పాఠశాలలో విలీనం చేయవద్దని శుక్రవారం మండల విద్యాకార్యాలయం వద్ద పిల్లల తల్లిదండ్రులు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ హంస జ్యోతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తమ పాఠశాల సుమారు 50 సంవత్సరాల నుండి ఒకటి నుండి ఐదు తరగతులు నిర్వాహణ జరుగుతుందని, ప్రస్తుతం 3,4,5 తరగతులను విలీనం చేస్తే సహించేదిలేదని తల్లిదండ్రులు అధికారులను హెచ్చరించారు. కిలోమీటరున్నర దూరంలో ఉన్న పద్మనాభం పాఠశాలకు వెళ్లాలంటే నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే సింహాచలం, విజయనగరం రోడ్డును దాటి పిల్లలు వెళ్లాలి. దీంతో పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారతి, గ్రామ నాయకులు మహేష్, సూరిబాబు పాల్గొన్నారు.

## మరిడిమాంభ అమ్మవారిని దర్శించుకున్న సాలాపు దంపతులు



**గాజువాక,జూన్ 13,ప్రభాతవార్త :**

హిందూస్తాన్ షిప్యార్డ్ కాలనీ లో వెంచేసిన గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ మరిడి మాంభ అమ్మవారి ఉత్సవాన్ని కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంనకు చెందిన తెదేపా సీనియర్ నాయకులు సాలాపు రామారావు దంపతులు ఉత్సవం సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన కుంకుమ,ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్యవ,ఊరేగింపు వేడుకల్లో కుటుంబ సమేతమంగా పాల్గుంటునట్లు సాలాపు రామారావు తెలిపారు.

## విద్యార్థి కేంద్రీకృత బోధనా పద్ధతులు అనుసరించాలి

**గాజువాక,జూన్ 13,ప్రభాతవార్త:**



సాంప్రదాయక ఉపన్యాస పద్ధతి లో కాకుండా, విద్యార్థి ఆధారిత బోధనా పద్ధతులపై అధ్యాపకులు దృష్టి పెట్టాలని ప్రముఖ విద్యావేత్త యోగేష్ అన్నారు. మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో ఈనెల 12 13 తేదీలలో నిర్వహించిన రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ- ప్రస్తుతం సమాచారం అనేక మార్గాల ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంటోందని, అందువల్ల అధ్యాపకులు సమాచారాన్ని ఇవ్వడం పై కాక, విద్యార్థిని ఉత్తేజపరిచే పద్ధతులపై దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. చర్చల ద్వారా, వాద - ప్రతి వాదాల ద్వారా, క్విజ్ సెమినార్ల ద్వారా విద్యార్థులను తరగతి గదిలో క్రియాశీలకం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లీన్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ జానీస్,జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ. పి.ఎస్. భాగ్యలక్ష్మి,కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ డిడిఓగా ఎం.వి.డి.ఫణిరామ్‌కు అదనపు బాధ్యతలు



**విశాఖపట్నం జూన్ 13 ప్రభాతవార్త**

జీవీఎంసీ డి డి వో గా ఎం.వీ.డి ఫణి రామ్ శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాధ్యతలను స్వీకరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ ఈనెల 24వ తేదీ వరకు వ్యక్తిగత కారణాల వలన అర్జిత సెలవు లో ఉన్నందున ఆయన నిర్వహిస్తున్న డి డి వో బాధ్యతలను జీవీఎంసీ లో డిపిఓగా విధులు నిర్వహిస్తున్న ఎం. వి. డి.ఫణి రామ్ ను జీవీఎంసీ డి. డి. ఓ గా పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్.ఎ.సి) జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ ఎమ్ఎన్. హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) బాధ్యతలను జీవీఎంసీ అదనపు కమిషనర్ జనరల్ డి.వి రమణమూర్తికి బాధ్యతలను అప్పగించినట్లు ఉత్తర్వులలో కమిషనర్ పేర్కొన్నారు.

## నేడు అన్ని గ్రామాల్లో యోగా ప్రొటోకాల్: ఎంపీడీవో సీతారామరాజు



నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రోటోకాల్ యోగాసనాల కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో డీ సీతారామ రాజు సూచించారు. శుక్రవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీల వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో పలు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా డేను విశాఖ కేంద్రంగా ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపడుతోందన్నారు. ఇప్పటికే ప్రోటోకాల్ ఆసనాలపై శిక్షణ పొందిన వారందరితో ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం ఏకకాలంలో డెమో ఇవ్వాలని సూచించారు. వెంటనే ఈ ఫొటోలను యోగాంధ్ర యాప్లో అప్లోడ్ చేయాల్సివుంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఎంతో బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు.

## సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ .!

నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త



మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను స్థానిక సర్పంచ్ ఫాతిమున్నీషాబేగం, హైస్కూల్ హెచ్.ఎమ్ కే.జయశ్రీ, గ్రామపెద్దల చేతులమీదుగా గురువారం పాఠశాల ఆవరణలో అందజేశారు. దీనిలో భాగంగా గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరుతీసుకునిరావాలని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమని, గత ఏడాది పదవ తరగతిలో సాధించిన ఫలితాలే దీనికి నిదర్శనమని అన్నారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం కార్యక్రమంలో భాగంగా సన్నబియ్యంతో కూడిన ఆహారాన్ని విద్యార్థు లకు ఏర్పాటు చేయడం శుభపరిణామంగా ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు బషీర్, బి.లక్ష్మణరావు, ఇమామ్ హుస్సేన్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. చైర్మన్ మహబూబ్ మునిసా, ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు ఎస్ పాల్గన రావు శ్రీదేవి కుమారి వి.పద్మావతి తదితరులు ఉన్నారు.

## నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

కశింకోట, జూన్ 13, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని 33/11 కె.వి నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అడిషనల్ బ్రేకర్ (ఆర్డిఎస్ఎస్ ) స్కీమ్ పనులు కారణంగా 14 శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, ఎన్జి పాలెం, త్రిపురువాని పాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడ పాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, యేనుగుతుని, చిన్న యెనుగుతుని,%+% భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మొసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందనీ ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్ రామకృష్ణ తెలిపారు .ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వినియోగదారులకు విద్యుత్ వేళలు ఉదయం 8. గంటల నుండి 10 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఇవ్వబడిందనీ కావున ఆయా గ్రామాల ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన పీడీ సూర్యలక్ష్మి



కసింకోట, జోన్ 13, ప్రభాతవార్త

కశింకోట మండలంలోని చింతల పాలెం, నర్సింగిబిల్లి, జె.తుని, అచ్చర్ల అంగన్వాడీ కేంద్రాలను ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వరలక్ష్మి శుక్రవారం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలు బాలింతలతో మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు వారికిచ్చే న్యూట్రికిట్స్ అదేవిధంగా టేక్ హోమ్ రేషన్ సద్వినియోగపర్చుకోమని తెలియచెప్పారు. మంచిగా న్యూట్రిషన్ ఫుడ్ తీసుకున్నట్లయితే పుట్టబోయే శిశువు రెండున్నర నుండి మూడు కేజీల బరువు పుట్టాలని గర్భిణీ స్త్రీలకు తెలియచేసారు, అదే విధంగా టీటీ ఇంజక్షన్ వేయించుకోమని తెలియచే చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రీస్కూల్ పిల్లలు ఐదు సంవత్సరాలు పిల్లల్ని స్కూల్లో జాయిన్ చేయించమని తెలియ చేసారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించమని, ప్రీస్కూల్లో ఆటపాటలు అంగన్వాడీ కేంద్రాలు నర్సరీ కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడీ కేంద్రంలో విద్య బోధన చేయాలని అంగన్వాడి కార్యకర్తలుకు తెలియజేశారు. పిల్లల్లో జ్ఞానం పెంపొందించడానికి అంగన్వాడి కేంద్రాలు బాగా పనిచేస్తున్నాయని కితాబునిచ్చారు. తల్లులందరూ కూడా అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను పంపించాలని తెలియజేశారు.మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు మెనూ అంగన్వాడీ కేంద్రాల్లో రెగ్యులర్ మెనూ ఏదైతే ఉంటుందో దాని ప్రకారం వంటచేసే అంగన్వాడి కార్యకర్తలు పిల్లలకు మంచిగా భోజనం ఆరోగ్యకరమైనటువంటి భోజనం పెట్టాలని తెలియజేశారు పిల్లలకు భోజనం చేసే ముందు హ్యాండ్ వాష్ చేయించుకోవాలని తెలియ చెప్పడం జరిగింది. తల్లులందరూ అంగన్వాడీ కార్యకర్తలు పిడి గారితో మంచిగా ఇంట్రాక్ట్ అయ్యారు. అనంతరం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అంగన్వాడీ పిల్లలకు అచ్చర్ల గ్రామంలో తల్లుల చేత వారికి సర్టిఫికెట్స్ అందజేశారు.

## నీటి సంఘాలకు నిధులు మంజూరు




అనకాపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

అనకాపల్లి నియోజకవర్గంలో వున్న నీటి సంఘాలకు 2 28,000(రెండు కోట్ల ఇరవై ఎనిమిది లక్షలు మంజూరు అయ్యాయి. అందులో 10 లక్షల రూపాయలు తుమ్మపాల ఛానెల్ కి మంజూరు అయ్యాయి. దీంతో ఛానల్ పనులు శుక్రవారం ప్రారంభించారు. నీటి సంఘం చైర్మన్ పీలా సీతా రాము ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లు గా అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబీ ), మండల జనసేన నాయకులు చదరం నాగేశ్వరరావు కొల్లి రాము కొల్లి పనులు ప్రారంభించారు. అందులో కూటమి నాయకులు ఆడారి గోవిందరావు, తుమ్మపాల టీడీపీ అధ్యక్షులు కొణతాల రమణబాబు, జనసేన నాయకులు పీలా విశ్వేశ్వరరావు, పీలా తాతు నాయుడు, హై స్కూల్ చైర్మన్ పెతకం శెట్టి బలరామ స్వామి, విఘ్న సింహాచలం యాదవ్, తుమ్మపాల నీటి సంఘము వైస్ చైర్మన్ కొప్పా రమణ, కరణం సోమ నాయుడు, అల్లం అప్పారావు, చదరం రామరాజు, దిబ్బపాలెం టీడీపీ ప్రెసిడెంట్ సూరిశెట్టి శివ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అచ్చియ్యమ్మ చదరం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంటర్మీడియట్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ..

ఎలమంచిలి, జూన్ 13, ప్రభాతవార్త



భారత ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం చేసిన యోగా దినోత్సవం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల జూన్ 2 నుండి జూన్ 21 వరకు యోగ ఆసనాలు కార్యక్రమం కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు యోగ మానసిక ఉల్లాసం ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. అనంతరం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన సంసిద్ధత నిమిత్తమై నీట్, జేఈఈ మెయిన్స్, ఏపీ ఈ సెట్ మొదలగు పరీక్షలకు కావలసిన మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలికోన్నత ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టిన కె.సుశీల..

ఎలమంచిలి, జూన్ 13, ప్రభాతవార్త



పట్టణంలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల,ఇంటర్మీడియట్ ప్రధానోపాధ్యాయురాలుగా సుశీల బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా నరవ నుండి ఎలమంచిలి బాలికోన్నత పాఠశాల ఇంటర్మీడియట్ కు ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలోనే క్రమశిక్షణతో మంచి విద్యార్థులను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.



## అక్షరాభ్యాస కార్యక్రమానికి స్పందన.!

నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

మండలంలోని దోసలపాడు అగ్రహారం అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీడీపీవో శ్రీవిద్య, సూపర్వైజర్ కె.లలిత హాజరయ్యారు. ఈ కేంద్రంలో అడ్మిషన్ పొందిన పిల్లలతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు. అనంతరం పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలంటూ అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీచర్లు ప్రశాంతి కుమారో, అశ్విని, అంగన్వాడీ కార్యకర్తలు పి.పద్మ, వి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గూడుపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు -దర్శించుకున్న ప్రముఖులు



నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

రేబాక గూడుపమ్మ తల్లి ఆలయాన్ని భవిష్యత్లో రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకుంటారని, ఇప్పటికే అమ్మవారి ఆలయ విశిష్టత, మహిమలు గురించి చాలా మంది తెలుసుకున్నారని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిలువూరి రామ సూర్య నారాయణరాజు (పెంకులరాజు) అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఈ ఆలయాన్ని ఏఎన్ఆర్ ఎస్టేట్స్ అధినేత అడబాల నారాయణమూర్తి, గున్నా బత్తుల వెంకట రమణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు సహా పలువురు భక్తులు దర్శించుకు న్నారు. ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. భక్తుల గోత్రనా మాలతో పూజా కార్యక్రమాలు చేశారు. నారాయణమూర్తి, పెంకులరాజు, వెంకట రమణను రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, కరణం ఈశ్వరరావు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

## కనకదుర్గ ఆలయ వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

అనకాపల్లి, జూన్ 13, ప్రభాతవార్త



గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయములో 8వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బోగాపురపు వెంకటరమణ (బాబు) ఆధ్వర్యంలో ఆలయ అష్టమి వార్షికోత్సవ వేడుకలు ఈనెల 17, 18, 19 తేదీల్లో ఘనంగా జరుగుతాయని ఆలయ నిర్వాహకులు, శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ తెలియజేశారు. శుక్రవారం ఆలయం వద్ద 8 వార్షికోత్సవ కరపత్రాన్ని ఆలయ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యం తో అమ్మవారికి ఈనెల 17 పెళ్లిరాట, 18 హోమం, గోపూజ, 19 దుర్గా మల్లేశ్వర స్వామి వారి కళ్యాణం జరుగుతాయని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, కొణతాల మురళీ కృష్ణ, కొణతల సంతోష్ అప్పారావు, దాడి కృష్ణ,సూరిశెట్టి నరసింగరావు, బుద్ద భూలోక నాయుడు, కేఎం నాయుడు, పొలిమేర శ్రీను, బుద్ధ సంతోష్, గండేపలి మురళి, ఆళ్ల మధు, పెంటకోట లక్ష్మి నారాయణ, రాజు, జీవన్, హృదయ, అక్షయ్ ఆలయ ఉత్సవ కమిటీ డైరెక్టర్స్, శ్రీ గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిదిమాంబ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



నక్కపల్లి,జూన్ 13, ప్రభాతవార్త

మండలంలోని కొరుప్రోలు అంగన్వాడీ సెక్టారులో సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు సూపర్ వైజర్ ఎంబి నిషా ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం కొరుప్రోలు శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ ఆవరణలో గ్రామపురోహితులు పేర్వేల ప్రశాంత్ మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. నక్కపల్లి సిడిపివో శ్రీవిద్య ఆదేశాల మేరకు అన్ని సెక్టార్లలో సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టనున్నట్లు అంగన్వాడీ కార్యకర్త తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సావిత్రి, సుబ్బలక్ష్మి, లోవకుమారి, ఆయాలు షేక్ రజియా, గారా రమణమ్మ, గారా అప్పలనర్స పాల్గొన్నారు.

## పార్యపుస్తకాలు పంపిణీ.!

నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త



మండలంలోని జానకయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కురందాసు అప్పలరాజు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులతోపాటు పలు ఉపాధ్యాయులు ఉన్నారు.

## అమ్మవారి మాన్యం భూమికి పరిహారం చెల్లించండి.!



నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

మండలంలోని ప్రతిష్టాత్మమైన రాజయ్యపేట గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 293లో 4.95 సెంట్లు విస్తీర్ణం ఉండగా అదేవిధంగా సర్వే నెంబర్ 296/1లో 4.16 సెంట్లు భూమి నూకాలమ్మ మాన్యం భూమికు ఏపీఐఐసీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి భూములులో ఉన్న మొక్కలను తొలగించాలని అప్పటి వరకు మొక్కల తొలగించవద్దని తహసిల్దారు ఆర్.నరసింహమూర్తికి పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు వినత పత్రం శుక్రవారం అందజేశారు. తాసిల్దార్ని కలిసిన వారిలో ఎంపిటిసి పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, పూజారి పిక్కి దేముడు పూజారి పిక్కి తాతీలు, వాసపల్లి శివాజీ, సిరిపల్లి అప్పలరాజు,గోసల స్వామి, పిక్కి సత్తియ్య, చేపల సోమేష్, మైలపల్లి నల్ల, తదితరులు ఉన్నారు.


## కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం సందర్భంగా సంబరాలు..

ఎలమంచిలి, జూన్ 13, ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతి రావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపర మేధాశక్తిని కలవారిని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఎన్నో సంవత్సరాలకు వెనక్కి వెళ్లిపోయిందని అభివృద్ధి అనేది లేకుండా గత ఐదు సంవత్సరాలు గడిచిందని, కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోడ్లు, అభివృద్ధి సంక్షేమ పథకాలు మొదలయ్యాయని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా కంపెనీలు కూడా వస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు కలయికతోఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో కేంద్రం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ, రూరల్ పార్టీ అధ్యక్షులు ఇత్తంశెట్టినాయుడు, పీలా తులసీరామ్, గొంతెన హరీష్, లాలం భరత్, ఆడారి ఆదిమూర్తి, కరణం రవికుమార్, గొర్ల బాబురావు, కాండ్రకోట చిరంజీవి, గంజి శ్రీనివాస్, గుర్రాల రాము, పిల్లా అది బాబు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్ననాటి నుండి నడవడిక నేర్పేందుకు బాల వికాస్ కేంద్రాలు




ఎలమంచిలి, జూన్ 13, ప్రభాతవార్త

బాల్య వయసు నుండి సంస్కారాన్ని నేర్పడం ద్వారా వారి జీవితకాలం మంచి నడవడిక లక్షణాలతో సమాజంలో జీవించగలరని సమరసతా సేవ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అయోధ్యపురి కాలనీలో సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మాణం చేసిన రామాలయంలో కమిటీతో ఏర్పాటుచేసిన సమావేశంలో దేవాలయాల్లో బాల వికాస్ కేంద్రం ద్వారా రానున్న రోజుల్లో వారి భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందని సంస్కారం నేర్చుకొని సమాజంలో ఒక ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఆ దేవాలయంలో బాలవికాస్ కేంద్రానికి అవసరమైన మాతాజీ ఎంపిక కూడా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో 822 దేవాలయాల నిర్మించగా వీటిలో ఏడాది 350 దేవాలయాల్లో బాలవికాస్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉత్తరాంధ్ర, గోదావరి జోన్లవారికి వచ్చేనెల 6,7 తేదీల్లో రెండు రోజులపాటు మాతాజీలకి, ఆచార్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ బాల వికాస్ కేంద్రాలను గురు పౌర్ణమి ప్రతి దేవాలయంలో ఆలయ కమిటీ, మండల కమిటీ, జిల్లా కమిటీ ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీను, మండల కన్వీనర్ రాజాన సత్యనారాయణ, అర్చక స్వామి కనక లింగం, కమిటీ సభ్యులు లక్ష్మీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

## మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం,జూన్ 13,ప్రభాతవార్త



నర్సీపట్నం మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ జనాభాకు తగిన విధంగా పారిశుధ్య కార్మికులు లేక తీవ్ర పని భారం పెరిగిందన్నారు. కావున జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు డ్రైవర్ డ్యూటీలు వేయరాదన్నారు. మచ్చుర్ రెగ్యులర్ గా రికార్డులలో వేకపోవడంతో జీతాలు కోత పడుతుందని, మచ్చర రికార్డులోనే నమోదు చేయాలన్నారు. సిఎల్ అమలు చేయాలని, ట్రాక్టర్, కనీసం ముగ్గురు కార్మికలను కేటాయించాలని కోరారు. పుష్కర్టులకు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు.. కార్మికులపై మేస్త్రీల బెదిరింపులు, దూషణలు అరికట్టాలన్నారు. పనిముట్లు నాణ్యమైనవి ఇవ్వాలని, ఈఎస్ఐ కార్డులను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పారావు, సభ్యులు అప్పారావు, సిఐటియ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు వి.రమణ, అర్జమ్మ రాజు, శ్రీను, లోవ, దేముడు, బాబురావు తదితరలు పాల్గొన్నారు.

## విద్యకు పెద్ద పీట వేసింది కూటమి ప్రభుత్వం: గింజాల



నక్కపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ఆలోచన ప్రకారం రాష్ట్రంలో ఊహించిన విధంగా విద్యా వ్యవస్థలో ఉన్నతమైన సంస్కరణలు తీసుకొచ్చారని, అందులో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి పాఠశాలలకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందజేయమని టిడిపి మండల శాఖ అధ్యక్షులు గిం జాల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని డిఎల్ పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో ఊహించిన విధంగా ఒక ఉపాధ్యాయురాలు రాష్ట్ర కీలకమైన శాఖ హోం శాఖలో మంత్రిగా బాధ్యతలు వహిస్తూ రాష్ట్రంలో ఒక చరిత్ర సృష్టిస్తున్నారని అది మనందరికీ గర్వకారణం అని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదివి గ్రామానికి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని అందుకు సహకారం అందించడానికి గ్రామం ఎప్పుడు సిద్ధంగా ఉందని అన్నారు. విద్యామంత్రిగా ఉన్న నారా లోకేష్ ఐదు సంవత్సరాలు ప్రతిపక్ష పార్టీకి సాధ్యం కానీ సన్న బియ్యం అందజేసి పిల్లలకు వండి పెట్టే కార్యక్రమం చేపట్టారు. అంటే ఇటువంటి మార్గంలో విద్యావ్యవస్థను తీసుకువెళ్తున్నారు ప్రతి ఒక్కరు ఆలోచిం చాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ రాష్ట్రం సంవత్సర కాలంలో ఎంతో అభివృద్ధి చెందిందని రానున్న నాలుగు సంవత్సరాలలో ఊహించిన అభివృద్ధి చేసి 30 సంవత్సరాల పాటు ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని అదేవిధంగా తీర్చిదిద్దుతారని అది ప్రజలకు నమ్మకం వచ్చిందని అన్నారు. సంవత్స రం పూర్తయిన సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమాన్ని సకాలంలో తల్లిదండ్రుల ఖాతాలో జమ చేశారని అన్నారు. ఎంపీటీసీ కొండ్రకాసులు, మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ,విశ్రాంతి ఉపాధ్యాయులు బి. దశరథరాజు, టిడిపి నాయకులు వేగేసిన సూర్యనారాయణరాజు ,గింజల తాతలు మత్స్యకార నాయకుడు గరికిన సింహాద్రి ,స్కూల్ కమిటీ చైర్మన్ హరి ,మార్కెట్ డైరెక్టర్ ఏడిద సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ స్వామినాయుడు

అనకాపల్లి, జూన్ 13, ప్రభాతవార్త



సైబర్ నేరాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. కొత్తపల్లి గ్రామస్తులతో ఆయన సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఎస్.ఎం.ఎస్., వాట్సాప్ ఇతర మాధ్యమాల ద్వారా నకిలీ ఏపీకె ఫైళ్లు పంపబడుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదాహరణకు ఎస్.బి.ఐ. రివార్డ్ యాప్, ఇన్ కమ్ టాక్స్ రిఫండ్ యాప్, ఎలక్ట్రిసిటీ బిల్లు యాప్ మొదలైన వాటి ద్వారా మోసాలు జరుగుతున్నాయని అన్నారు. ఇవి అధికారిక అప్లికేషన్లు కావని, ఇవి మీ బ్యాంక్ డిటెయిల్స్, ఓటీపీలు, కాంటాక్ట్‌లు, ఫోన్ డేటా దొంగిలించడానికి ఉద్దేశించబడ్డాయని అన్నారు. ఈ నకిలీ యాప్‌ల ద్వారా మీ బ్యాంక్ ఖాతాలు ఖాళీ కావచ్చునని, వ్యక్తిగత సమాచారంతో పాటు పోలీస్ శాఖ సమాచారం కూడా లీక్ అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే ఇతర సిబ్బంది ఫోన్లు కూడా హ్యాక్ అవుతున్నాయని, ఇది పర్సనల్ మరియు డిపార్ట్‌మెంటల్ సెక్యూరిటీకి తీవ్రమైన ముప్పు అని అన్నారు. లింకుల ద్వారా వచ్చిన లేదా ఫార్వర్డ్ చేసిన ఏపీకె ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. ఎలాంటి వ్యక్తిగత లేదా శాఖా సమాచారాన్ని అనధికారిక యాప్‌లలో షేర్ చేయవద్దని సూచించారు. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులు వచ్చిన వెంటనే సైబర్ సెల్ లేదా ఐటీ వింగ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఫేస్ బుక్ లో కొందరి అకౌంట్స్ హైక్ అవుతుంటాయని, హాస్పిటల్‌లో ఉన్నామని, వివరాలు తర్వాత చెబుతామని ముందు అత్యవసరంగా అమౌంట్ కావాలనే మెసేజ్ లు వస్తాయని, మనకు బాగా కావాల్సిన వ్యక్తుల నుంచి ఆ మెసేజ్ లు రావడం వలన వెంటనే వారు పంపిన నెంబర్ కు డబ్బు పంపి మోసపోయినవారు ఎందరో ఉన్నారని అన్నారు. అలాగే పాస్ పోర్ట్ కలిగిఉన్న వారిని కూడా టార్గెట్ చేస్తూ మీపై ముంబాయి పోలీసులు కేసు నమోదు చేసారని, మీ పేరుతో డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డారని, మీ ఐడెంటిటీ దొరికిందని వీడియోస్ మనకు పంపి బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నారని ఇటువంటి మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## శిరగాం పంచాయితీ రోడ్డుకు మోక్షం కల్పించండి



అరకులోయ, జూన్ 13, ప్రభాతవార్త

అరకులోయ మండలంలో మరమ్మతులకు గురైన సిరగాం పంచాయితీలో రోడ్డుకు మోక్షం కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు ఎస్.ఐసుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ శిరగాం పంచాయతీ పరిధిలో రోడ్డు గోతుల మయంగా మారడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు చెప్పారు. శిరగం పంచాయతీలో అధ్వానంగా మారిన రహదారి వలన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ రహదారి సమస్యపై పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని దీనివల్ల సమస్య తీవ్రతరం అవుతుందని చెప్పారు. కనీసం అంబులెన్స్ రావాడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల భవిష్యత్తులో గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



## నేటి నుండి 21 వరకు యోగ సాధన

### ప్రతి ఒక్కరూ సాధన చేసే విధంగా చర్యలు తీసుకోండి - సంయుక్త కలెక్టర్ డా.అభిషేక్ గౌడ

పాడేరు,జూన్13,ప్రభాతవార్త

గ్రామ, మండల, జిల్లా స్థాయి యోగా పోటీలు పూర్తయ్యాయని, ఈ నెల 14వ తేదీ శనివారం నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం 21వ తేదీ వరకు ప్రతి సచివాలయ పరిధిలో యోగ సాధన జరగాలని సంయుక్త కలెక్టర్ డా.ఎం జే అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం జేసి జిల్లా, మండల అధికారులు, యోగ ట్రైనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,292 యోగా కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, అన్ని కేంద్రాలలో ఈ వారం రోజులు యోగ సాధన జరగాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, డివిజన్, మదన్ల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు వారికి దగ్గరగా ఉన్న సచివాలయ పరిధిలో యోగ సాధన చేయాలని సూచించారు. జిల్లా అధికారులు యోగ సాధన చేస్తూనే యోగ సాధన పర్యవేక్షించాలని ఆదేశించారు. యోగ సాధన పోటోలను నోట్ కేమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజలను చైతన్య పరచి యోగ సాధనకు ప్రోత్స హించాలని ఆదేశిం చారు. జిల్లాలో 4.62 లక్షల మంది యోగ సాధనకు నమోదు చేసుకున్నారని జేసి తెలిపారు. నమోదు చేసు కున్న వారందరూ శనివారం నుండి వారం రోజులు యోగ సాధన ప్రక్రియలో పాల్గొనే విధంగా చర్యలు తీసు కోవాలని, యోగా డే అనంతరం వారు యోగ సాధన నిరంతర ప్రక్రియగా అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లా యోగ నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, జిల్లా, మండల స్థాయి అధికారులు, యోగ ట్రైనర్లు పాల్గొన్నారు.




## చింతూరు ఏజెన్సీలో అమానుష ఘటన

### పుట్టిన పసికందును ప్లాస్టిక్ కవర్లో అడవిలో చెట్టుకు వేలాడదీత

చింతూరు, జూన్ 13, ప్రభాతవార్త

చింతూరు ఏజెన్సీలో అమనుషఘటన చోటుచేసుకుంది అప్పుడే పుట్టిన పసికందును దట్టమైన అడవిలో ప్లాస్టిక్ కవర్లో పెట్టి చెట్టుకు వేలాడ తీసి కన్నతల్లో, కుటుంబ సభ్యులో చేతులు దులు పుకున్నారు. ఈ ఘటన వి.ఆర్.పురం మండలం కుందులూరు పంచాయతీ పరిధిలోని కొక్కిరి గూడెం గ్రామ పరిసరాల్లో జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం కొక్కిరగూడెం గ్రామానికి చెందిన ఒక యువకుడు అడవి వైపు వెళుతుండగా పసికందు ఏడుస్తున్న శబ్దం అతని చెవికి తాకింది, పసికందు ఏడుపును గమనిస్తూ అటుగా వెళ్లిన ఆ యువకుడు చెట్టుకు వేలాడదీసిన కవర్లో పసికందు ఉన్నట్టు గమనించి ఇంటికి వెళ్లి విషయం అతని తల్లికి తెలియజేశాడు. స్పందించిన ఆమె వెంటనే అక్కడికి వెళ్లి చెట్టుకు ఉన్న కవర్‌ను తీసి గమనించి గ్రామంలోకి తీసుకొని వచ్చి సమీపంలోని ఏఎన్ఎంకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న ఏఎన్ఎం పసికందును చింతూరు ఎస్ఎన్సికి తరలించారు. ఆస్పత్రిలో పసికందును గమనించిన వైద్యాధికారులు పరిస్థితి కాస్త విషమంగానే ఉందని వెంటనే స్పందించి వైద్య సేవలను మొదలుపెట్టారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కోటిరెడ్డి అన్ నోన్ బేబీ కావడంతో పోలీసు అధికారులకు, ఐసిడిఎస్ అధికారులకు మీడియాకు సమాచారాన్ని చేరవేశారు. ప్రస్తుతం ఆ పసి కందుకు ఎస్ఎన్సిలో వైద్యం అందజేస్తున్నారు. ఇటువంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా మీడియా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

## యోగాపై మాసీవ్ డెమో చేయించండి.. ఎంపిడిఓ



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

21 తేదీన విశాఖపట్నంలో 5 లక్షలు మందితో జరిగే యోగాపై మాసీవ్ డెమోను ప్రతీ సచివాలయంలో నిర్వహించాలని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అన్ని పంచాయితీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో అన్ని పంచాయితీల కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మలేరియా బారిన ప్రజలు పడకుండా దోమ తెరలు వినియోగం, పరిసరాలు పరిశుభ్రత, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్య సేవలు పొందడం వంటి విషయాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు కోనేటి రాంబాబు, కార్యదర్శులు సంధ్యారాణి, గోవిందరాజు, కొచ్చా రాంబాబు, నాగేశ్వరరావు, వరప్రసాద్, శ్రీనివాస్, చంద్రవిజయలక్ష్మి, వీరయ్య, రవికుమార్, హేమశ్రీ, బాలశివప్రసాద్,, పి. శివ, కె. బాలురెడ్డి, చిరంజీవి, సన్నీ వరయ్య, పాల్గొన్నారు.

## పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిగా శారదా దేవి బాధ్యతలు స్వీకరణ



పాడేరు, జూన్13, ప్రభాతవార్త

పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిగా శారదా దేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిగా విధులు నిర్వహించిన ఝాన్సీ రాణిని విశాఖ జోనల్ అధికారిగా ఆ శాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిగా విశాఖలో విధులు నిర్వహిస్తున్న శారదా దేవిని పాడేరులో నియమించారు. దీంతో పిఓగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా అల్లూరి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిగా ఇంచార్జి భాధ్యతలు కూడా ఈమె వ్యవహరించనున్నారు.

## మీకోసంకు 105 విజ్ఞప్తులు



పాడేరు,జూన్13, ప్రభాతవార్త

జిల్లా రెవిన్యూ అధికారి, కె.పద్మలత, స్పెషల్ డిప్యూటీ కలక్టర్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం 'మీకోసం ' కార్యక్రమం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమములో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారులు అందించిన ఫిర్యాదులు స్వీకరించం జరిగింది. ఈ వారం మీకోసంకు 105 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఫిర్యాదులను సకాలంలో నాణ్యవంతంగా పరిష్కరించాలని సూచించారు.

### మీకోసంకు అందిన ఫిర్యాదులలో కొన్ని..

ముంచింగిపుట్టు మండలం, ఏనుగురాయి పంచాయితీ, నాడుమూరు గ్రామం నుండి సీమాలి నారాయణరావు, గృహ నిధులు గురించి 6 మాసములు నుండి అర్జీ పెట్టుకున్నా నిధులు మంజూరు కాలేదని తెలుపుతూ అర్జీ సమర్పించారు. కొయ్యూరు మండలం అంతాడ గ్రామా పంచాయితీ, ఎద్దు మామిడి, సింగూరు గ్రామస్తులు ఎస్.నూకరాజు, వి.రమణబాబు, యు.సోమరాజు తమ గ్రామానికి బిటి రోడ్డు మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నారు. కొయ్యూరు మండలం అంతాడ గ్రామా పంచాయతి ఎద్దు మామిడి గ్రామస్తులు వీ.రమణ బాబు, ఎస్.ఎర్రిబాబు, ఎస్.బాలరాజు వారి గ్రామానికి వాటర్ టాంక్ నిర్మాణము చేపట్టాలని అర్జీ పెట్టారు. పాడేరు మండలం గుత్తిలిపుట్టు పోస్టు, జల్లిపల్లి గ్రామం నుండి మజ్జి రవికుమార్ ఎస్.టి కొండదొర కుటుంబానికి చెందినవారమని, వారి అమ్మాయికి ఏకలవ్య స్కూల్ నుండి ఎంట్రన్స్ పరీక్ష వ్రాయగా తక్కువ మార్కులు వచ్చిన0దున స్కూలులో సీటు ఇవ్వలేదని, అమ్మాయికి ఏకలవ్య స్కూలు నందు ఏ విధంగానైనా సీటు ఇప్పించవలసినదిగా కోరుతూ దరఖాస్తు పెట్టారు. చింతపల్లి మండలం, లంబసింగి పంచాయతి, లంబసింగి గ్రామం నుండి గ్రామస్తులు డా.డి.మహేష్, ఎం.కృష్ణమూర్తి రాజు, ఎల్.కె.మూర్తి తమ గ్రామములో నాటు సారా నిర్మూలించమని అర్జీ పెట్టారు. వై.రామవరం మండలం, బొద్దిగండి పంచాయితీ, డొంకరాయ గ్రామం నుండి గ్రామస్తులు పి.సంతోష్, జి.వెంకటరావు, జి.సతీష్ వారి గ్రామంలో 50 కుటుంబాలు నివశిస్తున్నాయని, వర్షాకాలంలో వాగులు కుమ్ముతుండడం వలన వాగు దాటడానికి ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ అర్జీ పెట్టారు. ఈ కార్యక్రమమునకు సర్వే అండ్ లాండ్స్ సహాయ సంచాలకులు, కే.దేవేంద్రుడు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.విద్యాసాగర్, ఉద్యానవన శాక సహాయ సంచలుకులు రమేష్ కుమార్ రావు, పరిశ్రమల శాఖ సహాయ సంచలుకులు ఆర్వి రమణ రావు, పశు సంవర్ధక శాక అధికారి సిహెచ్ నరసింహులు, డిమ్ అండ్ హెచ్ఓ జమాల్ బాష, అగ్రికల్చర్ ఆఫీసర్ బివిఎస్ నంద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తొంబై శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ

### రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి : దారేల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి



పాడేరు, జూన్13, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా దారేలగ్రామపంచాయతీ పరిధిలో గల రైతు సేవా కేంద్రంలో గురువారం దారేల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి చేతుల మీదుగా 90 శాతం రాయితీతో వరి విత్తనాలను రైతులకు అందజేశా రు. సర్పంచ్ పాంగి పాండురంగస్వామీ మాట్లాడుతు గిరిజన రైతులందరికీ ఈ కూటమి ప్రభుత్వం తొంబై శాతం రాయితీతోనే వరి విత్తనాలను ఇస్తుందని, వర్షాలు మొదలు కాకుండానే వరి విత్తనాలను రైతులకు అందించాలని ఒక ఆలోచనతో కూటమి ప్రభుత్వం ముందుగానే రైతు చేతికి విత్తనాలను అందిస్తుందని అందరూ రైతులు సక్రమంగా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. వరి విత్తనాలు కావలసిన రైతులు దారేల హార్టికల్చర్ అసిస్టంట్ ని సంప్రదించాలని ఆయన తెలియజేశారు, ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో దారేల సెగ్మెంట్ ఎంపిటిసి మల్లికార్జున రావు, హార్టికల్చర్ అసిస్టంట్ చందు, టిడిపి, జన సేన నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో రోడ్డు ఆక్రమణల తొలగింపు, విస్తరణ పనులు జరగాల్సిందే!

### పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు



పాడేరు, జూన్13, ప్రభాతవార్త

అల్లూరి జిల్లా 5వ షెడ్యూల్ ప్రాంత పరిధిలో ఉన్న రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు అల్లూరి జిల్లాలోని పలు ప్రధాన కేంద్రాల్లో రోడ్డు విస్తరణ కోసం అక్రమ నిర్మాణాలు తొలగింపు కోసం... హైకోర్టు ఆదేశాలు మేరకు 100 అడుగులు వెడల్పు చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాడేరు జిల్లా కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతుందనీ, అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ జామ్ అయి రోగులు సైతం సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. పట్టణ ప్రాంతాలు అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ చూసుకుని పలు రాజకీయ పార్టీల నాయకులు గిరిజన పట్టణ ప్రాంత అభివృద్ధికి మద్దతు ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రాజకీయ పార్టీల నాయకులు రోడ్లపై స్వచ్ఛందంగా వచ్చి మీ వైఖరి తెలియజేయాలాన్నారు. జిల్లా కలెక్టర్ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఈ రోడ్డు ఆక్రమణల తొలగింపు, విస్తరణ పనులు ఆగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుకోవాలని లేని పక్షంలో స్థానిక గిరిజనులు, ఆదివాసీ సంఘాలతో కలిసి వైసీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## మెడికల్ కళాశాల రక్తదాన శిబిరానికి ఉత్సాహంగా ఎంబిబిఎస్ విద్యార్థులు





పాడేరు, జూన్13, ప్రభాతవార్త

స్థానిక మెడికల్ కళాశాలలో శుక్రవారం ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎంబిబిఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థినిలకు వివరించారు. జిల్లాలో రక్తపు నిలువలు పెంచేందుకు రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించే ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర,రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు కార్యదర్శి జి.గౌరీశంకర్, కోశాధికారి పి.సూర్యరావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, సంజీవరావు, రవి, జిల్లా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరకులోయలో ఘనంగా హ్యూమన్ రైట్ మిషన్ ఆవిర్భావ దినోత్సవం

### రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



అరకులోయ, జూన్ 13, ప్రభాతవార్త

అరకులోయలో శుక్రవారం హ్యూమన్ రైట్ మిషన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు బెల్లం ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు అరకులోయ లో హ్యూమన్ రైట్స్ మిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ కార్యదర్శి జె కే రత్న రాజు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అరకులోయ ఏరియా ఆసుపత్రి లో ఆసుపత్రి ఇంచార్జ్ డాక్టర్ రాము అధ్యక్షతన రోగులకు రొట్టెలు, పండ్లు ను పంపిణి చేసారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ మిషన్ స్వచ్ఛంద సంస్థ మానవ హక్కుల కొరకై 2012 నుండి నిరంతరంగా పోరాడుతూ ఎన్నో సమస్యలు పరిష్కరించిందన్నారు. మానవ హక్కులకు భంగం కలిగిన వారు ఎవరైనా మా హ్యూమన్ రైట్స్ కమిషన్ సంప్రదించ వచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షులు ముత్యాలమ్మ, ఉత్తరాంధ్ర సంక్షేమ కార్యదర్శి, రమణమ్మ, హ్యూమన్ రైట్స్ మిషన్ మీడియా కార్యదర్శి పైడిరాజు, హెడ్ నర్స్ స్వర్ణలత, రాజేశ్వరి మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐ.సి.డి.ఎస్ బదిలీల్లో నిబంధనలకు పాతర..

### సి.డి.పి.ఓ, సూపర్ వైజర్లు రిలీవ్... కొత్తవారు ఏరీ -ఒక వైపు శిశుమరణాలు... క్షేత్ర స్థాయిలో చూసేవారు ఎవరో



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

మహిళా శిశు సంక్షేమశాఖలో బదిలీల్లో నిభందనలకు అధికారులు పాతర వేశారు. గిరిజన ప్రాంతంలో జి.ఓఎం.ఎస్ నెంబరు 57 జనరల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ ఏ 01.03.2014 సం. ప్రకారం బదిలీ అయిన ఉద్యోగి స్థానంలో కొత్తవారు వచ్చే వారికే బదిలీ అయినవారిని రిలీవ్ చేయకూడదు. కాని ఈ జి.ఓ పక్కకు పోయింది. రాజవొమ్మంగి ఐ.సి.డి.ఎస్ పరిధిలో 101 అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణకు ఒక గ్రేడ్ 1. సూపర్ వైజర్లు ఇద్దరు, ఇద్దరు గ్రేడ్ 2, (ఒకరు కాంట్రాక్ట్ సూపర్ వైజర్ పని చేస్తున్నారు) సి. డి.పి.ఓ, యు.డి.సి., ఎల్.డి.సి, బిపిఏ, డి.ఇ.ఓ కార్యాలయంలో విధులను నిర్వహిస్తున్నారు. సి.డి.పి.ఓ, గ్రేడ్. 1 సూపర్వైజర్లు ఇద్దరు, గ్రేడ్ 2 సూపర్ వైజరు ఒకరు, యు.డి.సికి బదిలీ ఆదేశాలు వచ్చాయి. ఒక గ్రేడ్ 2 సూపర్ వైజర్ కాంట్రాక్ట్ పద్దతి లో పని చేయడం వల్ల ఆమెకు బదిలీలు లేవు. అడ్డతీగల నుండి ఒక గ్రేడ్ 2 సూపర్ వైజర్ బదిలీపై వచ్చిన ఆమె విధుల్లోకి చేరారు. ఒక గ్రేడ్. 2 సూపర్ వైజర్ 5 సం.లు పూర్తి అయి కాకినాడ అర్బన్ కు బదిలీ అయినా ఆమె రిలీవ్ కాలేదు.12 తేదీన ఇద్దరు గ్రేడ్ 1 సూపర్ వైజర్లను రిలీవ్ చేసి సి.డి.పి.ఓ తాను కూడా రిలీవ్ అయ్యి కొయ్యూరు ప్రాజెక్టు సి.డి.పి.ఓగా ఇదే రోజున చేరినట్లు సి.డి. పి. ఓ దేవమణి ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. .ఇద్దరు గ్రేడ్ 1 సూపర్ వైజర్లు రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో ఒక్క గ్రేడ్ -1 సూపర్ వైజర్ కూడా రాలేదని, ప్రాజెక్టులో ఒక్కరైనా గ్రేడ్. 1 సూపర్ వైజర్ ఉండాలి. రాజవొమ్మంగి మండలంలో ఇటీవల రెండు శిశు మరణాలు జరిగాయి. ఇంకొన్ని శిశు మరణాలు వెలుగులోకి రాకుండా జాగ్రత్తలను తీసుకొన్నారు. రాజవొమ్మంగి సి.డి.పి.ఓ గా శంఖవరం సి.డి.పి.ఓని వేసినా ఆమె ఇక్కడ చేరకుండా వేరొక ప్రాంతానికి వెళ్లారని సమాచారం. అనకాపల్లి జిల్లా గొలుగొండ సి.డి.పి.ఓ శ్రీగౌరిని రాజవొమ్మంగి సి.డి.పి.ఓగా ఆదేశాలు వచ్చాయని సి.డి.పి.ఓ దేవమణి ఫోన్లో వివరణ ఇచ్చారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజా సేయస్సును దృష్టిలో పెట్టుకొని బదిలీలపై ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలి. ఆ దిశగా అధికారులు కార్యాచరణ చేయాలి. ఈ బదిలీలపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఇది ఇలా ఉండగా ఏప్రిల్ 25 తేదీన రంపచోడవరంలో జరిగిన అంగన్వాడి సహాయకుల ఇంటర్యూలు సంబంధించిన పత్రాలు రెండు నెలలు కావస్తున్నా జిల్లా పి. డి. కార్యాలయంకు చేరలేదు. రెవిన్యూ వారు కూడా ధ్రువపత్రాలు ఇచ్చారు. నలుగురు ధ్రువపత్రాలు రాలేదని అవి వచ్చిన తర్వాత పంపిస్తామన్నారు. ఏడు హెల్పర్ పోస్టులకు భర్తి జరిగే అవకాశం కనిపించడం. లేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా వస్తున్న సి.డి.పి.ఓ కాంట్రాక్ట్ పద్దతి కావడంతో జీతాలు, బిల్లులు చేసే డి.డి.ఓ హోదా ఉండదు. ఎవరికీ ఇష్టం వచ్చినట్లు బదిలీలు, రిలీవ్లు చేస్తూ బదిలీల నిభందనలకు ముసుగు వేశారు.

## ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులు కోసం కార్యక్రమం



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికొన్నత పాఠశాలలో విద్యార్థినులను చేర్చుకోవడానికి ప్రధానోపాధ్యాయురాలు వారాతి శైలజ ఆధ్వరంలో మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. శుక్రవారం వెలగలపాలెం, దోనెలపాలెం, చిన్నయ్యపాలెం, ఉప్పరివీది గ్రామాల్లో ఇంటింటా తిరిగి బడి బయట విద్యార్థినులు ఉండకూడదని, ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, క్రీడలు, ఆరోగ్యభద్రత, తల్లిదండ్రులకు మాత్రమే సెలవు రోజుల్లో ప్రవేశం వంటి అంశాలను హెచ్.ఎం. శైలజ అవగాహనను కల్పించారు. ఈకార్యక్రమంలో హెచ్.ఎం.శైలజ, మహిళా ఉపాధ్యాయులు హైమా, పద్మ, ఆశలు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలు



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

శుక్రవారం వాతంగి పంచాయితీ ఓకుర్తి, ఓగిపాలెం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలు జరిగాయి. ఎం.ఎల్ హెచ్. పి.భవాని 34 మందికి వైద్య పరీక్షలను చేసి మందులను ఇచ్చారు. వర్షాలు కురుస్తున్న రీత్యాకాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, దోమ తెరలు వాడాలని భవాని అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎం.ఎల్. హెచ్.పి. భవాని, ఏఎన్.ఎం.కుమారి, 104 డి.ఇ.ఓ శ్రీనివాస్, పైలట్ శివకనకరాజు, ఆశ వర్కర్లు మల్లేశ్వరి, లోవకుమారి, అంగన్వాడీ వర్కర్లు రాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## జడ్డంగిలో వికసించిన బ్రహ్మ కమలం



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

జడ్డంగి గ్రామానికి చెందిన తోట సూరిబాబు, విజయలక్ష్మి వారి ఇంటిలో బ్రహ్మ కమలం శుక్రవారం వికసించింది. బ్రహ్మ కమలం ఏడాదికి ఒక్కసారి మాత్రమే వికసిస్తుంది. విశిష్ట పురాణ చరిత్ర బ్రహ్మ కమలంకు ఉంది. హిమాలయాల్లో ఎక్కువగా పూసే బ్రహ్మ కమలంతో అక్కడ శివుడుని పూజిస్తారు. ఈ పువ్వు శ్రేయస్సు, శుభకరానికి ప్రతీక అని అంటారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

జడ్డంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ఇ.దైవ కృపావర ప్రసన్నకుమారి అధ్యక్షతన విద్యాకమిటీ చైర్మన్ అడపా మల్లే శ్వరరావు ఆధ్వరంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ జరిగింది. సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, కో అప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు, గ్రామపెద్దలు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రణాళికా బద్దంగా చదివి పాఠశాలకు మంచిపేరు తేవాలని వైస్సార్సీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు అన్నారు. పాఠశాలలో సమస్యలను తెలుసుకొన్నారు. ఈకార్యక్రమంలో హెచ్.ఎం. దైవ కృపా వర ప్రసన్నకుమారి, విద్యా కమిటీ చైర్మన్ అడపా మల్లే శ్వరరావు, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ, ఎంపిటిసి కానెం అచ్చియ్యమ్మ,, మండల కో అప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు, సింగిరెడ్డి రవి, వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు, కంటపురెడ్డి వీరబాబు, గణజాల కాసుబాబు, ఉపాధ్యాయులు గుమ్మడి నానాజీ, పి. దేవుడు, మిరియాల చిన్నబ్బాయి, పి. డి. చిన్నారావు, లింగెటి సింహాద్రి, సిబ్బంది వెంకట్రావు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ ఏ.పి.ఓ బదిలీ



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

రాజవొమ్మంగి మండల ఉపాధిహామీ ఏ.పి.ఓ రెడ్డిబాబు విలీన మండలమైన వి.ఆర్.పురం బదిలీ అయ్యారు. వి ఆర్.పురం నుండి ఏ.పి.ఓ శ్రీనివాసు రాజవొమ్మంగి ఏ.పి.ఓగా బదిలీపై రానున్నారు. రాజవొమ్మంగి ఏ.పి.ఓగా రెడ్డిబాబు ఐదు నెలలు మాత్రమే విధులను నిర్వహించారు. సోమవారం ఏ.పి.ఓ శ్రీనివాసు విధుల్లోకి చేరనున్నట్లు తెలిసింది.

## పిఎం జన్మన్ ఇళ్లను పరిశీలించిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు దేవదాసు



అరకులోయ, జూన్ 13, ప్రభాతవార్త

అరకులోయ మండలంలోని సీఎం జన్మన్ పథకం కింద నిర్మాణమవు తున్న ఇళ్లను శుక్రవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు పరిశీలించారు. దీనిలో భాగంగా మండలంలోని కొత్త భల్లుగుడ గ్రామంలో నిర్మాణమవుతున్న జన్ మన్ ఇల్లులను స్థానికుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల కోసం ఎంతో ప్రతిష్టత్మా కంగా ప్రధాన మంత్రి -జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం - జన్మన్) చేపట్టిందన్నారు. ఆదిమ గిరిజనుల సొంత ఇళ్ళు కట్టుకోవాల నే కలను సాకారం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కృతజ్ఞతలు కలిగి ఉండాలన్నారు. ఎటువంటి అలసత్వం లేకుండా గృహాలను త్వరితగిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అధికారుల వలన బిల్లు విషయంలో ఆలస్యం జరిగిన, అవినీతికి పాల్పడిన తనకు పిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అరకులోయ మండల మాజీ మండల అధ్యక్షులు స్వాభి రాంచందర్, కూటమి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పాడేరు జిల్లా ఆస్పత్రి పార్కింగ్ ప్రదేశంలో అనుమాన స్పదంగా మృతదేహం

### మృతదేహంపై గాయాలు -కేసు నమోదు -క్లూస్ టీమ్తో ఆధారాలు సేకరణ -పాడేరు పోలీస్ ఇన్ స్పెక్టర్ పి.దీనబంధు



పాడేరు,జూన్13, ప్రభాతవార్త

జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వాహనాల పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా గిరిజనుడు మృతదేహం పడి ఉంది. దీంతో పాడేరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన ప్రదేశానికి పాడేరు పోలీస్ ఇన్ స్పెక్టర్ దీనబంధు క్లూస్ టీమ్తో వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అలాగే సంఘటనా ప్రదేశాన్ని క్లూస్ టీమ్తో ఫోటోలు తీసి ఆధారాలు సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్స్పెక్టర్ దీనబందు స్థానిక విలేకరులకు అందించిన వివరాల ఈవిధంగా ఉన్నాయి. గురువారం రాత్రి నుండి జిల్లా ఆస్పత్రి ఎదుట వాహనాలు పార్కింగ్ ప్రదేశంలో మృతదేహం ఉందని మృతిని వద్ద ఉన్న ఆధార్ కార్డు ను పరిశీలించగా మృతుడు జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయితీ పెద్ద జాగీరు గ్రామానికి చెందిన మాసాడి నడుపయ్య(60) గా గుర్తించామన్నారు. మృతుడు తండ్రి చిన్నయ్య కాగా ఆధార్ కార్డు ప్రకారం అడ్రాస్ కనుగోవడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా ఉన్న నడుపయ్య మృతదేహాన్ని పరిశీలించగా ముఖంపై, శరీర ముందుభాగం,వెనుక భాగం, తల వెనుక భాగంలో గాయాలుతగిలి ఉన్నాయని సిఐ దీనబందు తెలిపారు.దీంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు మృతదేహాన్ని తరలించామని అనుమాన స్పద మృతిపై దర్యాప్తు చేస్తున్నామని సిఐ పేర్కొన్నారు. మృతుడు పాడేరు పట్టణం సుండ్రుపుట్టు గ్రామంలో నివాసం ఉంటున్నాడు.

## 15వ ఆర్థిక సంఘ బకాయి నిధులు గ్రామ పంచాయితీ వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలి

### సర్పంచులు పాడేరులో శాంతియుత నిరసన ర్యాలీ



పాడేరు,జూన్13, ప్రభాతవార్త

రాష్ట్రంలో గ్రామ పంచాయితీలకు రావలసిన 15వ ఆర్థిక సంఘ బకాయి నిధులు గ్రామపంచాయతీ ఖాతాల్లో వెంటనే జమ చేయాలని.. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయితీ సర్పంచులంతా ఆందోళనను ఉధృతం చేస్తామని అల్లూరు జిల్లా పాడేరు డివిజన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సీదరి రాంబాబు హెచ్చరించారు. శుక్రవారం పాడేరు డివిజన్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీ సర్పంచులు శాంతి యుత నిరసన ర్యాలీ పాడేరు డివిజన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సీదరీ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు అంబేద్కర్ జంక్షన్ నుంచి సర్పంచులంతా ఐటిడిఏ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అందుబాటులో లేని కారణంగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మలతకి సర్పంచుల సమస్యలతో కూడిన వినతిపత్రం ఫోరం అధ్యక్షులు రాంబాబు ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పాడేరు డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సీదరీ రాంబాబు మాట్లాడుతూ గత ఏప్రిల్ నెలలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 1121.50 కోట్ల రూపాయలు గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలనీ అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 2024- 2025, 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రావలసిన 15వ ఆర్థిక సంఘ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన మొదటి దశ నిధులు జమ కాని డివిజన్ పరిధిలో 12 గ్రామపంచాయతీలలో ఖాతాల్లో అవి వెంటనే జమ చేయాలన్నారు. ఏజెన్సీలో పేసా చట్టం, 1/ 70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. జీఓ ప్రత్యామ్నాయ చట్టం చేసి గిరిజనులకు నూరు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు గ్రామపంచాయతీ అభివృద్ధిలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలనీ అయన అన్నారు. గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 23వ తేదీన జరిగిన ఉపాధి నిధుల నుండీ తీర్మానం చేసిన పనులకు నిధులు మంజూరు చేసి చర్యలు తీసుకోవాలని పాడేరు డివిజన్ సర్పంచులు పోరం అధ్యక్షులు రాంబాబు డిమాండ్ చేశారు. సర్పంచులు శాంతి యుత నిరసన ర్యాలీలో సీదరి రాంబాబు, కుందరి రామకృష్ణ, కిల్లో మోస్య, పాంగి అప్పారావు, దురియా పుష్పలత, సమిడ వెంకట పూర్ణిమ, ముసలినాయుడు,పాడేరు మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు వనుగు బసవన్నదొర, రేగం రమేష్, పాంగి సునీత, సురభంగి రామకృష్ణ, గ్రామ సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వట్టిగడ్డలో గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీ ఏర్పాటు



రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త

తంటికొండ పంచాయితీ గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీ ఏర్పాటు సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి అధ్యక్షతన ఏర్పడింది. వట్టిగడ్డ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్గా సర్పంచ్ సుబ్బలక్ష్మి, సెక్రటరీగా కోనా అమ్మిరాజు, మరో 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు. గ్రామాల్లో పోషకాహారలోపం, త్రాగునీరు, ఆరోగ్య భద్రతా సమస్యలపై కమిటీ పని చేస్తుందని సర్పంచ్ సుబ్బలక్ష్మి అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ అగూరి సుబ్బలక్ష్మి, సి.హెచ్.ఓ లక్ష్మణ్, ఏ.ఎన్ ఎం.పి.కమల, బాలురెడ్డి, దేవకీరాణి, సన్యాసమ్మ, ఆశలు కె.అమ్మిరాజు, కుమారి, కె.చెల్లయ్యమ్మ, అంగన్ వాడీ వర్కర్స్ పల్లాల రాణి, మేరీరత్నం, మిర్తివాడ లక్ష్మి, బి. సరస్వతి, రాజకుమారి, సచివాలయ ఉద్యోగులు, బాలింతలు, గర్భవతులు, సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 13 మంది ఎంపిక

### యోగ నోడల్ అధికారి లోకేశ్వర రావు



పాడేరు,జూన్13, ప్రభాతవార్త

అల్లూరి జిల్లా నుండి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 13 మంది ఎంపికయ్యారని జిల్లా యోగ నోడల్ అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎంవి ఎస్ లోకేస్వర రావు తెలిపారు. శుక్రవారం స్థానిక తలారిసింగి బాలుర ఆశ్రమ పాటశాల ఇన్డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్ రావు తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి యోగా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని మండల స్థాయి పోటీలకు పంపించడం జరిగిందని, అందులో గెలుపొందిన వారిని మూడు ఐటిడిఎల ఫరిధిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని, జిల్లా స్థాయికి ఎంపిక అయిన వారికి తలారిసింగి ఆశ్రమ పాటశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు వివిధ విభాగాలలో 13 అంశాలను నిర్వహించడం జరిగిందని, 13 అంశాలలో 13 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఎన్ టి ఆర్ జిల్లా ఇందిరా గాంధి స్టేడియంలో జరుగుతాయన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం..



ఎలమంచిలి, జూన్ 13, ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా డొక్కా సీతమ్మ భోజన పథకం శుక్రవారం నుండి సన్న బియ్యంతో భోజనం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందుతుందని అన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా

సీతమ్మధార బ్రాంచ్, డి.నెం.50-53, 11/8, రవి ప్లాజా, నార్త్ ఎక్స్టెన్షన్, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0891-2552472, 2726035, ఇ మెయిల్: savsee@bankofbaroda.com, www.bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(APPENDIX IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము బ్యాంక్ ఆఫ్ బరోడా, సీతమ్మధార బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: 1. శ్రీ ప్రగాడ నాగేశ్వరరావు, తండ్రి : కొండయ్య, 2. ప్రగాడ కొండలరావు, తండ్రి : కొండయ్య, 3. ప్రగాడ గంగరాజు, తండ్రి : మూలి నాయుడు వారు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.40,26,173.51/- (అక్షరాల నలభై లక్షల ఇరవై ఆరు వేల నూట డెబ్బై మూడు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే) నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.09-01-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్సు 2002 నందలి రూలు 8 ప్రకారము తేది.09-06-2025న దిగువ పేర్కొన్న ఆస్తి స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం తేది.08.01.2025 నాటికి రూ.40,26,173.51/- (అక్షరాల నలభై లక్షల ఇరవై ఆరు వేల నూట డెబ్బై మూడు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే) + తేది.08-01-2025 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొ॥నవి, బ్యాంక్ ఆఫ్ బరోడా వారి యొక్క ఛార్జీకి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

విశాఖపట్నం జిల్లా, అచ్యుతాపురం పంచాయితీ, దుప్పిటూరు గ్రామం, సర్వే నెం.497లోని 411.40 చ॥గ॥లు లేదా 343.982 చ॥మీ॥ లలో డోర్ నెం.487-1/3తోగల స్థలం (అందు గల నివాస భవనం) శ్రీ ప్రగాడ నాగేశ్వర రావు, తండ్రి: కొండయ్య గారికి చెందినది. ఆస్తినకు హద్దులు: ఉత్తరం: చోడిపల్లి వెంకట సుజాత మరియు ఇతరులకు చెందిన భూమి, దక్షిణం: బొట్ట సోములు గారు అమ్మిన భూమి, తూర్పు: బండి బాట, పడమర: బైలపూడి శ్రీరామదాసు గారు అమ్మిన భూమి.

తేది: 09-06-2025
ప్రదేశం: సీతమ్మధార

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా


## ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

### ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** బార్ల దరఖాస్తుదారుల సమక్షంలో ప్రశాంతంగా డ్రా ప్రక్రియ ముగిసిందని, ఈ కార్యక్రమానికి సహకరించిన దరఖాస్తుదారులకు, ఎక్సైజ్ అధికారులందరికీ ధన్యవాదాలు, డ్రాలో గెలుపొందిన లబ్ధిదారులకు కమిషనర్ హరికిరణ్ అభినందనలు తెలిపారు. శనివారం గోల్కొండ నార్సింగ్ ప్రాంతంలో ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో జిహెచ్ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు వచినట్లు చెప్పారు.దరఖాస్తుదారుల సమక్షంలో కమిషనర్ డ్రా తీశారు.డ్రా బాక్స్‌లోని కమిషనర్ కాయిన్స్ తీసి ఇవ్వగా జాయింట్ కమిషనర్ కే ఏ బి శాస్త్రి నెంబర్ దరఖాస్తుదారుల సమక్షంలో వెల్లడించారు.డ్రాలో బార్ షాప్ గెలుపొందిన లబ్ధిదారులు లబ్ధిదారులు అలాట్ మెంట్ లెటర్‌ని తీసుకొని వెళ్లాలన్నారు.90 రోజుల్లోగా బార్ల ప్రక్రియను పూర్తి చేసుకుని నడిపించుకోవాల్సిందిగా కోరారు.హైదరాబాద్ రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్లు పి. దశరథ్, కే ఏ బి శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ అనిల్ కుమార్ ఒడ్డిలతోపాటు హైదరాబాద్ రంగారెడ్డిలోని అన్ని డివిజన్‌లలో అధికారులకు పేరుపేరునా కమిషనర్ అభినందనలు తెలిపారు.బాక్సులోకాయిన్స్ తీసిన జీవన్‌కిరణ్‌ను కమిషనర్ అభినందించారు. జిహెచ్ఎంసితోపాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్ జాల్‌పల్లి ప్రాంతాల్లో డ్రా ప్రశాంతంగా ముగిసిందని కమిషనర్ వెల్లడించారు.అంతకు ముందు అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళర్పించారు.

## పిసిసి చీఫ్ మహేష్‌తో గనుల శాఖ మంత్రి వివేక్ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ మైనింగ్,లేబర్ మంత్రి గడ్డం వివేక్ శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను



మర్యాదపూర్వకంగా కలిశారు. గడ్డం వివేక్ మంత్రిగా తొలిసారి గాంధీభవన్‌కు రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, ఆయన ఇతర అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ఆయనకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నరగంటలకు ఆయన రాగా అభిమానులు ఆయనకు అభివాదం చేశారు. టిపిసిసిచీఫ్ మహేష్‌కుమార్ వద్దకు వెళ్ళి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుమారు అర్ధగంటపాటు వారు ఏకాంతంగా చర్చలు జరిపారు.

## సిపిఐ నారాయణతో మందకృష్ణ మాదిగ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శుక్రవారం ఉదయం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణ .. పద్మశ్రీ అవార్డ్‌ను వరించినందుకు మంద కృష్ణ మాదిగను ప్రత్యేకంగా అభినందించారు. పద్మశ్రీ అవార్డు పట్ల గతంలో భిన్నమైన అభిప్రాయం ఉండేదని.. కానీ పద్మశ్రీ అవార్డును మందకృష్ణకు ఇవ్వడం వల్ల ఆ అవార్డుకే గౌరవం వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని గతంలో మీడియా ముందు కూడా మాట్లాడినట్లు గుర్తు చేశారు. నమ్మిన ఆశయం కోసం, ఎత్తుకున్న ఎజెండా కోసం మూడు దశాబ్దాలపాటు అలుపెరగని పోరాట ఫలితమే ఈ పద్మశ్రీ అవార్డ్ అని నారాయణ కొనియాడారు. సుమారు గంటసేపు ఎస్సీ వర్గీకరణ, చట్టసభల్లో బిసిల రిజర్వేషన్లు, కులగణన మొదలైన అంశాల గురించి ఇరువురు చర్చించారు. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక వాదులపై ఉన్నదని గుర్తు చేసుకున్నారు. చిన్నచిన్న అంశాలను పక్కన పెట్టి, భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూనే విశాల ప్రజా ఆకాంక్షల మేరకు కలిసి పనిచేయాల్సిన అవసరముందని నారాయణ మందకృష్ణ మాదిగతో అన్నారు.




సౌదీ నుంచి తన భర్తను రప్పించాలంటూ సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తున్న అలేఖ్య.

## సౌదీ నుంచి నా భర్తను ఇండియాకు రప్పించండి

### బాధితుడి భార్య సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** ఉపాధికోసం సౌదీ అరేబియాకు వెళ్లిన తన భర్త తో డ్రైవర్ ఉద్యోగానికి బదులు వ్యవసాయ పనులు చేయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని,వెంటనే తన భర్తను ఇండియాకు రప్పించాలంటూ అతని భార్య గుడిసె అలేఖ్య శుక్రవారం సీఎం ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణీలో సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో ఒక వినతి పత్రం అందజేసారు.భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు కు చెందిన గుడిసె యాకూబ్‌ను ఏజెంటు డ్రైవర్ పని ఇప్పిస్తానంటూ నమ్మించి సౌదీలోని దమ్మాంకు పంపించాడని, అయితే అక్కడ తన భర్తతో వ్యవసాయ పనులు చేయిస్తున్నాడని, వెంటనే తన భర్తను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలంటూ ఆమె ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది.తెలంగాణా ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ డా.బిఎం వినోద్‌కుమార్,వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డిలకు ఆమె తన గోడు వెళ్లబోసుకుంది.యాకూబ్‌ను ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని,సరైన తిండి పెట్టడంలేదని ఆమె వివరించారు.వారు ముందుగా చెప్పిన ప్రకారం డ్రైవర్ పని ఇప్పించాలని,లేకుంటే ఇండియాకు తిరిగి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరింది.

# సిజిఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి

### టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి : మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎండోమెంటు డిపార్టుమెంటు అధికారులు ప్రధానంగా ఈ అంశంపైనే దృష్టి పెట్టాల్సిన అనివార్యత ఉందని మంత్రి ఉద్ఘాటించారు. ఈ విషయంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇక ఆషాఢ బోనాలు ఈ దఫా వరంగల్ భద్రాకాళి టెంపుల్‌లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పండగను,సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మన రాష్ట్ర ప్రజలను ధార్మిక చింతన వైపు తీసుకెళ్లడంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీజీఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎండోమెంటు డిపార్టుమెంటు సిజిఎఫ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఈఓలు, ఆ శాఖ ఉన్నతాధికారుల కృషి అనివార్యమన్నారు. సిజిఎఫ్‌లో భాగంగా,చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సురేఖకు అధికారులు వివరించారు. బడ్జెట్ అనుమతులు, సిజిఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. శుక్రవారం జరిగిన సిజిఎఫ్ సమావేశంలోరూ. 72.47 కోట్ల విలువైన, మొత్తం 297 పనులకు ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఈఓ పాటించాలన్నారు.సిజిఎఫ్ పనులపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం సరికాదన్నారు.సిజిఎఫ్ పనుల మీద రెండు రెండుసార్లు పనుల ప్రతిపాదనలు పంపవద్దన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎస్టిమేషన్స్ ఎంత వేస్తే అంత తమకు పంపకూడదని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సరైన విధంగా అంచనాలు వేయాలన్నారు. జిల్లాలోని 3ప్రధాన ఆలయాలను కలిపి ఒక సర్క్యూట్‌గాప్రణాళికలను రూపొంది వెళ్తున్నామన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర ఉన్నతాధికారులు, ఇఒలు, సిజిఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని సర్వనాశనం చేసిన బిఆర్ఎస్

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆ పార్టీ అవసరం లేదని తేల్చడంతోపాటు తిరస్కరించారని, ప్రజలు తిరస్కరించిన పార్టీపైన వేధింపులకు దిగాల్సిన అవసరం తమకు లేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్‌పి మీడియా హాల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగం సర్వనాశనం అయిందని ఆవేదన చెందారు. బిఆర్ ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కొత్తగా విద్యా రంగం రుజాగ్రస్తం అయినట్లు కాకమ్మ కబుర్లు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరు అవుతారన్నట్లుగా, కెటిఆర్ వెంట తిరిగి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆబద్దాలు నేర్చుకున్నాడని దుయ్యబట్టారు. గురుకులాల కార్యదర్శిగా 8 యేళ్ల పాటు పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యారంగాన్ని ఏం ఉద్ధరించాడని సత్యం ప్రశ్నించారు. మా ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకోకుండానే విద్యారంగాన్ని ప్రక్షాళనకు ప్రయత్నం చేస్తున్నదని, నాణ్యమైన విద్య అందించే విషయంలో రేవంత్ సర్కార్ చేస్తున్న కృషిని చూసి ఆర్ఎస్ ప్రవీణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్తంగా గురుకులాలను ఏర్పాటు చేశారని గురుకులాలకు అద్దె కూడా చెల్లించనప్పుడు కేసీఆర్‌ను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు నిలదీయలేదని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోయినా ఆర్ఎస్ మాట్లాడలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖ ను పర్యవేక్షిస్తున్నారు,

కొత్తగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం, బదలీలు, ప్రమోషన్లు ఇచ్చాం ఒక్క యేడాదిలో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది మా ప్రభుత్వం మాత్రమే అని ఆయన అన్నారు. బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచింది మా ప్రభుత్వమే అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ హయాంలో విద్యా రంగం సర్వనాశనం అయిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గానికి ఒక స్కూల్‌లో పథకం ప్రారంభించి చివరకు ఆ నిధులను కూడా పెండింగ్ లో పెట్టి పోయాడని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ను ప్రయోగాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించిందని, రూ.200తో ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ ను దేశంలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి మా ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నాడని వివరించారు. విద్యారంగంపై గోబెల్స్ ప్రచారం చేయడం కోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను కేసీఆర్, కేటీఆర్ ముందు పెడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సిందే అని అన్నారు,. అమెరికా పర్యటన ను సాకుగా చూపించి గతంలో విచారణకు హాజరు కాలేదని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా దొరికిపోయాడని ప్రకటించారు.

# రేవంత్‌రెడ్డి కక్ష సాధించాలనుకుంటే జైలుకెళ్లేవారు

### బిఆర్ఎస్ నేతలపై పిసిసి ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు చేస్తే ఇప్పటికే కెటిఆర్, కెసిఆర్, హరీశ్‌రావు, కవితలు చర్లపల్లి జైల్లో ఊచలు లెక్కించేవారని, మీ అవినీతిపైపూర్తి విచారణ చేసి మిమ్ముల్ని తీహార్ జైలుకు పంపుతారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఇంకోసారి సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మీ ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్‌పై నోరు పారేసుకొంటే ప్రజలు కెసిఆర్ కుటుంబాన్ని తెలంగాణ నుండి తరిమికొడతారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే కెసిఆర్‌ను విచారణ కు పిలిచారు. అవినీతి జరిగితే ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా విచారిస్తారు. ప్రాజెక్టుల పేరు మీద మీరు అవినీతి చేసింది నిజం కాదా? ఇప్పుడు మీ ఆస్తులు మూడు లక్షల కోట్లు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో అవినీతి జరిగిందనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారు. ప్రాజెక్టులో చీఫ్ ఇంజనీర్లు, అధికారులను కూడా విచారణ చేశారని గుర్తుచేశారు. తర్వాత ఈటెల రాజేందర్, హరీష్ రావు,కెసిఆర్ ను విచారిస్తే కెటిఆర్ కు ఎందుకు అంత ఇబ్బంది అని ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ తప్పించుకోవాలని చూడొద్దు,తప్పు చేస్తే జైలుకు పోవడం ఖాయం అని ఆయన అన్నారు. అవినీతి చేసి రాష్ట్రం ఆగం అయినా విచారణ చేయొద్దా?ప్రాజెక్టు ఏమైనా మీ అబ్బ సొత్తా కేటిఆర్ అనిఆయన నిలదీశారు. హైదరాబాద్ చుట్టూ 30 వేల ఎకరాలు మీకు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన ప్రశ్నించారు. కేటిఆర్ తాగుబోతోడు, తెలంగాణ ను దోచుకున్నోడు కేసీఆర్ జాతిపిత ఎట్లా అయితడు జాతిపిత కేవలం మహాత్మాగాంధీ మాత్రమే అని ఆయన అన్నారు. టిపిసిసి జనరల్ సెక్రటరీ అవకాశం కల్పించిన మల్లి ఖార్జున ఖర్గే,రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి లకు నాయకులందరికి అధిష్టానానికి రుణపడి ఉంటా అని గజ్జెల కాంతం అన్నారు.

# 18 నుంచి సిపిజెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

### జూలై 17 తుది గడువు.. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 దరఖాస్తులను ఈ నెల 18 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి(విసి) ప్రొఫెసర్ ఎం కుమార్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు శాతవాహన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, సిపిజిఈటి-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతోపాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజెట్ పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వ విద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యా లయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించ నున్నారు. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. జులై 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో జులై 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మొత్తం 51 సబ్జెక్టులలో 108 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష ఫీజు జనరల్ వారికి రూ. 800 కాగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ. 600గా నిర్ణయించారు. అదనపు సబ్జెక్టుకి రూ. 450 చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది 46,742 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 21,560 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 4వేల సీట్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సుమారు 50వేల సీట్లలో ప్రవేశాలను చేపట్టనున్నారు. త్వరలోనే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి అనుమతి వస్తే అందులో కూడా అడ్మిషన్లను చేపట్టనున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

# బిసి అభ్యర్థులకు సివిల్ సర్వీస్ లాంగ్‌టర్మ్ తరగతులు

### జూలై 25 నుంచి ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సివిల్స్-2026కి ప్రిపేర్ అవుతున్న బిసి అభ్యర్థులకు తెలంగాణ బిసి స్టడి సర్కిల్ అధ్వర్యంలో ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన తరగతులను జులై 25 నుంచి ప్రారంభించనున్నట్టు బిసి స్టడి సర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యం సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ తరగతులను ఇవ్వనున్నట్టు డైరక్టర్ తెలిపారు. సివిల్స్-2026 కోసం కోచింగ్ తరగతులు జులై 25 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు టిజి బిసిఐఎస్‌డిటిసి (టిజి బిసి స్టడీ సర్కిల్), లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్‌లో నిర్వహించబడుతుందని సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 150 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని.. వారిలో 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను జులై 12న నిర్వహించే ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరో 50 మంది అభ్యర్థులను, గతంలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వారు సంబందిత పత్రాలతో నేరుగా సైదాబాద్‌లో ఉన్న బిసి స్టడీ సర్కిల్ ఆఫీసులో ఈ నెల 16 నుంచి జులై 8 లోపల దరఖాస్తు చేయాల్సి ఉంటుందని సూచించారు. దరఖాస్తు చేసిన వారిని మాత్రమే ఎంపిక చేయబడుతుందని డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5000/ స్టయిఫండ్, రూ.5000/ బుక్ ఫండ్‌ను ఒక్కసారి అందించబడుతుందని.. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## గంధపు చెక్కను తరలిస్తున్న నలుగురు నిందితులు అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా గంధపుచెక్కల అక్రమ రవాణా చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన నల్గురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో పందొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిందని, త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలాన్‌బై పర్ది (26), షానాజ్ (35), ఇద్దరు మహిళలు నిమత్ (43), మాధురి ఆదివాసి (25)లతో పాటు పరారీలో ఉన్న పలువురు నిందితులు నగరానికి వచ్చి ఇరవై రోజుల క్రితం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ పరిధిలోని గంధపుచెక్కలను అక్రమంగా నరికేసిట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సీసీకెమెరాల ఆధారంగా ఇరవైమూడు మందిని గుర్తించారు. అయితే వీరంతా ఇరవైకుటుంబాలకు చెందిన స్మగ్లర్లు అని, ప్రజలను ఎలాంటి అనుమానాలు రాకుండా కుటుంబంగా ఉంటూ గంధపు చెక్కలను పోలీసుల కంటపడకుండా రాష్ట్రాన్ని దాటి వేయించారని పేర్కొన్నారు.





కమిటీ నియామకాలను రిలీజ్ చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, గాలి వినోద్‌కుమార్, రాజేశ్‌కుమార్ తదితరులు

## నియోజకవర్గాల పునర్విభనను రద్దు చేయాలి

### దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్‌ను చేయాలి

### ఎపిని విభజించిన పార్టీలు యుపిని ఎందుకు విభజించలేవు? గాలి వినోద్‌కుమార్

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజనను రద్దు చేయాలని సౌత్ ఇండియా పొలిటికల్ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక అని కేంద్రం అంటున్నదని, కాని కేంద్రం 5 కోట్లు జనాభా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పార్టీ, బిజెపి విభజించాయని, 25 కోట్ల జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌ను ఎందుకు విభజించలేదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నార్త్ ప్రాంతాలు సౌత్ ప్రాంతాలపై వివక్ష చూపిస్తున్నాయని, శాసిస్తున్నాయని, నార్త్‌లో తెల్లవారు, సౌత్‌లో నల్లవారు అన్న వివక్ష కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. 2028లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సౌత్ ఇండియానే నంబర్-1గా ఉండాలని, నార్త్ ఇండియాను ఓడించి సౌత్ ఇండియాకు చెందిన దళితుడుగాని, బిసిగాని ప్రధానమంత్రి కావాలని ఆయన చెప్పారు. జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా ఆధర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపెద్ద పార్టీలు చిన్నిచిన్న రాజకీయ పార్టీలను దోపిడీ చేస్తున్నాయని, భారతదేశం ఒక్క నార్త్ ఇండియన్స్‌దే కాదని, దేశంలోని 146 కోట్లమంది భారతీయులదని ఆయన స్పష్టం చేశారు. దేశానికి రెండోవ రాజధానిగా హైదరాబాద్‌ను, సుప్రీంకోర్టు బెంచ్ హైదరాబాద్‌లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ దేశం ఐక్యంగా ఉండాలని, రాజ్యాంగం ప్రకారం సౌత్ ఇండియన్ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా కన్వీనర్ కరణం రాజేశ్‌కుమార్, ఆమ్‌ఆద్మీపార్టీ డాక్టర్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ లక్ష్మానాయుడు తదితరులు ప్రసంగించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 185

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 185 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 24 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సంస్థాగత నిర్మాణంలోనూ సామాజిక సమతుల్యత

### జూమ్ మీటింగ్‌లో ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్

### గ్రామస్థాయి నుంచి పటిష్టంగా సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో సామాజిక సమతుల్యత పాటిస్తూ పార్టీ కోసం పాటుపడే కార్యకర్తలను గుర్తించి పదవులు ఇస్తామని ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. శుక్రవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన డిసిసి అధ్యక్షులతో,రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని హామి ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని కాపాడుతూ పార్టీ లో ప్రభుత్వంలో పదవుల పంపిణీ చేస్తుందని ఆమె వివరించారు.రాహుల్ గాంధీ గారు సమాజంలో ఎవరి వాటా వారికి ఇవ్వాలన్న సిద్ధాంతంతో పని చేస్తున్నారని ఈ విషయం ప్రజాక్షేత్రంలో బహుళ ప్రచారం చేసి ప్రజాభిప్రాయం ఆయన సిద్ధాంతకు అనుగుణంగా కూడగట్టాలని ఇదే అణగారిన వర్గాలకు వనరులపై ఆదిపత్యం పొందేందుకు దోహదం చేస్తుందని అప్పుడే దేశంలో పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని ఆమె అన్నారు.

సమాజంలోని అన్ని వర్గాలు, దేశంలోని వివిధ ప్రాంతాలు సంతులిత అభివృద్ధి చేయాలంటే సామాజిక న్యాయం, దేశంలోని ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, శాస్త్రీయచింతన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమసమాజరీతి ప్రజాస్వామికన దేశాన్ని నిర్మించాలనే సిద్ధాంతం ప్రాతిపదికనే పనిచేస్తుందని అందరి కోసం ఒక్కరం ఒక్కరి కోసం అందరం అనే సహకారస్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించేదిశగా పార్టీ సిద్దాంతాలు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల మధ్య విభజన,విద్వేషాలు లేని అఖండ భారత దేశ నిర్మాణంకోసం గ్రామీణ ప్రాంతం నుంచి కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆవిధంగానే నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని పదవులలో సామాజిక న్యాయాన్ని పాటించాము.పార్టీ కోసం పని చేసిన అందరికి పదవులు వస్తాయని మీనాక్షి హామి ఇచ్చారు.

టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణ లో పెద్దఎత్తున నిర్వహించామని వివరించారు. మనమే అన్ని రాష్ట్రాల కంటే బాగా చేసామని కితాబు ఇచ్చుకున్నారు.

ఎఐసిసి అగ్రనేతలు కూడా తెలంగాణ ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పడం మనకు గర్వకారణం అని చెప్పారు.సంస్థాగత నిర్మాణం కూడా మన రాష్ట్రంలోనే బాగా జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర పరిశీలకులు, కోఆర్డినేటర్లు బాగా పని చేస్తున్నారు. మండల జిల్లా స్థాయి కమిటీల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వస్తున్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పకడ్బందీగా చేయాలని ఆయన సూచించారు. పార్టీ లో చిత్తశుద్ధితో పని చేసిన వారికి అందరిని పార్టీ వారి వారి స్థాయిలలో తప్పకుండా గుర్తిస్తుందని ఆయన తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథం కూడా పాల్గొని సంస్థాగత నిర్మాణంకు సూచనలు అందించారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త



## నూతన మున్సిపల్ కమీషనర్‌కు సిబ్బంది అభినందన

సాలూరు, జూన్ 13 ప్రభాతవార్త: సాలూరు పట్టణ పురపాలక సంఘం నూతన కమీషనర్‌గా సీపాన జయరాం శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ కమీషనర్‌గా విధులు నిర్వహించిన డీవీటి కృష్ణారావుకు జగ్గయ్యపేటకు బదిలీ అవడంతో కొత్త కమీషనర్‌గా జయరాం ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు విశాఖపట్నం జీవీఎంసీలో వెటర్నటీ డాక్టర్‌గా ఉన్న జయరాం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిషనర్‌గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది నూతన కమీషనర్‌కు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ సమస్యలపై దృష్టి పెట్టి తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని కమీషనర్ స్థానిక విలేకరులకు తెలిపారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



రామభద్రపురం, జూన్ 13 ప్రభాతవార్త: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అజారఫీజాన్ తెలిపారు. మండల తహసీల్దార్‌గా అజారఫీజాన్ గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తన వద్దకు వచ్చి కలవవచ్చునని సూచించారు. అలాగే మ్యూటేషన్, పోతీ కేసులు పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఆకుల సులోచనారాణి మెరకడిముడిదాంకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో మెరకముడిదాం నుంచి రామభద్రపురం వచ్చారు

## సామూహిక అక్షరాభ్యాసం



రామభద్రపురం, జూన్ 13, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని అంగన్వాడీ2,3 కేంద్రాల్లో మరియు ఆరికాతోట, బూసేయవలస సెంటర్‌లో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలను చేసినట్టు అంగన్వాడీ సూపర్వైజర్ బి.సూర్యకుమారి, రత్నకుమారి తెలిపారు. అలాగే 5 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికేట్లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పాలు, గుడ్లు, అన్నం అందిస్తున్నామని తెలిపారు. పిల్లల్లో శారీరక, మానసిక మేధాభివృద్ధి చెందడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదంచేస్తాయన్నారు. ఈ కేంద్రాల్లో ఆటలు, పాటలు నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాధమ్మ, రమణమ్మలు సత్యవతి శాంతికుమారి మంగమ్మ రాజేశ్వరి హెల్పర్ రామాలక్ష్మి పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారిగా కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకారం



గజపతినగరం, జూన్ 13 ప్రభాతవార్త : గజపతినగరం మండల వ్యవసాయాధికారిగా పి.కిరణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కిరణ్ కుమార్ బదిలీపై జామి మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సి.హెచ్. ధనలక్ష్మి జిల్లా వ్యవసాయ అధికారి(జెడి) కార్యాలయంకి బదిలీపై వెళ్లారు. ఇక్కడ సుదీర్ఘకాలం పని చేసిన ధనలక్ష్మికి కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు.

## నేటి నుంచి మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ



వేపాడ, జూన్13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వేపాడలో నేడు (శనివారం) ఉదయం 10 గంటలకు మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు వేపాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరవుతున్నందున తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీఓ ఉమామహేశ్వరి




కురుపాం, జూన్ 13 ప్రభాతవార్త: యోగ చేయటంతో ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ఎంపీడీఓ ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం నుండి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం వరకు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఏ ఓ నాని, సీనియర్ అసిస్టెంట్ నవీన్, విద్యార్థులు ఉపాధ్యాలు పాల్గొన్నారు.

## పగలే వీధి దీపాల వెలుగులు!



వేపాడ, జూన్ 13, ప్రభాతవార్త: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో పట్ట పగలే విద్యుత్ కాంతులు విరజిల్లుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. సోంపురం, అనందపురం ఆర్‌అండ్‌బి రహదారిని ఆనుకొని ఉన్న నచ్చిరెడ్డి వారి కల్లాల్లో 40 రోజులకు పైగా పగలు రాత్రి అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ రహదారి మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూడా పట్టించుకోకపోవడంతో విద్యుత్ దుర్వినియోగం అవుతోందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. విద్యుత్తు పొదుపు చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే ప్రకటనలు ఇస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం విచారకరమంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లను తక్షణమే నిలుపు చేయాలని ఈ ప్రాంతీయులంతా కోరుతున్నారు.

## షైనింగ్ అవార్డు... గ్రహీతకు అభినందన



బొబ్బిలి, జూన్ 13 ప్రభాతవార్త: అభ్యుదయ స్కూల్ విద్యార్థి 10 వ తరగతి ఫలితాలులో 596 మార్కులు సాధించి హోమ్ మినిస్టర్ అనిత మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ అవార్డు అందుకోవడం పట్ల కరస్పాండెంట్ కూర్మి నాయుడు ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద అభినందించారు.

# తీరు మారకుంటే చర్యలు..

బొబ్బిలి, జూన్ 13 ప్రభాతవార్త: బొబ్బిలి నియోజకవర్గ శాసన సభ్యులు ఆర్.వి.యస్.కే.కే. రంగారావు (బేబి నాయన) ఆదేశముల ప్రకారం శుక్రవారం అన్ని సచివాలయాల వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యు ఇన్‌స్పెక్టర్, రెవెన్యు ఆఫీసర్, రెవెన్యు విభాగం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాంబార్కి శరత్ బాబు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు మరియు ఖాళీ స్థలముల యొక్క డిమాండ్, కలెక్షన్‌ల వివరాలను అడిగి తెలుసుకున్న చైర్‌పర్సన్. రెవెన్యు విభాగపు పనితీరుపై ప్రజల నుండి వస్తున్నా ఫిర్యాదుల దృష్ట్యా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం సచివాలయాల వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యు ఇనస్పెక్టర్, రెవెన్యు ఆఫీసర్ వారు ప్రతిరోజూ ఉదయం 8.00 గంటలకు కార్యాలయమునకు మరియు సచివాలయాలకు వారి వారి విధులకు ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. అసలు డబుల్ అసెస్మెంట్లు ఎందుకు వచ్చాయో గల కారణాలను తెలియజేస్తూ వాటికి గల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రక్క ప్రక్క ఇళ్ళ మధ్య ఉన్న టాక్స్ వ్యత్యాసాలను ఎందుకు వచ్చాయి? వాటిని గుర్తించి సదరు వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరమునకు ఇంకనూ వసూలు చేయవలసిన అన్ కలక్టబుల్ డిమాండు వసూళ్ళపై దృష్టి సారించి ఖచ్చితంగా శతశాతం వసూలు చేయాలని ఆదేశించారు. అడ్మిన్ సెక్రటరీలు మధ్యాహ్న సమయంలో సచివాలయాలకు తాళములు వేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని ఈ పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యాలయ పనివేళలలో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో సచివాలయంలో ఉండవలసినదిగా ఆదేశించారు. జనవరి 2025 నుండి ఇప్పటివరకు ఎవరెవరి లాగిన్లలో ఎన్ని ఫైళ్లు వచ్చినది? అందులో ఎన్ని నిర్ణీత సమయంలో క్లియర్ చేసారో? నిర్ణీత సమయం దాటి ఎన్ని ఫైల్స్ చేశారో? పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అండర్ అసెస్మెంట్ లను గుర్తించి వాటికి కేపిటల్ వాల్యూ సిస్టం ప్రకారం పన్నులు మార్పుదల చేయాల్సిందిగా ఆదేశించారు. ఇప్పటి వరకు ట్యాక్స్ లేకుండా ఉన్న అన్ అసెస్మెంట్ లను గుర్తించి వెంటనే పన్నులు విధించి పురపాలక సంఘ ఆర్థిక పురతోగతికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను అన్నింటినీ ఒక నెల రోజులలోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలను ఆఫీసు మరియు సచివాలయాల చుట్టూ త్రిప్పించుకుంటున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని రెవెన్యు విభాగంలో వస్తున్న ప్రతీ ఫైల్ సిటిజన్ చార్టర్ కాలపరిమితికి లోబడి వెనువెంటనే క్లియర్ చేయాల్సిందేనని అట్లు కానియెడల ఎవరి లాగిన్‌లలో అయితే ఫైల్ ఎక్కువ కాలం ఉన్నదో గుర్తించి అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని తీవ్రంగా హెచ్చరించారు. పట్టణ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయి? వాటిని ఎవరికీ లీజుకు ఇచ్చారు? వాటిని ఎవరు మెయింటెయిన్ చేస్తున్నారో పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇకనుండి బొబ్బిలి పట్టణ ప్రజలకు రెవెన్యు విభాగమునకు సంబంధించిన సేవలపై ఎటువంటి అలసత్వం వహించిన ఉపేక్షించేది లేదని ఆదేశించారు. ఇకనుండి బొబ్బిలి పట్టణ ప్రజలకు పారదర్శకమైన మరియు అవినీతిరహిత సేవలు అందించాలని తెలియజేశారు. అన్ని సచివాలయాల వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యు ఆఫీసర్, రెవెన్యు విభాగం సిబ్బంది మరియు మున్సిపల్ కమీషనర్ ఎల్.రామలక్ష్మి పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బంది పనితీరుపై అధికారుల సమీక్ష

## ఆటో బోల్తా: మహిళకు గాయాలు



చీపురుపల్లి, జూన్ 13 ప్రభాతవార్త: చీపురుపల్లి పట్టణ పరిధిలోని శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడి ఎస్.సావిత్రి అనే మహిళ తీవ్రంగా గాయాలపాలైంది. పోలీసుల సమాచారం మేరకు విజయనగరంనకు చెందిన సావిత్రి చీపురుపల్లిలోని తన బంధువుల పరామర్శ కొరకు వచ్చారు. అనంతరం ఆటోలో చీపురుపల్లి నుండి రాజాం వెళ్తూ చీపురుపల్లి శివారులోని జివిఆర్ కాలేజీ సమీపంలో రోడ్డు జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనం బలంగా ఆటోను ఢీకొనడంతో ఆటోను తప్పించిపోయి బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో సావిత్రితో పాటు మరో మహిళ తీవ్రంగా గాయపడటంతో ప్రథమ చికిత్స కొరకు చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సావిత్రి ముఖం భాగం పైన తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవలు కోసం విజయనగరం తరలించారు. చీపురుపల్లి ఎస్సై ఎల్.దామోదర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఆశా వర్కర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి'

పార్వతీపురం, జూన్ 13 ప్రభాతవార్త: ఆశా వర్కర్లకు ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు వెంటనే ఇవ్వాలని సిఐటియు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు ఈ మేరకు జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటి నాయకులు మాట్లాడుతూ 62 సంవత్సరాల వయోపరిమితిని ప్రభుత్వం



అంగీకరించిందని కానీ ఇప్పుడు రిటైర్ చేయడం వలన అనేకమంది ఏటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా పెన్షన్ గ్రాడ్యుయేట్ లేకుండా ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇలా అయితే ఆశ వర్కర్‌లు ఏ రకంగా జీవించాలని ప్రశ్నించారు. ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని అప్పటివరకు 62 సంవత్సరాలు కొనసాగించాలని అన్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కలిగించాలని కనీస వేతనం అమలు చేయాలని, సెల్ ఫోన్లు రిపేరు చేయాలని, సిమ్ కార్డులు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ ఇవ్వాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి వెంకటరమణ ఉపాధ్యక్షులు ఇందిర యూనియన్ నాయకులు పాల్గొన్నారు అన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీల్లో అవంతీస్ విద్యార్థికి రజతం



గరివిడి, జూన్ 13 ప్రభాతవార్త: గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మీసాల శ్రీరాం నాయుడు అనే విద్యార్థి జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రజత పతకాన్ని సాధించి కళాశాల కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు. ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి 9వ ఓపెన్ తైక్వాండో పోటీల్లో మీసాల పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి రెండవ స్థానాన్ని సాధించి వెండి పతకం అందుకున్నారు. తమ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకం సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, పరిపాలనాధికారి జి.అనీల్ కుమార్ అభినందించారు.

## జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం : రాజన్నదొర

సాలూరు, జూన్ 13 ప్రభాతవార్త : రాష్ట్రంలో సుపరిపాలన ఎక్కడ ఉందని అంతా హిట్లర్ రాక్షస పాలనలో ఈ ఏడాదంతా కొనసాగిందని సూపర్ 6 పథకాలు అమలు చేయకుండా అంబేద్కర్ రాజ్యాంగం మరచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలుచేసి అరెస్టుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని కూటమి సర్కార్‌పై మాజీ డిప్యూటీ సీఎం పీడిక.రాజన్నదొర ఫైర్ అయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన నివాసం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వారి ఎల్లో మీడియా పత్రికల్లో ప్రజలకు నచ్చే విధంగా ఈ ఏడాది అంతా సుపరిపాలన కొనసాగిందని టీడీపీ అండ్ కో గొప్పలు



చెప్పుకోవడం మానుకోవాలని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం ఇంకా మూడుగ్యాస్ సీలిండర్లు అని చెప్పి ఒక్కటే ఇచ్చి ప్రజలను మోసం చేయడం సుపరిపాలన అని ప్రశ్నించారు. అంతే కాకుండా పెన్షన్ మాటకొస్తే ఏ ప్రభుత్వంలోనైనా ఇవి కొనసాగుతాయని దీనిని గొప్పగా చెప్పుకోవడం కూటమి సర్కార్ అజ్ఞానమని చెప్పారు. గతంలో వైసీపీ జగన్ ప్రభుత్వం రైతులకు స్టూడెంట్స్‌కు ఇంకా పేదబడుగు బలహీనవర్గాల వారికి ప్రతినెల ఏదో ఒక పథకంతో లబ్ధిపొందారని ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో కల్లబొల్లి మాటలు చెప్పి సంక్షేమ పథకాలు లేకుండా చేసి ప్రజలను బాధలకు గురిచేయడం సుపరిపరిపాలన అని ప్రభుత్వంపై ఆగ్రహించారు. అంతేకాకుండా కూటమి సర్కార్ ప్రజా ఆగ్రహానికి గురికావడం తప్పదని జగన్ అంటే నమ్మకమని చంద్రబాబు అంటే మోసమని త్వరలో ఆంధ్రప్రదేశ్ రెండోవైపు చిత్రం చూస్తారని క్లారిటీ ఇచ్చారు. చైర్ పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ అప్పలనాయుడు గిరి రఘు, దండి శ్రీను, రెడ్డి సురేష్, సింగరపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో డిపో రైస్ రాకెట్ .. అత్యంత సీక్రెట్!

సాలూరు, జూన్ 13 ప్రభాతవార్త:

**సాలూరు పట్టణంలో రైస్ రాకెట్ అత్యంత సీక్రెట్‌గా నడుస్తుంది. సర్కార్ ద్వారా పేదలకు అందవలసిన టన్నుల కొలది పిడిఎస్ బియ్యం హద్దులు దాటి సరిహద్దులు దాటిపోతుంది. పటిష్టంగా నిఘా వ్యవస్థ ఉందని అధికార యంత్రాంగం చెబుతున్నవి ఉత్తుత్తి కబుర్లులని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.**

ఈ రైస్ రాకెట్‌ను తెరవెనుక నుండి రెవిన్యూశాఖ యంత్రాంగం పూర్తి సహకారంతో నడిపిస్తుందని జోరుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అంతేకాకుండా ఇందులో తెల్లరేషన్ కార్డుల లబ్ధిదారులు తప్పులు కూడా ఉన్నాయి. ఎందుకంటే కొందరు రైస్‌ను విడిపించుకుని అక్కడే డీలర్లకు అమ్మడం అలాగే కందిపప్పు ఇంకా పంచదార రేషన్ సరుకులు డీలర్ ద్వారా బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్లడం అందరికీ



తెలిసిన ఓపెన్ సీక్రెట్‌గా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంచితే గురువారం ఉదయం పట్టణంలో పట్టపగలు ఎదేచ్ఛగా డిపో రైస్ ను ఎపి 39 టిఇ 7153 నెంబర్ గల ఆటోలో ఒరిస్సాకు అక్రమంగా తరలించడంపై వచ్చిన సమాచారం మేరకు సి ఎస్ డి టి రంగారావు పాగవేసి పట్టుకున్నారు. అలాగే ఆటోను సీజ్ చేసి 5 క్వింటాల 45 కేజీల డిపో రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఎ కేసు నమోదు చేసి బియ్యాన్ని ఎం.ఎల్.ఎస్. పాయింట్‌కు చేరవేశారు. సమాచారం మేరకు కాకుండా రైస్ రాకెట్ సూత్రదారులపై అలాగే అక్రమార్కులపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

మరిన్ని తాజా వార్తల కోసం
vaartha.com క్లిక్ చేయండి

## నిరాదరణకు గురైన పాచిపెంట మేదర కులస్తులు!

**-పనులు లేక అర్ధాకలితో కుటుంబ సభ్యులు!**

పాచిపెంట, జూన్ 13 ప్రభాతవార్త: చేతివృత్తులు నమ్ముకొని జీవన ఉపాధికి నోచుకోని చేతి వృత్తుల్లో ఒకరైన మేదర కులస్తులు పరిస్థితి వారి జీవన విధానం కడు దయనీయంగా ఉందని పలువురు మేదర యజమానులు ఏ.పైడిరాజు, సూర్యనారాయణలు వాపోయారు. వివరాల్లోకి వెళ్ళగా మన్యం జిల్లా పాచిపెంట మండలం పాచిపెంట గ్రామానికి చెందిన మేదర కులస్తులుకు చేతినిండా పని లేక చేసిన పనిముట్లకు గిరాకీ లేక కొనుగోలుదారులు లేక అల్లిన చాపలు తట్టలు, బుట్టలు ఉమ్మడి విజయనగరం జిల్లాకు అమ్మడానికి నెలకు రెండు మూడు సార్లు తీసుకెళ్లవలసిన పరిస్థితి వస్తుందని వారు తెలిపారు. మూడు దశాబ్దాల కాలం క్రితం చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి జీవనోపాధి లేక 30 మేదర కుటుంబాలు ఆంధ్ర రాష్ట్రం విజయనగరం జిల్లా పాచిపెంట గ్రామానికి జీవన ఉపాధి కొరకు వలస వచ్చామని, అప్పట్లో స్వర్గీయ డి సరోజనమ్మ మేదర పనులుకు పెట్టుబడి పెట్టి తయారు చేసిన వెదురు చాపలు బట్టలు కొనుగోలు చేసి కొంత ఉపాధి మేదర్లకు కల్పించారని, ఆమె మృతి చెందడంతో పెట్టుబడులు లేక మరోవైపు పనులు చేద్దామన్న కొనుగోలుదారులు లేకపోవడంతో తమ బ్రతుకులు అగమ్య గోచరంగా ఉందని మహిళలు వాపోయారు. ఈ 30 కుటుంబాలలో గత దశాబ్దం కాలంగా పనులు లేకపోవడం వలన వేరే రాష్ట్రాలకు తమ కుటుంబ సభ్యులు జీవన ఉపాధి కొరకు ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ సెట్ అయ్యారని కొంతమంది మేదర కుటుంబాలు తెలిపారు. దశాబ్దాల కాలంగా మేదర వృత్తిని నమ్ముకొని తమ కుటుంబాలు ఉన్నాయని ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయ సహకారాలు అందడం లేదని వారు వాపోయారు. ఉన్న ఆరు కుటుంబాలు ఏ పని చేయలేక తమ వృత్తి అయిన మేదర పనులు చేసినప్పటికీ తల్లిపిల్ల ఇద్దరు కష్టపడిన పూట గడవడం కష్టంగా ఉందని వారు ప్రభాతవార్త వద్ద విలపించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిరుపేద మేదర కులస్తులకు అండగా ఉంటూ వారికి తగిన న్యాయం చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని పాచిపెంట మేదర కులస్తులు ప్రభుత్వానికి కోరుతున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తమ చేతి వృత్తి పనులు చేసినప్పటికీ కాలం వెళ్ళబుచ్చడం కష్టంగా ఉందని వారు తెలిపారు.





# ఆర్థిక ఇబ్బందులు లేకుండా !

డబ్బు సంపాదించడమే కాదు.. డబ్బు నిర్వహణ గురించి కూడా మహిళలకు తెలిసుండాలంటున్నారు ఆర్థిక రంగ నిపుణులు. అప్పుడే ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండొచ్చు.

**ప్రతి రూపాయీ లెక్కే!**

నోట్ప్యాడ్ 3. పెళ్లయ్యాక అందరు మహిళలు ఉద్యోగం చేయలేదు. ఒక్కోసారి కుటుంబ బాధ్యతలు, ఇతర కారణాల రీత్యా వివాహం తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి గృహిణిగా కొనసాగాల్సి ఉంటుంది. అలాంటప్పుడు కూడా ఇంట్లో ఉన్నా డబ్బు నిర్వహణపై దృష్టి పెట్టి ప్రతి రూపాయి వృథా కాకుండా బడ్జెట్ వేసుకోవడం ఎంతో ముఖ్యమంటున్నారు. ఈ నెలనెలా ఇంటి అవసరాలు, ఖర్చులకు సంబంధించి భార్యాభర్తలిద్దరూ చర్చించుకొని కొంత బడ్జెట్ను నిర్ణయించుకోవాలి. అందులో అత్యవసరమైన వాటికే ఖర్చు పెట్టి మిగిలిన నిపుణుల సలహాతో పెట్టుబడి పెడితే దీర్ఘకాలంలో ఉపయోగించుకోవచ్చు.

**వాళ్ల అవసరాలే ముఖ్యం!**

అనుకోకుండా భర్తను కోల్పోవడం లేదంటే భర్త నుంచి విడిపోవడం.. ఈ రెండు సందర్భాల్లో సింగిల్ మదర్ గానే మహిళలు తమ పిల్లల బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇలాంటప్పు పిల్లల చదువు, పెళ్లి.. వంటి దీర్ఘకాలిక లక్ష్యాల పైనే ఎక్కువ దృష్టి పెట్టాలని నిపుణుడైతే ప్రస్తుతం వీటికి సంబంధించిన పొదుపు, పెట్టుబడి పథకాల్లో డబ్బు జమ చేయాలంటే.. అలాగే టర్మ్ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవడం అవసరం... దీనివల్ల పిల్లల భవిష్యత్తు అవసరాలను తీర్చవచ్చు. దీనితో పా కనీసం ఆరు నెలలకు సరిపడా అత్యవసర నిధిని జమ చేసుకోవడమూ ముఖ్యమేనంటున్నారు అలాగే మీ పెట్టుబడులు, వాటిలోని లాభనష్టాల గురించి కూడా ఏ నెలకానెల చెక్ చేసుకోవద్దు.

**రిటైర్మెంట్ తర్వాతా..!** సాధారణంగా చాలామంది విషయంలో.. రిటైర్మెంట్ వయసు వచ్చే నాటికే పిల్లల చదువులు, పెంటి రుణం.. వంటి పెద్ద లక్ష్యాలన్నీ తీరిపోతాయి. ఈ మిగిలిన సొమ్ములో సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, పోస్టాఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్, ఎఫ్ఈ, మ్యూచువల్ ఫండ్స్.. వంటి రిస్క్ తక్కువగా ఉండే వారి సలహాతో పెట్టుబడి పెట్టచ్చు. ఇలా పొదుపు చేసిన డబ్బును మీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. □

# అడవుల పరిరక్షణ కోసం కృషి..

ఈసారి యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో అమ్మాయిలే టానర్లు, దాన్ని కొనసాగిస్తూ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లోనూ అమ్మాయే విజయఢంకా మోగించింది. పేరు కనికా అవాబ్ రెండు వైఫల్యాల తరవాత అందుకున్న విజయమిది.

తాజా సివిల్స్ ఫలితాల తరవాత కనిక నిరాశకు గురైంది. సివిల్స్ విజేతల్లో ఆమె పేరు లేకపోవడమే మూడేళ్ల కష్టం మది! వృథా అయితే బాధ సహజమే. అలాగని అందులోనే ఉండి పోలేదామె. ఈసారి మరింత బలంగా కృషిచేయనుంది.



కట్ చేస్తే... యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆ ఫలితాలను చూశాక ఆమె నమ్మలేకపోయింది దానిలో తన పేరు లేదు. ఏకంగా అఖిల భారత స్థాయిలో తొలి ర్యాంకు సాధించిందామె. ఇక తన ఆనందం పట్టడం ఎవరి తరమూ కాలేదు. కనికది రాంచీ చదువులో మొదటినుంచీ ముందే. నాన్న అభయ్ కుమార్ సిన్హా జడ్జిగా పదవీ విరమణ చేశారు. అమ్మ అనితా సిన్హా, ఒక్కతే అమ్మాయి. అందుకే కనిక ఏం చేస్తానన్నా పూర్తి స్వేచ్ఛనిచ్చారామె తల్లిదండ్రులు, బీఈసీ సీ జువాలజీ చేసిన తరవాత కనిక... ఢిల్లీలోని జేఎన్ యూలో ఎన్విరాన్మెంటల్ సైన్స్లో పీజీ చేసింది. అక్కడే ఆమె సివిల్స్ లక్ష్యం పెట్టు కుంది. అయితే అందరిలా కోచింగ్ సంస్థలో చేరాలనుకోలేదు. సొంతంగా ప్రయత్నించాల నుకున్నా. 2021లో సన్నద్ధత ప్రారంభించా. లైబ్రరీలు, రీడింగ్ రూమ్లో చదువుకునేదాన్ని. తరవాత ఇంటికొచ్చి ఇక్కడే సిద్ధమవడం ప్రారంభించా, యూట్యూబ్, ఆన్లైన్లో సమాచారాన్ని సేకరించుకునేదాన్ని. ఇంటర్వ్యూకు మాత్రం సాయం తీసుకున్నా. కొన్ని పాఠ్యాంశాల కోసం ఆన్లైన్ తరగతులకు హాజరయ్యా'ననే కనిక తొలిసారి విఫలమైనా పట్టించుకోలేదు. రెండోసారి దేశం అభివృద్ధి చెందడ మంటే టెక్నాలజీ దిశగా ముందుకు వెళ్తే సరిపోదు. అడవులనూ సంరక్షించుకోవాలని గ్రహించింది. అందుకే ఐఎఫ్ఎస్పైనా దృష్టి పెట్టింది. రెండూ ఒకేసారి రాసి సివిల్స్ విఫలమైనా ఐఎఫ్ఎస్లో ర్యాంకు సాధించింది. వైఫల్యాలు వచ్చినప్పుడు కుంగిపోవడం మామూలే. అలాంటప్పుడు ఇంట్లోవాళ్ల అండా అవసరం. అది నాకు దొరికింది. రోజుకు ఏడు గంటలు చదివేదాన్ని. సోషల్ మీడి దూరంగా ఉన్నా. యూపీఎస్సీ పరీక్షలేమీ రాకెట్ సైన్స్ కాదు. బోలెడంత డబ్బులు తీసుకుంటేనే సాధిస్తామనీ లేదు. సొంతంగానూ ప్రయత్నించొచ్చు. కాకపోతే ఆత్మవిశ్వాసం కోల్పో కూడదు అన్న సలహానిస్తోన్న కనిక ఒడిశా కడర్ని ఎంచుకుంది. అక్కడి బయె పర్యావరణం, అడవులు ఆమెను ఆకర్షించాయి. వాటి పరిరక్షణకు కృషి చేస్తానంటోంది కనిక పీహెచ్ఎ చేస్తోంది.

**లక్ష్యం కోసం. ఒట్టుతీసి గట్టుమీద పెట్టా!**

ఓపక్క రవాణాశాఖ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన లక్ష్యమైన 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్'కు కీలక సిద్ధమయ్యారు. ఐశ్వర్యారెడ్డి. తాజాగా యూపీఎస్సీ విడుదల చేసిన ఐఎఫ్ఎస్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు సాధించారు ఐశ్వర్య. లక్ష్యం కోసం కష్టపడి పనిచేయడం అమ్మ నుంచే నేర్చుకున్నా. అమ్మ పద్మావతి, స్పెషల్ క్లాస్ గుత్తేదారు. నేటికీ పురుషాధిక్యమే రాజ్యమేలుతున్న నిర్మాణరంగంలోకి 40 ఏళ్ల కిందటే అడుగు పెట్టిందామె. ఇంటి బాధ్యతలను సమర్థంగా, ప్రణాళికా బద్ధంగా నెరవేరుస్తూనే గుత్తేదారుగానూ రూ.కోట్ల విలువైన పనులు చేయించింది. ఆచార్యుడిగా నాన్న మంచి వృత్తిలో తనకంటూ గుర్తింపు ఉండాలన్న ఉద్దేశంతో ఎంతో శ్రమించేది. కొన్నిసార్లు తెల్ల వారుజామునే వెళ్లి రాత్రి ఎప్పుడో తిరిగి వచ్చేది. తాను చేయించుకున్న నిర్మాణ పనుల పరిశీలన దగ్గరుంది. అమ్మలోని ఆ కష్టపడేతత్వమే నాకు స్ఫూర్తినీ, ప్రేరణనూ కలిగించాయి. నాన్న వై.రామచంద్రారెడ్డి. ఎస్.వి. విశ్వవిద్యాలయంలో చరిత్ర ఆచార్యుడిగా చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కళాశాలలో చేరి లా కోర్సు పూర్తిచేయడంతోపాటు న్యాయ వాదిగా కొత్త కెరియర్కు సిద్ధమవుతున్నారు. ఈ వయసులోనూ వాళ్ళు పడుతున్న తపన చూసి నా లక్ష్యం విషయంలో రాజీపడకూడదను కున్నా. మా సొంత కడప, నాలుగో తరగతి నుంచే ఓ పాఠశాలలో చేర్చారు. అమ్మ వచ్చి ఎంత ఉన్నా పరీక్షల సమయంలో రోజూ మాకు ధైర్యం చెప్పేది. ఆమె మాపై చూపే ప్రేమ, మా చదువులపైన శ్రద్ధ, పెట్టుకున్న ఆశలు నాలో పట్టుదలను రగిల్చేవి. దీనితో ఒక్కక్షణం కూడా వృథా చేయకుండా చదివేదాన్ని. ఐఐటీమద్రాస్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చేశా,

**కార్పొరేట్ ఉద్యోగం వదిలి....**

ఇంజినీరింగ్ కాగానే అత్యుత్తమ వేతనంతో పేటీఎం సంస్థలో ఉద్యోగం వచ్చింది. ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటేనే ప్రజాసేవ చేయగలను అనిపించింది. దాంతో ఉద్యోగానికి రాజీనామా చేసి. యూపీఎస్సీకి సిద్ధమయ్యాను. నాకు పర్యావరణం అంటే మక్కువ. అందుకే ఐ.ఎఫ్.ఎస్. సర్వర్ పై ఎక్కువగా దృష్టిసారించా. 2018లో రాసిన ఏపీపీఎస్సీ గ్రూప్1 ఫలితాలు 2022లో విడుదలయ్యాయి. 18వ ర్యాంకు వచ్చింది.



రవాణాశాఖలో ఆర్.టి.ఒ.గా ఎంపికయ్యా. జిల్లా రవాణాశాఖ అధికారిణిగా పదోన్నతి రావడంతో నంద్యాల వచ్చాను. ఉద్యోగం చేస్తూనే చదువుకున్నా... ఓ పక్క విధులు నిర్వర్తిస్తూనే నా అంతిమ లక్ష్యమైన ఐఎఫ్ఎస్ కోసం నిరంతరాయంగా శ్రమించాను. చిన్నప్పట్నుంచీ గంటలకొద్దీ కూర్చొని చదువుకోవడం, పనిచేయడం అలవాటు, దాంతో నాకు ఉద్యోగ బాధ్యతలు ఏమాత్రం భారంగా అనిపించలేదు. ఉద్యోగం, చదువు కోసం రోజుకు 15 గంటలు శ్రమించేదాన్ని, అధికార బాధ్యతలవల్ల కొన్నిసార్లు చదవడానికి సమయం దొరికేది కాదు. దాంతో నాకు వెంటనే ర్యాంకు రాలేదు. ఒకింత నిరాశ ఆవరించినా ఆ ఓటమి పట్టుదలను మరింత పెంచి, కష్టపడి చదివేలా చేసింది. □









# ఆడంబరానికి పోల్కీ నగలు

పోల్కీ నగలు.. రాచరికపు హుందాతనానికీ, ఆడంబరానికీ అద్దం పట్టేలా ఉంటాయి. పోల్కీలంటే పాలిష్ చేయకుండా, కత్తిరించకుండా సహజంగా ఉపయోగించే వజ్రాలే. వీటిని నేలపొరల నుంచి సేకరించి, శుభ్రపరిచి నేరుగా నగల్లో పొదుగుతారు. అందుకే ఇవి రకరకాల ఆకృతుల్లో ఉంటాయి. సహజ మెరుపుతో ధగధగలాడే మొగలుల కాలంనాటి ఈ జ్యూయెలరీకి ఉత్తరాదిన బోలెడంత పాపులారిటీ. ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల్లో వీటిని ప్రత్యేకంగా తయారుచేస్తారు. ఈ పోల్కీలు.. కుందన్, మీనాకారీ, జాడౌ పనితనంతో నగల్లో ఒదిగిపోయి చూపరులను కట్టిపడేస్తుంటాయి. ముఖ్యంగా ధనికవర్గాలు, బాలీవుడ్ తారలు ఎక్కువగా ఇష్టపడే ఇవి ఇప్పుడు సామాన్యులకోసం కొత్తదనాన్ని చుట్టుకుని వచ్చేశాయి. ముఖ్యంగా సెమీప్రెషియస్ రకాల్లో అన్నివర్గాలనూ ఆకట్టుకునేలా తయారుచేస్తున్నారు. అయితే, మొన్నమొన్నటివరకూ చిన్న చిన్న పోల్కీలు కుందన్ స్టైల్లో కనువిందు చేసి హారాలు.. ఇప్పుడు పెద్ద పెద్ద పోల్కీలతో జిగేల్మనిపిస్తున్నాయి. మరి వాటినోసారి మనమూ చూద్దామా!















# జీన్స్ ఎక్కువకాలం మన్నాలంటే !

ఈ రోజుల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళల క్యాజువల్ వేర్గా జీన్స్ మారి పోయింది. అయితే, వీటినీ సరిగా ఉంచుకోకపోతే అవి ఎక్కువకాలం నాణ్యంగా, మన్నికగా ఉండవు. ఈ పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలిలా తీసుకోవాలి. ★ మొదటి సారి జీన్స్ నానబెట్టే సర్ఫ్ నీళ్లలో కాస్త రాళ్ల ఉప్పు కూడా వేయండి. ఇలా చేస్తే రంగు పోకుండా ఉంటుంది. మురికీ,మరకలూ త్వరగా వదులుతాయి.కొత్తదనమూ పోదు. ★. ముదురు రంగు జీన్స్లు మెరుపు తగ్గుతున్నాయా? అయితే వాటిని ఉతికిన తరవాత చివరిలో అరబకెట్ నీటిలో కప్పు బేకింగ్ సోడా కలిపి ముంచితీసి ఆరేయండి చాలు. మరకలు పడితే రెండు చెంచాల వంటసోడాలో కాస్త వినెగర్ కలిపి పేస్టులా చేసి మరక మీద రాయాలి. పావుగంటయ్యాక బ్రష్తో రుద్దితే త్వరగా వదిలిపోతుంది. ★. జీన్స్ కాస్త మందంగా ఉంటుంది కదా అని.. వేణ్నీళ్లలో నానబెట్టడం, బండకేసి బాదడం చేయొద్దు. దీనివల్ల దాని ఫైనింగ్తో పాటు మన్నికా తగ్గుతుంది. వీలైనంతవరకూ వీటిని చన్నీళ్లతోనే ఉతకాలి. అలానే జీన్స్ని వేసుకున్న ప్రతిసారీ ఉతికేయొద్దు. గాలికి ఆరనిచ్చి రెండు మూడుసార్లు వేసుకుంటే మంచిది. □

## చెలి చిట్కా

మధుమేహానికి నాగముషిణి చెక్క గంధాన్ని శనగగింజ ప్రమాణం సేవిస్తూంటే రక్తంలో మూత్రంలో చక్కెరవ్యాధి కనిపించదు. □

# వ్యథ

# నిద్ర ఆహారంపై శ్రద్ధ చూపండి



**ఎన్.బి.సుధాకర్రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న : నా వయస్సు 27 ఏళ్ళు. నిరోద్యోగిని ఇంకా పెళ్ళి కాలేదు. బాల్యం నుంచి నేను చదువులో చాలా చురుగ్గా ఉన్నాను. డిఎస్సీలో మూడు కేటగిరీలకు దరఖాస్తు చేశాను. తొలి కేటగిరీ పరీక్షలో తెలిసి కూడ ఆరు ప్రశ్నలకు తప్పు జవాబులు పెట్టాను. ఇక రెండు పరీక్షలు రాయాల్సి ఉంది. ఇప్పుడు రెండవ పరీక్ష కోసం సన్నద్ధం అవుతున్నాను అయితే మొదటి పరీక్షల్లో చేసిన తప్పులు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. దీనితో ఆత్మవిశ్వాసం దెబ్బతిని మనసు కల్లోలం అవుతోంది. పుస్తకం తీసి చదువు దామంటే ఏకాగ్రత కుదరడం లేదు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నాకు ఈ ఉద్యోగం చాలా అవసరం. నా జీవితం పెళ్ళి ఇతర అంశాలు ఉద్యోగంతో ముడిపడి ఉన్నాయి. తెలివి తేటలు ఉండి పరీక్షల సమయంలో తప్పు ఎందుకు చేశానో అర్థం కావడం లేదు. ఇప్పుడు గడిచి పోయిన విషయాన్ని మరచి పోలేకపోవడం విచిత్రంగా ఉంది. చదివిన విషయాలు మరచిపోతున్న నేను అనవసర విషయాలను మరచిపోలేక పోవడం వల్ల ఇబ్బంది పడుతున్నాను. నేను ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలలో చదువుతున్నాను. ప్రణాళికాబద్ధంగా రోజుకు 16 గంటలు చదువుతున్నాను. ఇతర పనులకు రెండు గంటలు పోగా 6 గంటలు నిద్రపోతున్నాను. కడుపు నిండా తింటే కంటికి కునుకు వస్తుందని సగం తింటున్నాను. రోజు15 నిమిషాలు ధ్యానం కూడ చేస్తున్నాను. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికి నాలో జ్ఞాపకశక్తి ఏకాగ్రత ఎందుకు దెబ్బతింటున్నదో అర్థం కావడంలేదు. నేను 160 సెంటీమీటర్ల ఎత్తు 40 కిలోల బరువు ఉన్నాను. ఋతుక్రమం రెండు మూడు నెలలకు ఒకసారి అవుతుంది. ఒక్కోసారి నాపై నాకే జాలివేసి దుఃఖం వస్తోంది. మా అమ్మ ఏదైనా సలహా చెపితే కసురుకుంటున్నాను. ఇలాంటి సమయాలలో గుండె వేగంగా కొట్టుకుంటోంది. అరి చేతుల్లో చెమట పడుతోంది. పెదాలు తడారి పోతున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల నుంచి బయట పడి డిఎస్సీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునే మార్గం చెప్పండి. **- ఒక సోదరి, తిరుపతి**



**జవాబు :** అమ్మా మీరు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే హార్మోన్ల అసమతుల్యత కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆహార లేమి, నిద్రలేమి బరువు తక్కువగా ఉండటం అని చెప్పవచ్చు. దీనితో మీలో ఆత్మ విశ్వాసం దెబ్బతిని, ప్రతికూల ఆలోచనలు ఎక్కువుతున్నాయి. దీనివల్ల పరీక్షల్లో తప్పు చేశారు. కాబట్టి మొదట మీరు లోపాలను సరిద్దుకుని ఒత్తిళ్లను నియంత్రించుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు వయస్సు, ఎత్తుకు తగిన బరువు లేరు. దీనికి ప్రధాన కారణం సరిగా తినకపోవడం దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. అంటే ఈటింగ్ డిజార్డర్, ఒసిడి, సన్నగా ఉండాలన్న తపన, జీర్ణవ్యవస్థ లోపం లాంటివి. కాబట్టి ఒక సారి డాక్టరును సంప్రదించండి. ఈ సమస్య వారం పదిరోజుల్లో తీరేది కాదు. ఇంకో వారం లో జరిగే పరీక్షల కోసం ఒత్తిళ్ళ నిర్వహణ, ఉపశమన మార్గాలు ఆచరించండి. తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తగినంత తీసుకోండి అలాగే ఇంకో రెండుగంటలు ఎక్కువగా నిద్రపోవడానికి ప్రయత్నం చేయండి. మెదడు చురుగ్గా పని చేయడానికి ఆహారం, నిద్ర చాల అవసరం అని గుర్తించండి. అనవసర ఆలోచనలు మాని ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నం చేయండి. డాక్టరును సంప్రదించి శక్తి సమకూర్చుకోవడానికి విటమిన్ టాబ్లెట్లు, సిరప్ లాంటివి తీసుకోండి. అనవసరం అయితే సైకాలజిస్టును సంప్రదించండి. □

# కాకరతో రక్తహీనత దూరం !

చేదుగా ఉన్నట్లు కొందరు కాకరను దూరం పెట్టేస్తారు. నిజానికి అది చేసే మేలును వెలకట్టలేం. కాకరలో ఎ, బి1, బి2, బి3, బి5, బి6, బి9, సి విటమిన్లు, పీచు, పొటాషియం, సోడియం, భాస్వరం, మాంగనీస్, మెగ్నీషియం, క్యాల్షియం, రైబోఫ్లావిన్, రాగి, జింక్, ఐరన్లు ఉన్నాయి. కాకర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో చేరిన సూక్ష్మక్రిములు నశిస్తాయి. గాయాలు త్వగా తగ్గుతాయి. కురులు దృఢంగా ఉంటాయి. కంటిచూపు మెరుగవుతుంది. చర్మానికి మెరుపు వస్తుంది. ఎముకలు, దంతాలు పటిష్టంగా ఉంటాయి. కాకర కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. గుండె జబ్బులను నిరోధిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రక్తాన్ని, కాలేయాన్ని శుద్ధి చేస్తుంది. ఉబ్బసం లాంటి శ్వాస ఇబ్బందులను అరికడుతుంది. రక్తహీనత రాకుండా కాపాడుతుంది. కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నివారిస్తుంది. రోజూ అర చెంచా చొప్పున కాకర రసం తాగుతుంటే మధుమేహం నియంత్రణలో ఉంటుంది. అల్లం, వెల్లుల్లి, నువ్వులు, పల్లీలు, కొబ్బరి లాంటివి జోడిస్తే కాకరకాయలతో అద్భుతాలే చేయొచ్చు. కూర, పచ్చడి, పులుసు, ఇగురే కాదు.. వీటితో కారం, చిప్స్ సైతం చేయొచ్చు. ఇవెంతో బాగుంటాయి కూడా. ఇన్ని సుగుణాలు ఉన్నప్పటికీ కాకరను అతిగా లేదా బలవంతంగా తినడం మాత్రం మంచిది కాదు. అలా చేస్తే వాంతులు, విరేచనాలు లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. □



# దాహం తీర్చిన సాయి

ఒకసారి నానా సాహెబ్ చందోర్కర్ ఆఫీసు పనిమీద ఒక గ్రామానికి వెళుతూ దారిలో ఉన్న హరిశ్చంద్ర గుట్టను దాటవలసి వచ్చింది. కార్యాలయ సిబ్బందితో గుట్ట ఎక్కుతున్నాడు నాన. సగం దూరం ఎక్కేసరికి మధ్యాహ్నమైంది. అది మండు వేసవి (కనుక ఈ సంఘటన మే నెలలో జరిగి ఉంటుంది) నడి నెత్తిన సూర్యుడున్నాడు. నానకు గొంతుక పిడచకట్టుకుపోయింది. ఆయన అనుచరులంతా దగ్గరలో నీరు ఏమైనా లభ్యమవుతుందేమోనని చూచారు. కానీ, ఫలితం లేదు. నానా తీవ్ర దాహంతో ఉన్నాడు ఏమి చేయటానికి దిక్కుతోచలేదు. నానకు తన ఆరాధ్య దైవమైన సాయి గుర్తుకు వచ్చాడు. వెంటనే సాయిని మనసారా ప్రార్థించాడు. భక్తులందరకు తమ ఇష్ట దైవాలు సమయానికి సహాయం చేస్తాయి. ఈ సంగతి నానాకు తెలుసు. నర్సీ మెహతా హుండీని భగవానుడు గౌరవించాడు. ఏకనాథుని కోసం వంటలవాని రూపాన్ని దాల్చాడు రంగనాథుడు. దామాజీని కాపాడటం కోసం, విఠూ మహర్గా అవతరించాడు పాండురంగడు. నానా సాయిబాబా ఇక్కడ ఉంటే బాగుండును అన్నాడు. ఆయన అనుచరులలో కొందరికి రుచించలేదు, ఆ మాట. అదే సమయానికి షిరిడీలో తన ప్రక్కన కూర్చున్న శ్యామాతో సాయి నానా ఆపదలో ఉన్నాడు అన్నాడు. సరిగ్గా అదే సమయానికి కట్టెల మోపు నెత్తిన పెట్టుకున్న భిల్లుని. 'నీవు కూర్చున్న బండ క్రింద' అని జవాబిచ్చాడు ఆ భిల్లుడు. ఆ బండను తొలగించగానే స్వచ్ఛమైన నీరు ఎగజిమ్మింది. నీటిని తృప్తిగా త్రాగి నడకసాగించాడు నానా తన పరివారంతో. కొంత కాలానికి షిరిడీకి వెళ్లాడు నానా. ఫలాన రోజున, ఫలానా సమయంలో ఏదైనా ఆపదలో ఉన్నారా? అని ప్రశ్నించాడు నానాను శ్యామా. వివరాలు చెప్పాడు నానా. నీటి జాడ చెప్పిన భిల్లుడు సాయే అని అప్పుడు తెలిసింది నానకు. సాయి నానాకు భౌతిక దాహాన్ని తీర్చాడు నీటి జాడను చూపి, ఆధ్యాత్మిక దాహాన్ని కూడా తీర్చాడు గీతార్థాన్ని తెలిపాడు.

**- యం.పి.సాయినాథ్**

ఆధ్యాత్మికం



# సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక దుస్తులు



ఓ చిన్న ఆలోచన మన గమనాన్నీ, గమ్యాన్నీ మార్చేస్తుందంటారు. అలా... అమ్మ పడే ఇబ్బందిలోంచి పుట్టిన ఓ ఆలోచనే కాంచన్ గుప్తాను వ్యాపారం వైపు అడుగులు వేసేలా చేసింది. సీనియర్ సిటిలు, కదల్లేని స్థితిలో ఉన్నవారి కోసం ప్రత్యేక దుస్తులజన్ బ్రాండ్ తీసుకొచ్చింది. 'ఫ్యాషన్ దుస్తులంటే అందం మాత్రమే కాదు. ప్రత్యేక అవసరాలున్న వారికి అవి సౌకర్యాలు, స్వేచ్ఛనీ అందించా లని ఢిల్లీకి చెందిన కాంచన్. అదే ఫ్యాషన్ రంగంలో వారికి ప్రత్యేకించింది. అప్పుడు మా అమ్మకి క్యాన్సర్ నాలుగో దశ. ఇంజెక్షన్ల వల్ల చేతులు వాచెవి. అసలు పట్టు కోనిచ్చేదికాదు. దాంతో దుస్తులు మార్చుకోలేని పరిస్థితి. తన అవసరాలకు తగినట్లు దుస్తులు ఉంటాయేమోనని బయట స్టోర్లలో, ఆన్‌లైన్‌లో ఎక్కడ వెతికినా దొరికింది. విదేశాల నుంచి ఆర్డర్ చేసినా, రావడానికి నెలలకొద్దీ సమయం పడుతుంది. కానీ, అమ్మ అన్ని రోజులు బతకదు. దాంతో సొంతంగా నేనే తయారుచేద్దామని, కావాల్సిన మెటీరియళ్లు సిద్ధం చేసుకున్నా. కానీ, పూర్తయ్యేలోపే అమ్మ మరణించింది. చివరిదశలో అమ్మకు దుస్తులు అందించలేకపోయానన్న బాధ నాలో ఉండిపోయింది. అదే కదల్లేని స్థితిలో ఉన్న వారికోసం ఆలోచించేలా చేసింది అంటారు కాంచన్.

అభిప్రాయాలు, సూచనలు అందాయి. వాళ్ల అవసరాలకు తగినట్లు మార్పుల చేర్పులూ చేసింది. ఇదే కాంచన్ విజయంలో కీలకమైంది. 'వయసు పెరగడమంటే..ఓ వ్యాధి కాదు. అది కాలంతోపాటు శరీరంలో వచ్చే మార్పు. అప్పుడు వారి అవసరాలకు తగిన దుస్తులు ఏంచుకునే అవకాశం ఉండాలి' అనే కాంచన్... ఎస్సీఎఫ్ఐ ఏజ్ ఫ్రెండ్లీ భారత్ ఫౌండేషన్ స్థాపించి, సీనియర్ సిటిజన్లకు వారి ఆరోగ్యం, హక్కులపై అవగాహన కల్పిస్తోంది. ఇవేకాకుండా అనేక ఇతర విషయాలపైనా వెబినార్లు కొనసాగు తున్నాయి. ప్రారంభించిన కొద్దినెలల్లోనే రూ.50 లక్షల అమ్మకాలు సాదించింది. ప్రేమ, బాధ... ఈ రెండింటి నుంచి పుట్టుకొచ్చిన పరిష్కారం విజయవంతం కాకుండా ఉంటుందా మరి!

## మొక్కలకు బేకింగ్ సోడా!



ఇంటి బాల్కనీల్లోనూ, వరండాల్లోనూ మొక్కలను పెంచేటప్పుడు సేంద్రియ మందులూ, కీటకనాశినిలకోసం చూస్తుంటాం కదా! ఇది మీ వంటింట్లోనే దొరుకుతుంది. అదేనండీ వంటసోడా దీన్ని నీటిలో కలిపి అందిస్తే... సోడియం, కార్బన్ వంటి సూక్ష్మ పోషకాలను మొక్కలకు అందిస్తుంది. అంతేకాదు, ఆకులపై శిలీంద్రాలు ఏర్పడినా మట్టిలో ఫంగస్ చేరినా సమస్య తగ్గుతుంది.

## తెలుసుకుందాం..



ప్రతిమా పూరి.. ఇండియన్ టెలివిజన్ చరిత్రలో న్యూస్ రీడర్‌గా పనిచేసిన తొలి మహిళ. 1965లో దూర్‌దర్శన్‌లో ఐదు నిమిషాల న్యూస్ బెలిటెన్‌ను చదివి తన కెరియర్‌ను ప్రారంభించారీమె.

# దివ్యాంగులకు మెరుగైన చికిత్స..

**కాంట్రాక్ట్ ఉద్యోగాలు... అయితేనేం ఉద్యోగానికి వందశాతం న్యాయం చేయాలనుకున్నారు... బాసాన ఉమాదేవి, గొట్టిముక్కల అనుపమ రాజకుమారి. ఆ ఆలోచనే అభంశుభం తెలియని దివ్యాంగులకు మెరుగైన చికిత్స అందేలా చేసింది. వీళ్లెవరు? ఏం చేస్తున్నారంటే?**



ఉమ, అనుపమ

ఆటిజం, సెరిబ్రల్‌పాల్సీ ఉన్న పిల్లల్ని సరైన దశలో గుర్తించి... చికిత్స ఇస్తే సమస్య నుంచి కొంత బయటపడొచ్చు. కనీసం వాళ్ల నిత్యకృత్యాలు చేసుకునేలానైనా శిక్షణ ఇవ్వొచ్చు. ఇందుకు దేశవ్యాప్తంగా చాలా కేంద్రాలు ఉన్నాయి. అవన్నీ ఖర్చుతో కూడుకున్నవి. ప్రభుత్వం 'సమగ్ర శిక్ష' కార్యక్రమం ఆధ్వర్యంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తోంది. కానీ తల్లిదండ్రుల్లో అవగాహన కొరవడి... పిల్లల్ని ఇంటికే పరిమితం చేస్తున్నారు. అలాంటి వారందరికి మా కేంద్రం గురించి అవగాహన కల్పించాలనుకున్నాం. గాజువాకలోని వడ్లపూడిలో ఉంది. రోజూ 32 మంది పిల్లలు చికిత్స కోసం ఇక్కడికి వచ్చేవాళ్లు. వారందరికీ కావాల్సిన సౌకర్యాలు ఇక్కడ లేవు. అందుకే ముందు ఈ సమస్యను పరిష్కరించాలనుకున్నాం. అంటారు. ఉమాదేవి. పదేళ్లుగా ఇదే కేంద్రం ఐఆర్పి(ఇనూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)గా పనిచేస్తున్నారు:



**అక్కడే తెలుసుకున్నా....**

అక్కడే తెలుసుకున్నా... 'మేం ముగ్గురం అక్క చెల్లెళ్లం. పెద్ద అక్క కూడా ఇదే రంగంలో ఉన్నారు. దాంతో ఇంటర్‌ప్పటి నుంచి నుంచీ నేనూ ఇలాంటి ఎన్జీఓలతో కలిసి పని చేయడం మొదలుపెట్టా. ఈ సబ్జెక్టులోనే ఏ బీడీ పూర్తిచేశా. విశాఖలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే ఇదే తరహా స్కూల్లో 20ఏళ్లు పనిచేశా. అక్కడకు విదేశాల నుంచి నిపుణులు వచ్చేవారు. వారు అనుసరించే పలు చికిత్సల గురించి చెప్పేవారు. శాండ్, హైడ్రో థెరపీలు అక్కడ నేర్చుకున్నవే. వీటివల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. తరువాత 'సమగ్ర శిక్షలో అవకాశం ఉందని తెలుసుకుని గాజువాక వచ్చాను. ఇక్కడ కూడా ఈ చికిత్సలను ప్రారంభించాలనుకున్నా. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆఫీసర్‌కి అదే విషయాన్ని చెప్పా. నిధుల కొరత వల్ల సమయం పడుతుందన్నారు. దాతల సహాయంతో ముందుకెళ్లాలనుకున్నాం. స్పందన చేయూత ఫౌండేషన్ సహాయం కోరాం. వీళ్లు అప్పుడప్పుడూ వచ్చి, సేవాకార్య క్రమాలు చేసి వెళుతుండేవారు. పరిస్థితిని అర్థం చేసుకుని, వాళ్లే కొన్ని ఫౌండేషన్లు, దాతల సహాయం తీసుకుని... రూ.18 లక్షలతో అదనపు భవనం, థెరపీకి అవసరమైన నిర్మాణాలను కట్టించి ఇచ్చారనే ఉమాదేవి ఇంతటితో ఆగిపోలేదు. తోటి ఉద్యోగిని అనుపమా రాజకుమారితో కలిసి... చుట్టుపక్కల కంపెనీల సాయంతో కేంద్రానికి కావాల్సిన సౌకర్యాలన్నీ సమకూరుస్తున్నారు. అంతేకాదు, ఇక్కడికి వచ్చే తల్లులు ఖాళీగా ఉండకూడదని... కుట్టుమెషీన్లు ఏర్పాటుచేసి టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం వడ్లపూడి భవిత వైద్య చికిత్సకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. వీళ్లిస్తోన్న థెరపీల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. □

# అందమైన ఆర్గాంజా ఫ్యాషన్





పట్టు పరికిణీలో ఆడపడుచులు బుట్ట బొమ్మలా ఉన్నా.. లెహంగాలు తెచ్చే అందమే వేరు. అందులోనూ రంగు రంగుల పూల డిజైన్లతో, తక్కువ బరువుతో ఉండే ఆర్గాంజా లెహంగాలు భలే లుక్ ఇస్తాయి. అందుకే ఆ తరం, ఈ తరం అనే తేడా లేకుండా కాలేజీ అమ్మాయిల నుంచి నడివయసు వాళ్లవరకూ వీటిని వేసుకుని మురిసిపోతున్నారు. ఎంబ్రాయిడరీ, క్రిస్టల్, మిర్రర్, క్రష్డ్, శాటిన్.. అంటూ రకరకాల లెహంగాలు అతివల మనసు దోచేస్తున్నాయిప్పుడు. అల్లంత దూరాన ఉన్నా కూడా.. ఆకాశంలో తారల్లా మెరిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లూ, వేడుకలంటేబ్రైడ్, బోల్డ్ రంగులే. కానీ, ప్రస్తుతం మ్యూటెడ్, పేస్టల్ షేడ్స్ ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ పూల ఆర్గాంజా లెహంగా ఒక్కటన్నా ఉండాల్సిందే అనుకుంటున్నారంతా. ఇక ఫ్యాషన్ ప్రియుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ల వార్డ్‌రోబ్‌లో అయితే, ఆర్గాంజా లెహంగా తప్పక ఉండాల్సిందే. అందుకే హల్దీ, మెహందీ, సంగీత్‌లకు మోడ్రన్‌గా కనిపించాలనుకుంటే ఫ్లోరల్ డిజైన్‌లను ఎంచుకుంటున్నారు ముద్దుగుమ్మలు. ఏ రిసెప్షనో, స్నేహితురాలి పెళ్లికో అయితే, కొంచెం గ్రాండ్‌గా బ్లౌజ్‌కూ, స్కర్ట్ బోర్డర్‌కూ జరీ, సీక్విన్స్ఎంబ్రాయిడరీ లాంటివి చేయించి.. పెళ్లి కళ అంతా మాదే అనేస్తున్నారు. పైగా సందర్భమేదైనా ఫ్యాషనబుల్‌గా, హుందాగా ఉండడంతోపాటు సౌకర్యంగానూ ఉంటాయివి. వీటి మీదకు మరీ హెవీ జ్యుయెలరీ అవసరం కూడా ఉండదు. కాబట్టి, మెడలో ఓ చిన్న చోకర్ వేసుకుని జుట్టు వదిలేస్తే చాలు. సింపుల్ లుక్‌లో మెరిసిపోతారంతే. పైగా వేసవి, వర్షాకాలాల్లో ఎలాంటి చిరాకు లేకుండా హాయిగా, తేలిగ్గా ఉండి గాల్లో తేలుతున్న ఫీలింగ్‌నీ కలిగిస్తాయి మీరూ ప్రయత్నిస్తారా మరి!







## ఇడ్లీ ఏటీఎమ్ !



వేడివేడి ఇడ్లీలు తిన్నప్పుడు ఉండే మజానే వేరు. ఇంట్లో చేసుకుంటే తప్ప బయట వేడివేడిగా తినడం కొద్దిగా కష్టమే. అందులోనూ ఏ రానరతిపూటో తినాలనుకుంటే మరీ కష్టం. ఆ ఇబ్బంది లేకుండా ఇక నుంచి అర్ధరాత్రి కూడా వేడివేడి పొగలు కక్కే ఇడ్లీలను తినొచ్చు. అదెలా అంటారా? ఇడ్లీ ఏటిఎమ్‌కెళ్లి బటన్ నొక్కితే చాలు. మీరెన్ని కోరుకుంటే అన్ని అప్పటికప్పుడు వండిన రుచికరమైన వేడి ఇడ్లీలు.. చట్నీతో కలిసి అందుతాయి. బాగుంది కదా! ఈ ఏర్పాటు బెంగళూరుకు చెందిన ఫ్రెష్‌హాట్ రోబోటిక్స్ అనే స్టార్టప్ సంస్థ ఈ ఇడ్లీ ఎటిఎమ్‌ని లేదా ఇడ్లీ బాట్‌ని. ప్రారంభించింది. 2016లో శరణ్‌హితమత్ అనే ఆయన ఆరోగ్యం బాగోలేని తన కూతురుకి తినిపించడం కోసం ఇడ్లీలు కొందామని ఊరంతా తిరిగినా ఎక్కడా దొరకలేదట. మరోసారి స్నేహితుడు సరేష్ చంద్రశేఖర్‌తో కలిసి బయటకు వెళ్లినప్పుడు చల్లారి పోయి గట్టిగా రాళ్లలా మారిన ఇడ్లీలు పలకరించాయట. దీనికి అప్పటికప్పుడు తయారు చేసే మెషీన్ ఇడ్లీలే మార్గమని చెప్పి ఇద్దరూ కలిసి ఈ ఇడ్లీ బాట్‌ని తయారుచేశారు. మెనూలో ఆర్డర్ ఇస్తే ఒక నిమిషంలో ఇడ్లీలని ఇచ్చేస్తుంది. ఒకేసారి 72 ఇడ్లీలను పన్నెండు నిమిషాల్లో తయారుచేయగలదు. త్వరలో దోసబాట్, రైస్ బాట్ కూడా చేయాలనుకుంటున్నారు వీళ్లు. □

**చెలి చిట్కా**

బూడిద గుమ్మడి కాయగాని లేదా కొబ్బరికాయగాని పసుపురాసి బొట్టు పెట్టి వీధిగుమ్మం ముందు వేలాడగట్టిన ఆ ఇంటి వారికి నరఘోష దృషి దోషం తగలదు.

## ఆరోగ్య భాగ్యం

# పొగాకు జీవితాన్ని హరిస్తుంది-2



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

ప్రతి 10 మందిలో 8 మంది వివిధ కేన్సర్స్‌తో మరణిస్తున్నారు. కేన్సర్‌తో మరణించేవారిలో 30శాతం మేరకు ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నారు. దీంతోపాటు గర్భాశయ కేన్సర్, మూత్రాశయం, కిడ్నీ, కాలేయం, పాంక్రియాటిక్ కేన్సర్లు, లింఫోమా, మల, ప్రేగు కేన్సర్, అన్నవాహిక, స్వంపేటిక, నోరు గొంతు, కడుపు కేన్సర్స్ 48.3% కేసుల్లో కన్పిస్తాయి. ఇవేగాకుండా శ్వాసకోశ వ్యాధులైన ఆస్మా న్ర్బాంకైటిస్, సిఒపిడి, ఎంఫెసీమా, న్యూమోనియా, సంతానోత్పత్తి సమస్యలు ఇన్సులిన్ నిరోధకత, చిగుళ్ళ వ్యాధి, ఎముకల సాంద్రతని కోల్పోవడం, దృష్టి సమస్యలు, గ్లకోమా, మాక్యులాల్ డిజినరేషన్ వంటి కంటి సమస్యలు, టైప్-2 డయాబెటిస్ వ్యాధులు 41.1% మందిలో కన్పించడం విశేషం. పొగ తాగే అలవాటు లేని వారికంటే పొగతాగేవారికి గుండెపోటు వచ్చే అవకాశాలు 70% ఎక్కువగా ఉంటాయి. 50 సంవత్సరాల లోపు గుండెపోటుతో మరణించేవారిలో ఎక్కువ శాతం ధూమపానం అలవాటున్నవారే. రోజూ తాగే సిగరెట్ మోతాదుకు, వివిధ వ్యాధులకు సంబంధం ఉందని తేటతెల్లం అవుతుంది.

అంతే గాకుండా పొగత్రాగడం వల్ల కాళ్ళు చేతులలో రక్తనాళాలు మూసుకుపోయి రక్త ప్రసరణ లేకపోవడం వల్ల మానని గాయాలు ఏర్పడి, గాయాలు మానక గాంగ్రీన్ వచ్చి కాళ్ళు చేతుల్లో కొంత భాగాన్ని తీసివేసే బర్జర్స్ వ్యాధి వస్తుంది. ఇవే గాకుండా గ్యాస్ట్రిక్ అల్సర్స్, జీర్ణశయ వ్యాధులు, ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్, గ్యాస్ట్రయిటిస్ వంటి అనేక జీర్ణాశయ వ్యాధులు వస్తాయి. దీనికి పొగత్రాగడం మానివేయడమే సరైన మార్గమని చెప్పవచ్చు. కేవలం పొగ త్రాగే వారికే వ్యాధులు వస్తాయనుకోవడం పొరపాటు. మన పరిసరాలలో పొగ తాగేవారుండే మనం కూడా పొగ త్రాగుతున్నట్లే లెక్క. బహిరంగ ప్రదేశాలు, ఇళ్ళు, హోటళ్ళు, సినిమా హాళ్ళు మొదలైన ప్రాంతాల్లో ధూమపాన ప్రియులు వదిలే పొగ కారణంగా పర్యావరణ కాలుష్యానికి భంగం వాటిల్లడంతో బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం నిషేధింపబడింది. దీని వల్ల పొగ తాగనివారికి కూడా వివిధ వ్యాధులు రావడాన్ని 'పాసివ్ స్మోకింగ్' అంటారు. ఇంట్లో పొగ త్రాగడం వల్ల ముఖ్యంగా పిల్లలు, కుటుంబ సభ్యులు తరుచు శ్వాసకోశ సమస్యలతో బాధపడడమే కాకుండా ఊపిరితిత్తుల కేన్సర్‌తో 1-3% మంది బాధపడే అవకాశముందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2020 లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలో 22.3% పొగత్రాగే వారుంటే, అందులో 36.7% పురుషులు 7.8%స్త్రీలున్నారు. 32 దేశాల్లో పొగాకు వినియోగదారులు మానడానికి కృషి చేస్తున్నారు. ప్రతి సిగరెట్ జీవితానికి దాదాపు 10-15 సార్లు కాల్చేయడంతో 20 నిమిషాలు పడుతుంది. అది శరీరంలోకి ప్రవేశించిన 10 సెకన్లలో మెదడుకి చేరి అడ్రినలిన్‌ని విడుదల చేయడంతో ఆనందం, శక్తి వచ్చినట్లు, ఒత్తిడి నుండి రిలీఫ్ వచ్చినట్లుంటుంది. మరికొందరు స్టేటస్ కోసం, ఫ్యాషన్ కోసం అలవాటు చేసుకుంటే 80-90 నికోటిన్‌కి బానిసలవుతారు. అలసటగా, ఉత్సాహంగా లేనట్లుండడం, హృదయ స్పందన రేటు తగ్గడం ఆకలి లేకపోవడం, బరువు పెరగడం, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్స్ ఏర్పడడం, బావోద్వేగాల్లో మార్పులు ఏర్పడతాయి. పొగ తాగే అలవాటు ఉండి, వెంటనే మానివేయడం వల్ల కొద్ది నెలలకే మరణించిన వారి సంఖ్య అధికంగా ఉంది. కనుక పొగ తాగేవారు వెంటనే మానివేయక, క్రమేణా సిగరెట్ల సంఖ్య తగ్గిస్తూ, పీల్చిన పొగని లోపలికి పోకుండా బైటికి వదిలేస్తూ మానివేయాలి.

పొగ త్రాగే వారిలో 10-12 సంవత్సరాల ఆయుస్సు తగ్గుతుంది. నికోటిన్ వ్యసనం నుండి విముక్తి అనేది మీరు మీకు ఇవ్వగల గొప్ప బహుమతి. ధూమపానం మానేయడానికి మీకు సంకల్పశక్తి అవసరం లేదు. మీకు కొంచెం అవగాహన అవసరం అంతే. అందుకే పొగాకు నిషేధించిన మొదటి రాష్ట్రం కేరళ ముందుంటే, పొగాకు రహిత రాష్ట్రంగా హిమచలప్రదేశ్ ఉండడం గమనర్హం. ఇది 35 వేల కోట్ల పరిశ్రమతో 36 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎక్సైజ్ ఆదాయంలో చాల సిగరెట్స్ ద్వారానే లభిస్తోంది. (10% వాటాకల్గి ఉంది) అందుకే పొగాకుని పూర్తిగా ప్రభుత్వం నిషేదించలేదు. □

# రోజంతా ఐలైనర్ ఉండాలంటే..



కంటిని ఇంపుగా తీర్చిదిద్దుకోవడానికి ఎంతో కష్టపడి ఐలైనర్ పెట్టుకుంటాం. అయితే రోజంతా ఐ లైనర్ అలాగే నిలిచి ఉంటుందా అంటే.. కష్టమే అని చెప్పాలి. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఇది సాధ్యమేనంటున్నారు నిపుణులు. అవేంటంటే..!

✦ .ముఖానికి మాయిశ్చరైజర్ రాసుకునే దృష్టి, కనురెప్పల చుట్టూ కూడా అప్లై చేసుకొని.. ఆపై ఐలైనర్ పెట్టుకుంటారు చాలామంది. అయితే దీనివల్ల ఐలైనర్ త్వరగా చెదిరిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు ఐలైనర్ పెట్టుకోవాలనుకుంటే ఆ ప్రదేశంలో మాయిశ్చరైజర్ రాసుకోకపోవడమే మంచిది.

✦ పదే పదే ముఖం కడుక్కోవడం, చెమట పట్టడం వల్ల కూడా ఐ లైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండదు. అలాంటప్పుడు వాటర్ ప్రూఫ్ లేదా జెల్ తరహా ఐలైనర్ ఫీచర్ మేలు.


✦. అద్దీ అద్దనట్లుగా కొద్దిపాటి పౌడర్‌ని ఉపయోగిస్తే ఐ-లైనర్ మెరుపు తగ్గకుండా చూసుకోవచ్చు. అలాగే ముందు పౌడర్ రాసుకొని ఆపై ఐలైనర్ అప్లై చేసుకున్న ఫలితం ఉంటుంది.

✦ ముఖానికి మేకప్ వేసుకునే ముందు ప్రైమర్ ఎలాగైతే రాసుకుంటామో.. ఐ-లైనర్ పెట్టుకోవడానికి ముందు కూడా ఐ ప్రైమర్ అప్లై చేయడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే అది కూడా తక్కువ మొత్తంలో రాసుకుంటే ఐలైనర్ ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది.

5. ఐషాడో కూడా ఐలైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండేందుకు సహకరిస్తుంది. ఈ క్రమం ఐలైనర్ వేసుకోవడం పూర్తయ్యాక.. బ్రష్ సహాయంతో కనురెప్పలపై షాడోని పైపైన అమర్చి సరిపోతుంది.

6. ఐలైనర్ అప్లై చేసుకున్న తర్వాత ఫైనల్‌గా కన్సీలర్‌తో టచప్ ఇచ్చినా చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. □

# విగ్రహాల విశిష్టత



**శిల, లోహ విగ్రహాలకు** భిన్నంగా పూరీ దేవాలయంలో దేవతామూర్తులు కర్రతో రూపుదిద్దుకోవటం విశేషం. దారువుతో (కొయ్య) తయారైనందువల్ల ఇక్కడి మూలమూర్తిని దారుబ్రహ్మం అంటారు. అలాగే ఒకే దారువు సుదర్శనమూర్తితో కలిపి నాలుగు విగ్రహాలుగా అయ్యిందని పురాణోక్తి. ఈ విగ్రహాల శిల్పరీతి అపురూపం. ఇక్కడి దేవతలు వదన ప్రధాన దేవతలు. అంటే భావ ప్రకటనకు స్థానమైన ముఖాలే ప్రధానంగా ఉన్న విగ్రహాలు. ఈ ప్రతిమల్లో జ్ఞానేంద్రియాలే ప్రముఖంగా కనిపించటం విశేషం. వీటిని తొలుత చతుర్ముఖ బ్రహ్మ ప్రతిష్ఠించాడన్నది పురాణ వచనం. ఆయన విధించిన నియమాల ప్రకారం-పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే ప్రతి అధిక ఆషాఢంలో పూజారులకు కలలో కనిపించే విశేష దారువులు సేకరించి కొత్త విగ్రహాలను మలుస్తారు. పాత ప్రతిమల స్థానంలో కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించటం ఆనవాయితీ. ప్రధానమూర్తి నయనాలు గుండ్రంగా, రెప్పలు లేకుండా ఉంటాయి. పరమాత్ముడు రెప్ప వేయకుండా అనుక్షణం కాపాడుతాడు అనటానికిది సాక్ష్యం. పూరీ జగన్నాథుడికి చక్ర నయనుడు అని కూడా పేరు. నల్లని జగన్నాథుడు తెల్లని బలభద్రుడు, పసుపుపచ్చని సుభద్రమ్మలతో పాటు స్తంభాకృతిలో ఉన్న మరో దారువుపై చక్రాయుధ దైవమైన సుదర్శనస్వామి ఈ ఆలయంలో దర్శనమిస్తాడు. □

ఆధ్యాత్మికం

# ఈ పండులో పోషకాలు మెండు!



డ్రాగన్ ఫ్రూట్.. ఈ మధ్య ఎక్కడ చూసినా ఈ విదేశీ పండు చర్చే. ఇప్పుడు మన దగ్గరా వీటిని విస్తారంగా పండిస్తుండటంతో అందరికీ అందుబాటులోకి వచ్చేసింది. మరి ఇంతకీ ఇది చేసే మేలెంటో తెలుసుకుందాం..

✦ ఇందులో పీచు, మాంస కృతులు, ఇనుము, జింక్, మెగ్నీసియం, ఫాస్పరస్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. నిస్సత్తువ నుంచి బయటపడాలంటే ఈ పండు ముక్కలు కాసిన్ని తింటే చాలు. అలానే రక్తహీనతను అధిగమించాలన్నా ఐరన్ అధికంగా ఉండే వీటిని తీసుకోవచ్చు.

✦ డ్రాగన్ పండులో ఉండే పిటయా అనే పోషకం రోగనిరోధకతను పెంచుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి హాని చేసే ఫ్రీరాడికల్స్‌ని నాశనం చేసి క్యాన్సర్ ముప్పుని అడ్డుకుంటాయట. ఇక, ఇందులోని ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్, ఫైబర్ వంటివి చక్కెర స్థాయుల్ని అదుపు చేస్తాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ని మెరుగుపరుస్తాయి.

✦ ఇక దీని గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మేలు చేసే కొలెస్ట్రాల్‌ని పెంచితే, మెగ్నీసియం గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నీరు, పీచు సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండటమే కాదు.. బరువూ అదుపులో ఉంటుంది. □

# గోపీచంద్ బర్త్ డే గ్లింప్స్ రిలీజ్

**మాచో స్టార్** గోపీచంద్ ప్రస్తుతం తన కొత్త చిత్రం గోపీచంద్33లో నటిస్తున్నారు. విజనరీ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ హిస్టారికల్ ఎపిక్ షూటింగ్ జరుగుతోంది.గోపీచంద్ పుట్టినరోజును పురస్కరించుకుని, మేకర్స్ అద్భుతమైన పోస్టర్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. గోపీచంద్ లుక్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఒక యోధుడిగా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. పొడవాటి జుట్టు, యుద్ధగాయాలు, నుదిటిపై వీర తిలకంతో కనిపించిన ఇంటెన్స్ లుక్ ఫ్యాన్స్‌ను సర్ ప్రైజ్ చేసింది. చేతిలో ఖడ్గంతో యుద్ధరంగంలో కనిపించిన ఈ పోస్టర్ శక్తి, శౌర్యాన్ని ప్రజెంట్ చేస్తోంది. మంచుతో కప్పబడిన అద్భుతమైన పర్వత శ్రేణుల నడుమ గ్లింప్స్ ప్రారంభమవుతుంది. ఓ యోధుడు తన టెంట్ నుంచి బయటకు వస్తాడు. తాను ప్రేమగా పెంచిన గుర్రంతో మమేకమయ్యే విజువల్ లో తన తలను గుర్రం తలపై ఆనిస్తూ, మౌనంగా ఓ వాగ్దానాన్ని చేస్తాడు. దీనికి బ్యాక్గ్రౌండ్‌లో "ధీర ధీర" సంగీతం మ్యాజికల్ అనుభూతిని కలిగిస్తుంది. ఈ విజువల్స్ మనసును తాకుతూనే పవర్‌ఫుల్‌గా, పీస్ మెడిటేటివ్ ఫీల్‌ను ఇస్తున్నాయి. జిబి 71 (ఆకాశంలో), ఘాజి (నీటిలో), అంతరిక్షం (అంతరిక్షంలో) వంటి విభిన్న కథనాల చిత్రాలతో తన ప్రత్యేక కథనశైలి, సాంకేతిక నైపుణ్యంతో గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి, ఇప్పుడు మరో డిఫరెంట్ జానర్‌లోకి అడుగు పెట్టారు. సంకల్ప్ రెడ్డి ఈ సినిమాలో భారతదేశ చరిత్రలో మరిచిపోయిన ఒక కీలక ఘట్టాన్ని అద్భుతంగా మలిచారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, మరిచిపోయిన అధ్యాయానికి మళ్లీ జీవంపోస్తోంది. గోపిచంద్ ఈ సినిమాలో ఇప్పటివరకు ఎప్పుడూ చూడనివంటి విభిన్న పాత్రలో కనిపించనున్నారు. ఈ ఏప్రిల్‌లో కాశ్మీర్ అందమైన లొకేషన్లలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయ్యింది. ఆ అద్భుత దృశ్యాలు బిగ్ స్క్రీన్‌పై గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రూపొందించిన సెట్లో నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించి ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



తారాగణం: గోపీచంద్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి
నిర్మాత: శ్రీనివాసా చిట్టూరి, బ్యానర్: శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్,
సమర్పణ: పవన్ కుమార్
పీఆర్వో: వంశీశేఖర్
మార్కెటింగ్: విష్ణు తేజ్ పుట్ట.

# 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను విజయవంతం చేయాలి: దిల్‌రాజు

**కొంత విరామం** తరువాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సాహించే సంప్రదాయ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు వాటిలో నటించి ఉత్తమ ప్రతిభను చూపిన నటీనటులకు, సాంకేతిక నిపుణులతో పాటు 2014 జూన్ నుండి 2024 డిసెంబర్ 31 వరకు సెన్సారు జరుపుకున్న చిత్రాల్లో కూడా ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ఇందులో భాగంగా అవార్డ్స్ ఇవ్వనున్నారు. ఇటీవల విజేతల జాబితాను కూడా ప్రటించారు. కాగా అపూర్వ వేడుక కోసం హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. జూన్ 14న అంగరంగ వైభవంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. దాదాపు కొంత విరామం తరువాత ప్రభుత్వ అందిస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డులు అందుకోవడం పట్ల అవార్డుల విజేతలు, తెలుగు సినిమా ప్రముఖులు, తెలుగు సినిమా ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రతిభను గుర్తించి తగు రీతిలో సత్కరించబోతున్న తెలంగాణ ప్రభుత్వం మీద ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ఈ వేడుకను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, అత్యంత ఘనంగా జరిపించడానికి తగు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు తెలుగు తారాలోకమంతా తరలి రాబోతున్నారు. తప్పకుండా జూన్ 14న హైటెక్స్ వేడుక తారల తళుకులతో ప్రకాశవంతం కాబోతుంది. కాగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఈ నెల 14న హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దరు అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది. 14 సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలసిన బాధ్యత సినీ పరిశ్రమపై కూడా ఉంది. ఆ రోజు కార్యక్రమానికి ఐ అండ్ పీఆర్ ద్వారా లైవ్ ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఈవెంట్ అందరికి రీచ్ అవ్వాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సాయంత్రం ఆరు గంటలకు ఈ వేడుక ప్రారంభం కానుంది. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాల్లో ప్రతి ఏడాది నుంచి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి వాటికి ఈ వేడుకలో అవార్డులు అందిస్తున్నాం. ప్రతి సంవత్సరానికి సంబంధించి ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలకు పనిచేసిన హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు అందిస్తున్నాం. ఇలాంటి ఓ మంచి సాంప్రదాయాన్ని గద్దర్ ఫిల్మ్ అవార్డులతో ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ సాంకేతిక నిపుణులకు కూడా అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే. 14 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ వేడుకను తెలుగు సినీ పరిశ్రమ లోని అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.



# 'డ్యూడ్' 80శాతం షూటింగ్ పూర్తి

**మల్టీ టాలెంటెడ్** తేజ్ నటిస్తూ కన్నడ తెలుగు మలయాళ భాషల్లో దర్శకత్వం వహిస్తున్న త్రిభాషా చిత్రం డ్యూడ్. ఫుట్ బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే ఈ చిత్రాన్ని ఫుట్ బాల్ ప్రేమికుడైన స్వర్గీయ కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ కు అంకితం చేస్తున్నారు. 80శాతం షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న డ్యూడ్ చిత్రం టీజర్ త్వరలో విడుదల చేయనున్నారు. హీరో కమ్ డైరెక్టర్ తేజ్ మాట్లాడుతూ, హీరోగా, డైరెక్టర్‌గా డ్యూడ్ చిత్రం ఔట్ పుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. రష్ చూసుకుంటుంటేనే చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. ఎప్పుడెప్పుడు ఆడియన్స్‌తో కలిసి థియేటర్స్ లో సినిమా చూసుకుంటామా అని చాలా ఆత్రంగా ఉంది. సినిమా ఇంత బాగా రావడానికి కారకులైన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. త్వరలో టీజర్ రిలీజ్ చేసి, అప్పటి నుంచి ప్రచార కార్యమాలు ముమ్మరం చేస్తాం అని అన్నారు. రంగాయన రఘు ఫుట్ బాల్ కోచ్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఇదే ఏడాదిలో విడుదల చేసేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఏక కాలంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న రాఘవేంద్ర రాజ్ కుమార్, ఈ చిత్రానికి స్క్రిప్ట్ కన్సల్టెంట్‌గా కూడా వ్యవహరించడం విశేషం.



# 'హార్ట్ బీట్'తో యోగలక్ష్మి పాపులర్

**అందానికి** మరింత అందాన్ని తెచ్చేవి.. ఆకర్షణకి మరింత ఆకర్షణ పెంచేవి కళ్లే.. అందమైన కళ్లు మాట్లాడతాయి.. పాటలు పాడతాయి.. పాఠాలు కూడా చెబుతాయి. ఆ మాటకొస్తే మాటల్లో చెప్పలేని భావాలను ఆవిష్కరించే అందమైన వాకిళ్ల కళ్లు. తళుక్కుమని మెరిసే కనుల నుంచి కరెంటు పుడుతుందనే విషయం కుర్రాళ్లందరికీ తెలుసు. అలాంటి కళ్లున్న అమ్మాయి కనిపిస్తే, కలలు కనని కళ్లు ఉండవు. అలా ఇప్పుడు కలల్లో తేలి పోతున్న కుర్రాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. ఎప్పటి నుంచి అంటే, టూరిస్ట్ ఫ్యామిలీ సినిమాలో యోగలక్ష్మిని చూసినప్పటి నుంచి అనే చెప్పాలి. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ రాఘవన్ కూతురు కురల్ పాత్రలో ఆమె కనిపిస్తుంది. కథానాయకుడు ధర్మదాస్ పెద్ద కొడుకుతో ప్రేమలో పడుతుంది. ఈ పాత్రలో యోగలక్ష్మి కనిపించింది అక్కడక్కడే అయినా, ఆకర్షణీయమైన కళ్లతో.. పదునైనచూపులతో విన్యాసాలు చేసింది. దాంతో అసలు ఈ అమ్మాయి ఎవరూ అనేది తెలుసుకోవడానికి కుర్రాళ్లంతా సెర్చ్ చేయడంలో పడ్డారు. తమిళనాడుకు చెందిన యోగలక్ష్మి ఇంతకుముందు షార్ట్ ఫిలిమ్స్ చేసింది.. వెబ్ సిరీస్‌లు చేసింది. అయితే ఇటీవల హాట్ స్టార్‌కి వచ్చిన హార్ట్ బీట్‌తో ఆమె చాలామంది కళ్లలో పడింది. ఈ సిరీస్‌లో ఆమె నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను చేసినప్పటికి, మంచి మార్కులు కొట్టేసింది. అందుకు కారణం నేరేడుపండ్ల లాంటి ఆమె కళ్లు.. అవి సంధించిన చురుకైన చూపులే అని చెప్పాలి. టూరిస్ట్ ఫ్యామిలీతో ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్న ఈ బ్యూటీ, ఇకపై సినిమాలలో మరింత బిజీ అయ్యే ఛాన్స్ లేకపోలేదు.



# 'మార్గన్' మూవీ తెలుగులో విడుదల

**హీరోగా,** నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, పాటల రచయితగా, ఎడిటర్‌గా ఇలా మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోని ఎప్పుడూ ఆడియెన్స్‌ను కొత్త పాయింట్‌తో ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. ఆయన నటిస్తూ, నిర్మించిన నూతన చిత్రం మార్గన్. లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. మర్డర్ మిస్టరీక్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీని జూన్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. మళ్లీ విజయ్ ఆంటోని ఓ డిఫరెంట్ కాన్సెప్ట్, కొత్త పాయింట్‌ను టచ్ చేశారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. ఇక ఇలాంటి కొత్త కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాల్ని అందించడంలో సురేష్ ప్రొడక్షన్స్ ముందుంటుందన్న సంగతి తెలిసిందే. మార్గన్ మీదున్న నమ్మకంతో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ సురేష్‌బాబు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. జూన్ 27న ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు హీరో, నిర్మాత విజయ్ ఆంటోని సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# 'గేదెలరాజు కాకినాడ తాలూకా' ఫస్ట్‌లుక్

**చూస్తే ఒకటే నిజం** చూడకపోతే వంద అనుమానాలు అనే ఒక నిజాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు చిత్రయూనిట్. శుక్రవారం రఘు జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదలచేశారు. ఫస్ట్‌లుక్‌లో ఎంతో ఫెరోసియస్‌గా కనిపిస్తున్నారాయన. మోటూరి టాకీస్ పతా కంపై రఘుకుంచే సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. రవిఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మోనిక తదితరులు నటించారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు- రవిఆనంద్ చిన్నిబిల్లి, తాడాల వీరభద్రరావు, గీతార్థ్ కుంచే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- కిరణ్ తాతపూడి, దివ్య మోటూరి పబ్లిసిటి డిజైనర్- ఏజే ఆర్ట్స్ అజయ్, విఎఫ్ఎక్స్- కొత్తపల్లి సునీల్, లిరిక్స్- గిరిధర్ రాగోలు, లలిత కాంతారావు ఎడిటర్- సుధీర్ ఎడ్ల, కాస్ట్యూమ్ డిజైనర్- సింధూ ధిలీషా, పిఆర్ఓ- శివ మల్లాల, మూర్తి మల్లాల ఆర్ట్- అమర్ తలారి, చీఫ్ అసోసియేట్ గౌరి శంకర్ కో డైరెక్టర్- శేఖర్ కుంపట్ల, సంగీతం- రఘు కుంచే, నిర్మాత- వాణి రవికుమార్ మోటూరి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం-చైతన్య మోటూరి.



# లేటెస్ట్ ఫొటో షూట్‌లో 'మాళవిక మోహనన్'

**ఇటీవల కాలంలో** సెలబ్రిటీలు సోషల్ మీడియాను ఓ సాధనంగా వాడుతున్నారనే విషయం తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఈజీగా రీచ్ కావొచ్చనే అభిప్రాయం చాలామంది సెలబ్రిటీల్లో నెలకొంది. అయితే కొంతమంది సెలబ్రిటీలు ఈ సోషల్ మీడియా ద్వారా తమ టాలెంట్‌ను బయటపెడుతున్నారు. స్టార్ హీరోయిన్లు సైతం సోషల్ మీడియా గట్టిగానే వాడుతున్నారు. సరిగ్గా ఇప్పుడు ఇదే పని చేస్తోంది హీరోయిన్ మాళవిక మోహనన్. తమిళ ఇండస్ట్రీలో మాళవిక మోహనన్ ఇప్పుడు స్టార్ హీరోయిన్. ఆమె ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహనన్ కుమార్తె. ఆమె 1993 ఆగస్టు 4న కేరళలోని పయ్యనూరులో జన్మించింది.మాళవిక మోహనన్ 2013లో మలయాళ చిత్రం పట్టం పోల్ ద్వారా సినీ ఎంట్రీ ఇచ్చింది. తమిళంతో పాటు, మలయాళం, తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఆ తర్వాత ఆమె ది గ్రేట్ ఫాదర్,పేట్ట, మాస్టర్ వంటి విజయ వంతమైన చిత్రాలలో నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆమె తన నటనకు గాను అనేక అవార్డులను అందుకుంది. మాళవిక మోహనన్ తెలుగులో హీరో అనే చిత్రంలో నటించింది. ఆమె ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాడీలక్స్ సినిమాలో కూడా నటిస్తోంది. మాళవిక మోహనన్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది.



# సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో 'వైల్డ్ బ్రీత్'

**కంటెంట్** బాగుంటే చిన్న చిత్రాలు కూడా మంచి సక్సెస్ అందుకుంటాయని, హీరోలు అవసరం లేదని అన్నారు ప్రముఖ నటుడు శివాజీ రాజా. రేవు వంటి మంచి మూవీని నిర్మించిన ప్రొడక్షన్ హౌస్ సంహిత్ ఎంటర్ టైన్ మెంట్స్ లో మరో ఇంట్రెస్టింగ్ మూవీ వైల్డ్ బ్రీత్‌ను యంగ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. డా.మురళీ చంద్ గింజుపల్లితో కలిసి పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగినకార్యక్రమంలో ప్రముఖ నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలుతుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ అతిథులుగా హాజర య్యారు. పలువురు పాత్రికేయ మిత్రుల సమక్షంలో వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ, నాకు ఎంతో సన్నిహితులైన మీడియా మిత్రులు ఉన్నారు. నేను కెరీర్ ప్రారంభం నుంచీ వారితో స్నేహం చేస్తున్నా. అలాంటి మీడియా మిత్రుల్లో ఒకరైన పర్వతనేని రాంబాబు నిర్మాతగా వైల్డ్ బ్రీత్ సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ మధ్య కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలెన్నో విజయాలు సాధిస్తున్నాయి. వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా బాగున్నాయి. పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఆయన నిర్మాతగా ఎన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా. అలాగే దర్శకుడు హరినాథ్ పులి మంచి పేరు తెచ్చుకోవాలి. స్టార్స్ వెంట పడటం కాదు కథ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు అన్నారు. నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన పుట్టినరోజున ఈ వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మన మీడియా ఫ్రెండ్స్‌లో బీఏ రాజు నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నారు.





14-6pg10.qxd:14-6pg10.qxd 1/1/02 5:57 AM Page 1



# తీవ్ర ఒత్తిడిలోనూ అద్భుత ఇన్నింగ్స్

## నాకౌట్లలోనూ హాఫ్ సెంచరీలు
## కీలక విజయాలు అందించిన హీరోలు


సచిన్ టెండుల్కర్


విరాట్ కోహ్లీ


స్టీవ్ స్మిత్


జాక్వెస్ కల్లిస్

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో ఐసిసి టోర్నమెంట్లు అంటేనే ఆటగాళ్లకి అగ్నిపరీక్ష. అందులోనూ నాకౌట్‌మ్యాచ్‌లుఅంటే ఒత్తిడి తారాస్థాయిలో ఉంటుంది. అలాంటి కీలక సమయాల్లో నిలకడగా రాణించడం ఏ బ్యాట్స్‌మెన్‌కైనా పెద్ద సవాలు. అయితే ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ ఈ సవాలును ఛేదించి, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక 50+ స్కోర్లు సాధించిన ఆటగాళ్ల ఎలైట్ జాబితాలో చేరి అరుదైన రికార్డును నెలకొల్పాడు. ఈ ఎలైట్ జాబితాలో అగ్రస్థానంలో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఉన్నాడు. అతను ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో పది 50+ స్కోర్లతో అసమానంగా నిలిచాడు. తన కెరీర్‌లో 22 ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, కోహ్లీ 51.20 సగటుతో 1000 పైగా పరుగులు సాధించాడు. ఇందులో తొమ్మిది హాఫ్ సెంచరీలు, 2023 ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై వచ్చిన సెంచరీ ఉన్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ టెస్ట్ క్రికెట్‌లో, ఈ తరంలో అతిపెద్ద క్లచ్ ప్లేయర్‌గా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ఇక ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, 36 ఏళ్ల అనుభవజ్ఞుడు కేవలం 13 మ్యాచ్‌లలో ఏడు 50+ స్కోర్‌లను నమోదుచేశాడు. 59.09 సగటుతో 5 హాఫ్ సెంచరీలు, రెండు మ్యాచ్ డిఫైనింగ్ సెంచరీలు ఉన్నాయి. ఈ రెండూ 2015 ఐసిసి ప్రపంచ కప్, 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియాకు టైటిల్స్ సాధించడంలో కీలకంగామారాయి. ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచిన టీమిండియా దిగ్గజం సచిన్, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో ఆరు 50+ స్కోర్లు సాధించాడు.

అలాగే, టెండూల్కర్ మొత్తం 682 పరుగులు సాధించాడు. వాటిలో ఐదు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీఉన్నాయి. అలాగే సౌరవ్ గంగూలీ, జాక్వెస్ కల్లిస్, కుమార్ సంగక్కర, కేన్ విలియమ్సన్‌లు ఐసిసి నాకౌట్‌లలో ఐదుసార్లు 50+ స్కోర్లు సాధించారు. తీవ్రమైన ఒత్తిడిలోనూ వీరు అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుని, తమ జట్టుకు కీలక విజయాలను అందించారు.



## టి20 ముంబై లీగ్‌లో.. విజేతగా
# మరాఠా రాయల్స్
### 5 వికెట్ల తేడాతో ముంబై ఫాల్కన్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** టి20 ముంబై లీగ్-2025, ఫైనల్ మ్యాచ్‌లో సోబో ముంబై ఫాల్కన్స్‌ను ఓడించి మరాఠా రాయల్స్ ట్రోఫీని ఎత్తేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే పరిమితం చేసి, ఆపై టి20 ముంబై లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను గెలుచుకోవడానికి నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. రాజేష్ సుతార్ అర్ధ సెంచరీ, అవాయిస్ నౌషాద్ ఉపయోగకరమైన సహకారం ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్‌ను విజేతగా నిలిపింది. తొలుత బౌలింగ్ ఎంచుకున్న మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే కట్టడి చేసింది. ఆతర్వాత సుతార్ 49 బంతుల్లో 53 పరుగులు చేసి, రెండు బౌండరీలు, సిక్సర్లతో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. నౌషాద్ 38 (24 బంతులు) పరుగులు చేసి, సుతార్‌తో కలిసి నాల్గవ వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు, ఈ జంట మరాఠా రాయల్స్‌ను విజయ ద్వారం వద్దకు తీసుకెళ్లింది. అంతకుముందు, మయూరేష్ టాండెల్ (50 నాటౌట్), హర్ష్ అఘవ్ (45 నాటౌట్) 49 బంతుల్లో 85 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ముంబై ఫాల్కన్స్ 157/4 స్కోరు చేయగలిగింది. 12వ ఓవర్లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అవుట్ కావడంతో జట్టు స్కోరు 72/4కి తగ్గే వరకు ఆటలో సగం సమయానికి 60/3తో కష్టాల్లో పడింది. నాలుగు సిక్సర్లు బాదిన అఘవ్, టాండెల్ తో కలిసి స్కోరింగ్ ను వేగవంతం చేసాడు, అయినప్పటికీ జట్టు తక్కువ స్కోరుతో ముగిసింది. సోబో ముంబై ఫాల్కన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 (మయూరేష్ టాండెల్ 50 నాటౌట్, హర్ష్ అఘవ్ 45 నాటౌట్; వైభవ్ మాలి 2/32) ఎమ్మెసి మరాఠా రాయల్స్ చేతిలో 19.2 ఓవర్లలో 158/5 (చిన్మయ్ సుతార్ 53, అవాయిస్ ఖాన్ 38) ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది.



## యూరోపియన్ టూర్‌లో..
# భారత్ మూడో విజయం
### బెల్జియం 3-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల యూరప్‌టూర్‌లో భారత్ వరుసగా మూడో విజయాన్ని సాధించింది. ఆంట్వెర్ప్‌లోని విల్రిజ్క్స్ ప్లీన్‌లోని హాకీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం బెల్జియంపై 3-2 తేడాతో విజయంసాధించి భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు యూరప్‌లో తన విజయాల పరుగును కొనసాగించింది. భారత్‌తరపున సోనమ్ (4వనిముషం), లాల్తాంట్లుంగి (32వ నిముషం), మరియు కనికా సివాచ్ (51వ నిముషం) గోల్స్ సాధించగా, బెల్జియం మేరీ గోయెన్స్ (37వ నిముషం) మరియు మార్టే మేరీ (40వ నిముషం) ద్వారా ప్రతిస్పందించింది. నాల్గవనిమిషంలోనే సోనమ్ ఫీల్డ్‌గోల్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ప్రారంభంలోనేగోల్‌చేసింది. మూడవక్వార్టర్ ప్రారంభంలో లాల్తాంట్లు వాంగి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడం ద్వారా, మొదటి అర్ధభాగం వరకు 1-0 ఆధిక్యాన్ని కొనసాగించిన ఆతిథ్య జట్టు మూడవ క్వార్టర్ ప్రారంభంలో ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. అయితే బెల్జియం పుంజుకుని మూడు నిమిషాల వ్యవధిలో రెండుసార్లు గోల్స్‌చేసింది. 37వనిమిషంలో గోయెన్స్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచింది. 40వ నిమిషంలో మార్టే మేరీ ఫీల్డ్ గోల్ చేసి మ్యాచ్‌ను 2-2తో సమం చేసింది. అయితే, నాల్గవ క్వార్టర్ చివరిలో భారత్ తిరిగి నియంత్రణ సాధించింది. 51వ నిమిషంలో కనికా పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని పునరుద్ధరించింది, దీనితో జట్టు గట్టి పోరాటంతో విజయం సాధించింది.

## టేబుల్ టెన్నిస్‌లో.. సెమీఫైనల్స్‌కు
# యు ముంబా, దబాంగ్ ఢిల్లీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్, సీజన్ 6లో యు ముంబా టిటి 10-5 తేడాతో దబాంగ్ ఢిల్లీ టిటిసిపై విజయం సాధించి నాల్గవ మరియు చివరి సెమీఫైనల్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఓటమితో ఢిల్లీ జట్టు నాలుగు టైలతో గెలిచిన విజయ పరంపరకు తెరపడింది. అయితే సీజన్ 2 ఛాంపియన్స్ ఇప్పటికీ 44 పాయింట్లతో లీగ్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

శుక్రవారం జరిగిన ఈ గేమ్‌లో తొలి సింగిల్స్‌లో లిలియన్ బార్డెట్ యు ముంబా టిటికి సరైన ఆరంభాన్ని ఇచ్చి సత్యన్ జ్ఞానశేఖరన్‌ను 2-1 తేడాతో ఓడించాడు. మొదటి గేమ్‌ను 11-10 తేడాతో ముగించిన తర్వాత, బార్డెట్ రెండవ గేమ్‌ను 4-11 తేడాతో కోల్పోయాడు, కానీ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 11-4 తేడాతో విజయం సాధించి బలంగా స్పందించాడు. ఆ తర్వాత బెర్నాడెట్ సోక్స్ దియా చిటాలేపై 2-1 తేడాతో విజయం సాధించింది. చిటాలే మొదటి గేమ్‌ను 11-3 తేడాతో గెలుచుకున్నాడు, కానీ సోక్స్ 11-10 గోల్డెన్ పాయింట్ విజయంతో సమంచేసి మ్యాచ్‌ను 11-8 తేడాతో ముగించాడు. ఈ జోరు మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా కొనసాగింది, ఆకాష్ పాల్‌తో కలిసి స్జోక్స్ తొలిగేమ్‌లో ఇజాక్‌క్యూక్ మరియు దియా చిటాలేలను ఓడించి యు ముంబా సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించింది. ఢిల్లీ తిరిగి పుంజుకుని, మిగిలిన రెండు గేమ్‌లను గెలుచుకుంది మరియు ఆ తర్వాత మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. సింగపూర్‌కు చెందిన ఇజాక్ క్యూక్‌పై 2-1 తేడాతో విజయం సాధించి అభినంద్ పిబి యు ముంబాకు మరోరెండు పాయింట్లు జోడించాడు. ఈ సీజన్‌లో తొలిసారి ఆడిన అభినంద్ మొదటి రెండు గేమ్‌లను బలంగా ప్రారంభించాడు, ఆ తర్వాత ఇజాక్ 11-7 తేడాతో ఒక విజయం సాధించి దబాంగ్ ఢిల్లీని పట్టికలో అగ్రస్థానానికి చేర్చాడు. చివరి రబ్బర్‌లో, యశస్విని ఘోర్పడే తన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్స్ 2023 సహచరురాలు సుహానా సైనిని 3-0 తేడాతో ఓడించి, గోల్డెన్ పాయింట్‌పై రెండు గట్టి గేమ్‌లను గెలిచి 11-3 తేడాతో మ్యాచ్‌ను ముగించింది. స్జోక్స్ విదేశీ ఆటగాడు మరియు షాట్ ఆఫ్ ది టై అనే డబుల్ గౌరవాలను గెలుచుకోగా, యశస్విని ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ది టైగా ఎంపికైంది.

## క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో
# క్వార్టర్ ఫైనల్స్‌కు జెంగ్ క్విన్వెన్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్ కార్ట్నీ కెస్లర్‌కు ఓటమి ఎదురైంది. లండన్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్‌కార్ట్నీ కెస్లర్‌ను 6-3, 4-6, 7-5 తేడాతో ఓడించడంతో జెంగ్ క్విన్వెన్ క్వీన్స్ క్లబ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ 42వ ర్యాంక్ ప్లేయర్ జెంగ్‌తో జరిగిన చివరి 16వ ర్యాంక్ మ్యాచ్‌లో చివరి సెట్‌లో 42తో వెనుకబడి ఉంది. కానీ పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ పశ్చిమ లండన్‌లో జరిగిన వింబుల్డన్ వార్మప్ ఈవెంట్‌లో ఓటమిని నివారించడానికి ప్రయత్నించింది. గత సంవత్సరం రోలాండ్ గారోస్‌లో జరిగిన క్లే కోర్టులో డోనా వెకిక్‌ను ఓడించి జెంగ్ సింగిల్స్ ఈవెంట్‌లో ఒలింపిక్ స్వర్ణం గెలిచిన తొలి ఆసియా క్రీడాకారిణిగా నిలిచింది. ప్రస్తుతం డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో ఐదవ స్థానంలో ఉన్న 22 ఏళ్ల ఆమె ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది. 52 సంవత్సరాల తర్వాత క్వీన్స్‌లో జరిగిన తొలి మహిళల ఈవెంట్‌లో, 2022 వింబుల్డన్ ఛాంపియన్ మరియు నాల్గవ సీడ్ ఎలెనా రైబాకినా బ్రిటన్‌కు చెందిన హీథర్ వాట్సన్‌పై 6-4, 6-2 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. కాగా చివరి ఎనిమిది మ్యాచ్‌లో రైబాకినా జర్మనీకి చెందిన టాట్జానా మరియాతో తలపడనుంది, ఆస్ట్రేలియన్ ఓపెన్ హోల్డర్ మాడిసన్ కీస్ ష్నైడర్‌తో తలపడనుంది.

# మొబైల్ వినియోగదారులకు టెలికాం కొత్త రూల్స్

**ముంబై, జూన్ 13:** మొబైల్ వినియోగదారులకు కేంద్ర టెలికాం శాఖ (డాట్) ఒక శుభవార్త అందించింది. ప్రీపెయిడ్ కనెక్షన్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు లేదా పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మారాలనుకునే కస్టమర్ల కోసం నిబంధనలను సరళతరం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమకు నచ్చిన ప్లాన్‌కు మారేందుకు పట్టే సమయం గణనీయంగా తగ్గనుంది. ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) ఆధారిత కేవైసీ ప్రక్రియ ద్వారా ఈ మార్పులను సులభతరం చేసినట్లు టెలికాం శాఖ వెల్లడించింది. ఇంతకుముందు, ఒక వినియోగదారుడు తన మొబైల్ సర్వీస్‌ను ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు మార్చుకున్న తర్వాత, మళ్లీ మరోసారి ప్లాన్ మార్చుకోవాలంటే కనీసం 90 రోజుల పాటు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ వ్యవధిని కూలింగ్ ఆఫ్ పీరియడ్‌గా పరిగణించేవారు. అయితే, జూన్ 10న టెలికాం శాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం, ఈ నిరీక్షణ కాలాన్ని 30 రోజులకు కుదించారు. అంటే, ఒకసారి ప్లాన్ మార్చుకున్న తర్వాత, కేవలం 30 రోజుల వ్యవధిలోనే మరోసారి తమకు అనుకూలమైన ప్లాన్‌కు మారేందుకు అవకాశం కల్పించారు. ఈ కొత్త సదుపాయాన్ని పొందాలనుకునే వినియోగదారులు తమ సమీపంలోని టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల యొక్క కస్టమర్ సర్వీస్ కేంద్రాలను లేదా అధీకృత ఔట్‌లెట్‌లను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడ ఓటీపీ ఆధారిత కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ఈ మార్పును చేసుకోవచ్చు. ఈ విషయాన్ని డాట్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తెలియజేసింది. అయితే, ఈ 30 రోజుల నిరీక్షణ కాలపు తగ్గింపు



సౌకర్యం కేవలం మొదటిసారి తమ ప్లాన్‌ను మార్చుకునే వారికి మాత్రమే వర్తిస్తుందని టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఒక వినియోగదారుడు ఈ వెసులుబాటును ఒకసారి ఉపయోగించుకున్న తర్వాత, భవిష్యత్తులో మళ్లీ ప్లాన్ మార్చుకోవాలనుకుంటే, అప్పుడు పాత పద్ధతిలోనే 90 రోజుల నిరీక్షణ కాలాన్ని పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కొత్త నిబంధన వల్ల వినియోగదారుల సమయం ఆదా అవ్వడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన సర్వీసులను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది.

# భారత్ నుంచే అమెరికాకు 97% ఐఫోన్ల ఎగుమతి..

**వాషింగ్టన్, జూన్ 13:** చైనాపై అమెరికా విధించిన సుంకాలను ఎదుర్కొనే ప్రక్రియలో భాగంగా ఆపిల్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది మార్చి-మే మధ్య కరించింది. చైనా నుంచి ఎగుమతి చేసే ఐఫోన్‌లపై అధిక సుంకాలు ఉండటంతో యాపిల్ భారత్‌లో ఉత్పత్తిని వేగవంతం చేసింది. మార్చి-మే మధ్య కాలంలో భారత్ నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను అమెరికాకు ఎగుమతి చేసింది. మార్చిలో రికార్డు స్థాయిలో 1.3 బిలియన్ డాలర్లు, మేలో 1 బిలి యన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అమెరికాకు పంపింది. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లోనే 4.4 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను ఎగుమతి చేసింది. ఇది గతేడాది లో ఎగుమతైన 3.7 బిలియన్ డాలర్ల ఐఫోన్ల విలువ కంటే ఎక్కువ. అమెరికా.. భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో అదనపు సుంకాన్ని నివారించేందుకు భారత్ చర్చలు కొనసాగిస్తోంది. ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా కొనసాగుతుంది. మరోవైపు చైనా, అమెరికా దేశాలు సుంకాలను తగ్గించే ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి.



భారత్ నుంచి ఎగుమతి చేసిన ఐఫోన్‌లలో 97శాతం అమెరికాకు చేరాయి. గతంలో భారత్ నుంచి నెదర్లాండ్, బ్రిటన్ వంటిదేశాలకు ఐఫోన్లు ఎక్కువగా ఎగుమతయ్యేవి. కానీ ఇప్పుడు పూర్తిగా అమెరికాపై యాపిల్ దృష్టి కేంద్రీ

# వరల్డ్ టాప్ 20 ధనవంతుల్లో అంబానీ, అదానీ

**ముంబై, జూన్ 13:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ మరోసారి బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో తన సత్తా చాటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యం



త ధనవంతుల జాబితా ఉన్న ఈ సూచీలో ముఖేష్ అంబానీ 17వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ 20 స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే ఈ ఇండెక్స్‌లో టాప్‌లో టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్, తర్వాత స్థానాల్లో మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ అధినేత జెఫ్‌బెజోస్ నిలిచారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో ఇండియా నుంచి ముఖేష్ అంబానీ 17వ స్థానం, గౌతమ్ అదానీ 20వ స్థానంలో, శివ్‌నాడార్ 41వ స్థానంలో, షాపూర్ మిస్త్రీ 52వ స్థానంలో, సావిత్రి జిందాల్ 59వ స్థానంలో, అజీమ్ ప్రేమ్‌జీ 69వ స్థానంలో, సునిల్ మిట్టల్ 73వ స్థానంలో, దిలీప్ సంఘ్వీ 79వ స్థానంలో, లక్ష్మీ మిట్టల్ 86వ స్థానంలలో నిలిచారు.

# వాణిజ్యం

## స్టాక్ సూచీలను దెబ్బతీసిన ఇన్వెస్టర్ సెంటిమెంట్

**ముంబై, జూన్ 13:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపై పడింది. దీంతో ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,600 దిగువకు చేరింది. చివరకు రెండు ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,427.81 పాయింట్ల (క్రితం ముగింపు 81,691.98) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,354.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 573 పాయింట్ల నష్టంతో 81,118 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,473.00 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 169 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీశాయి. ముఖ్యంగా చమురు రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎటర్నల్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.39 డాలర్ల వద్ద ట్రేడవగా.. బంగారం ఔన్సు 3,445 డాలర్ల వద్ద కొనసాగింది. ఇజ్రాయెల్-ఇరాన్ సంక్షోభం అంతర్జాతీయ మార్కెట్లను మాత్రమే కాకుండా, దేశీయ మార్కెట్లపై కూడా భారీ ప్రభావాన్ని చూపుతోంది. చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయిమారకం విలువ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యూహాలు అమలు చేయాలి.



## చమురు ధరలపై ఇరాన్-ఇజ్రాయెల్ వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 13:** ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతం పైగా పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం చమురు ధరలపై ప్రభావం చూపుతోంది. ఈ దాడులతో హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే గ్లోబల్ ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడొచ్చనే ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చమురు రంగ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి రూ.299.20 వద్ద ట్రేడవుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి. దాదాపు 40 కి.మీ. మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీ.లు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1 కోట్ల (21 మిలియన్) బ్యారెళ్ల చమురుఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజు వారీ వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది.



## పెట్టుబడులకు మద్దతుగా పిఎల్ఐ స్కీమ్

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎలక్ట్రిక్, ఇతరత్రా ప్రత్యామ్నాయ ఇంధనాలతో పని చేసే హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ తయారీ కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి ప్రోత్సాహక పథకాన్ని (పిఎల్ఐ) ప్రవేశపెడ్తితే మరిన్ని కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుందని ఓ నివేదిక తెలిపింది. ప్రస్తుతం దేశీయంగా ఇలాంటి వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడంతో భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ విభాగంపై తయారీ సంస్థలు, సరఫరాదారులు పెద్ద స్థాయిలో ఇన్వెస్ట్ చేయకపోవచ్చని పేర్కొంది. పిఎల్ఐ స్కీమును ప్రకటిస్తే కొత్త పెట్టుబడులు వస్తాయి. తయారీ, ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌డి విభాగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఎలక్ట్రిక్, ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే హెచ్ఇఎంఎంలను దేశీయంగా ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాలు పెరుగుతాయి అని భారతీయ ఖనిజ పరిశ్రమ సమాఖ్య (ఎఫ్ఐఎంఐ) రూపొందించిన నివేదిక తెలిపింది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌తో కలిసి ఎఫ్ఐఎంఐ దీన్ని రూపొందించింది. మైనింగ్ కార్యకలాపాల్లో కీలకమైన హెచ్ఇఎంఎంలు, కర్బన ఉద్గారాలకు కారణంగా ఉంటున్నందున పర్యావరణహితమైన మెషినరీపై ఆసక్తి ఏర్పడుతోంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.